thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 115 కరీంనగర్ శుక్రవారం, 4 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## మేకిన్ ఇండియా విఫలం..మోదీ గుర్తించాలి

పట్నా : జీడీపీలో తయారీ రంగం వాటా 2104లో 15.3 శాతంగా ఉంటే ఇప్పుడది 12.6శాతానికి పడిపోయిందని.. ఇది గత 60ఏళ్లలో అత్యంత కనిష్ఠం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పేర్కొన్నారు. లోక్ సభలో మోదీ తన ప్రసంగంలో ఎక్కడా 'మేకిన్ ఇండియా' గురించి మాట్లాడలేదని.. ఈ 'మేక్ ఇన్ ఇండియా' మంచి కార్యక్రమమే అయినా అది విఫలమైందనే విషయాన్ని ప్రధాని గుర్తించాలని అన్నారు.

పట్నాలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. ప్రధాని మోదీ మాట్లాడితే.. ఎన్నికల్లో అణగారిన వర్గాలకు టికెట్లు ఇవ్వడం ద్వారా వారికి ప్రాతినిధ్యం కల్పించామని గొప్పగా చెబుతుంటారని.. అయితే ఆ వర్గం ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి అన్ని అధికారాలనూ ఆయన లాగేసుకున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రులు కూడా పేరుకే ఉన్నారని.. ఆర్ఎస్ఎస్ సిఫారసు చేసిన ఓఎస్డీలే శాఖలపై పెత్తనం చెలాయిస్తున్నారని మండిపడ్డారు.




# గ్రామాల్లో ఎన్నికల కోలాహలం

## స్థానిక ఎన్నికల్లో ఓటర్లకు డబుల్ ధమాకా..!

### సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు

### వినాయక చవితి, దసరా, దీపావళి పండుగ సమయాల్లో రానున్న ఓట్ల పండుగ..?

### పండగ సమయాల్లో ఎన్నికలంటే పోటీదారుల్లో ఆందోళన

### అన్నీ కలిసి వస్తే మరో మూడు నెలల్లో స్థానిక ఎన్నికలు

### కాంగ్రెస్ పార్టీకి కత్తిమీద సాములాగా మారనున్న ఎన్నికలు

హైదరాబాద్ : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఓటర్లకు డబుల్ ధమాకా కలిగేలా చేయనున్నాయి. సెప్టెంబర్ 30లోగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో మళ్లీ గ్రామీణ ప్రాంతాలు ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. రానున్న దసరా, దీపావళి పండుగల సమయంలోనే స్థానిక ఎన్నికలు నిర్వహించనున్నట్లుగా తెలుస్తుంది. దీనితో ఓటర్లకు వినాయక చవితి, దసరా, దీపావళి పండుగల ఖర్చులన్నీ ఎన్నికల్లో ఓట్ల రూపంలో రాబట్టుకునే అవకాశం ఏర్పడనున్నది.

ఈ పరిస్థితులు ఎన్నికలు ఖర్చులు భరించలేని అభ్యర్థులకు ప్రాణ సంకటంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలు కత్తిమీద సాములాగా మారనున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో మెజార్టీ స్థానిక సంస్థలలో గెలువాల్సిన అవసరం ఏర్పడింది. కాంగ్రెస్ రాష్ట్ర ఇంఛార్జ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లు కాంగ్రెస్ నేతలు ఈ కార్యకర్తలకు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. గతంలో మెజార్టీ స్థానాలను అప్పటి బిఆర్ఎస్ పార్టీ గెలుచుకుని తమ పట్టును నిలుపుకున్నది.

**ఎక్కువ స్థానాలు తమ ఖాతాలో వేసుకునేందుకు...** ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం మార్పిడి జరిగినందున ఎక్కువ స్థానాలను తమ ఖాతాలో వేసుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌కు ఏర్పడింది. సమయానికి ఎన్నికలు నిర్వహించలేదని, మాజీ సర్పంచ్‌లను ఇంఛార్జ్‌లుగా పెట్టాలని కొందు బిసి సంఘాల నేతలు హైకోర్టులో కేసులు వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల పై హైకోర్టు ఇటు ప్రభుత్వాన్ని, అటు ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించడంతో ప్రభుత్వం నెలరోజుల సమయాన్ని అడిగింది. రిజర్వేషన్లను కొలిక్కి తెస్తామని అభ్యర్థించింది. ప్రభుత్వ నిర్ణయం తర్వాత ఎన్నికలు నిర్వహించడానికి రెండు నెలల సమయం పడుతుందని ఎన్నికల కమిషన్ హైకోర్టుకు వివరించింది. దీనితో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించడానికి మూడు నెలల సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడు నెలల సమయంలోనే దసరా, దీపావళి పండుగలు వస్తున్నాయి. ఈ సమయాల్లో ఎన్నికలు జరపడం అంటే పోటీదారులు ఓటర్లకు పండుగల ఖర్చులు మొత్తం భరించాల్సిన పరిస్థితులు ఏర్పడనున్నాయి. అందుకే ఓటర్లు దసరా, దీపావళి డబుల్ ధమాకాను అందుకోనున్నట్లుగా తెలుస్తుంది.

**ముగ్గురు పిల్లల నిబంధన పై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం...** ఆశావాహులకు అడ్డంకిగా ముగ్గురు పిల్లల నిబంధన స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్న వ్యక్తులు రెండు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత ఆ నిబంధనను అలాగే అమలు చేస్తూ వచ్చారు. ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అక్కడ ప్రభుత్వం ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేశారు. ఎంత మంది పిల్లలు ఉన్నా పోటీ చేసే అవకాశాన్ని కల్పించారు. తెలంగాణలో మాత్రంలో ఆ నిబంధనలో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో గ్రామాలలో ప్రజలకు సేవ చేస్తూ ఉన్న కొందరికి ఈ నిబంధన అడ్డంకిగా మారిందని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జనాభా నియంత్రణ కోసం అప్పట్లో ఈ నిబంధనలను, ప్రభుత్వాలు తీసుకువచ్చాయి. కానీ నేడు జనాభాను నియంత్రించాల్సిన అవసరం లేదని ప్రభుత్వాలే అభిప్రాయపడుతున్నాయి. అందుకే తెలంగాణలోనూ ఈ నిబంధనలను తొలగించాలని, అందరికీ పోటీ చేసే అవకాశాలు కల్పించాలని రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు కోరుతున్నారు.




## రాజకీయాలను షేక్ చేస్తున్న కొండా ఫ్యామిలీ..!

వరంగల్, జులై 03: అక్కడి అధికారపార్టీలో ప్రకంపనలు రేపిన ఆయన వ్యాఖ్యలపై రగడ చల్లారకముందే.. ఆయన కూతురు పెట్టిన సోషల్ మీడియా అకౌంట్ అప్‌డేట్ ఆ జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారింది. అక్కడి నుంచి పోటీచేసే అభ్యర్థిని తానే అంటూ ఆమె సోషల్ మీడియా అకౌంట్‌లో అప్‌డేట్ చేసుకున్నారు. ఇప్పటికే ఆమె తల్లిదండ్రుల మాటలతో తంటాలు పడుతున్న అధికార పార్టీకి కూతురు పెట్టిన పోస్ట్ మరో ఇబ్బందిగా పరిణమించింది. అయినా వారు డోంట్ కేర్ అంటూ ముందుకు సాగుతున్నారు. మరి ఈ పరిణామం ఏ జిల్లాలో జరిగింది. ఏం పార్టీని ఇబ్బంది పడుతోంది.. స్పెషల్ స్టోరీ మీకోసం.. తెలంగాణ కాంగ్రెస్‌లో కాకరేపిన మంత్రి కొండా సురేఖ దంపతుల వ్యవహారం ఇప్పుడు మరో అడుగు ముందుకు అన్న చందంగా సాగుతోంది. కొండా మురళీ చేసిన వ్యాఖ్యలపై సొంతపార్టీలో రాజకీయ దుమారం కొనసాగుతుండగానే.. ఆయన కూతురు కొండా సుష్మిత పటేల్ పొలిటికల్ ఎంట్రీ వరంగల్ కాంగ్రెస్‌లో ఒక్కసారిగా వేడిపుట్టించింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి తానే పోటీచేయబోతున్నట్టు కొండా సుష్మితాపటేల్ ఆమె సోషల్ మీడియా అకౌంట్‌లో అప్‌డేట్ చేసుకున్నారు. కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా అక్కడ రేవూరి ప్రకాశ్ రెడ్డి కొనసాగుతున్నారు. ఈ క్రమంలోనే సుష్మిత ఎక్స్ అకౌంట్‌లో అస్పరింగ్ పరకాల ఎమ్మెల్యే అని మార్చుకోవడం వరంగల్ కాంగ్రెస్‌లో కొత్త రచ్చకు దారితీసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొండా దంపతులు తమ కుటుంబానికి రెండు టికెట్లు కావాలని అధిష్టానాన్ని కోరారు. ముందుగా సరే అన్న పార్టీ పెద్దలు.. తీరా ఎన్నికల ముందు ఒకే కుటుంబానికి రెండు టికెట్లు సాధ్యం కాదని.. కొండా సురేఖకు వరంగల్ తూర్పు నియోజకవర్గం టికెట్ కేటాయించారు. కొండా మురళీకి ఎమ్మెల్సీ ఇస్తామని అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారట. అయితే ఎన్నికలు ముగిసి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా.. కొండా మురళీకి ఎమ్మెల్సీ ఇవ్వలేదు. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారట. దీనికి తోడు జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటితో పొసగడం లేదట. పొంగులేటికి అనుకూలంగా ఉండే ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ ఒక్కటయ్యారు. వీరంతా కొండా ఫ్యామిలీకి వ్యతిరేక వర్గంగా మారిపోయారు. వీరంతా పార్టీ, ప్రభుత్వ పెద్దలకు తమపై తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారని ఇటీవలే కొండా మురళీ వ్యాఖ్యానించడం రాజకీయ దుమారం రేపింది. తర్వాత గాంధీభవన్ వెళ్లిన కొండా మురళీ.. పార్టీ పెద్దలకు ఆరు పేజీల లేఖను రాసిచ్చారు. దాంట్లో వరంగల్ జిల్లా నేతలు తమ దంపతులపై ఎలాంటి కుట్రలు చేస్తున్నారో వివరించారు. కొండా మురళీ లేఖపై, ఆయన గాంధీభవన్‌లో చేసిన వ్యాఖ్యలపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కొండా మురళీని చూస్తే తమకు భయమేస్తోందంటూ మీడియాతో వ్యంగంగా మాట్లాడారు. తర్వాత కొండా దంపతుల వ్యతిరేక వర్గం ఎమ్మెల్యేలైన కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ మరోమారు అత్యవసరంగా సమావేశమయ్యారు. మురళీ తమపై చేసిన వ్యాఖ్యలపై చర్చించారు. పార్టీ పెద్దలకు మరోసారి మౌఖిక ఫిర్యాదు చేశారట. అయితే తమ పరిశీలనలో ఉందని పార్టీ పెద్దలు చెప్పగానే నిర్ణయం కోసం వేచిచూస్తున్నామన్నారు కొండా వ్యతిరేక వర్గ ఎమ్మెల్యేలు. ఇలా కొండా మురళీ వ్యాఖ్యలపై దుమారం కొనసాగుతుండగానే.. ఆయన కూతురు కొండా సుష్మితాపటేల్ ఎంట్రీ ఇచ్చారు. పరకాల నియోజకవర్గానికి 'నేనే ఎమ్మెల్యే అభ్యర్థి' అంటూ తన సోషల్ మీడియా అకౌంట్ బయోను అప్‌డేట్ చేశారు. సుష్మిత చేసిన ఈ అప్డేట్ వరంగల్ కాంగ్రెస్‌లో చర్చానీయంశంగా మారింది. పరకాల సిట్టింగ్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీకే చెందిన రేవూరి ప్రకాశ్ రెడ్డి కొనసాగుతున్నారు. అయితే ఇటీవల కొండా మురళీ రేవూరిపై కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 75ఏళ్ల ముసలోడు నాకాళ్లు పట్టుకుంటే పరకాల నుంచి గెలిపించానని.. తర్వాత తనకు వ్యతిరేకంగా ఆయన కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యల దుమారం చల్లారకముందే కొండా సుష్మిత పరాకలకు ఎంట్రీ ఇస్తున్నానని సంకేతాలు ఇవ్వడం కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. కొండా దంపతుల కుమార్తె ఎంట్రీతో.. వరంగల్ కాంగ్రెస్ రాజకీయాల్లో మరింత అలజడి వాతావరణం పెరిగింది. మరో ఫైర్ బ్రాండ్‌గా పేరున్న కొండా సుస్మితా పటేల్.. ఫుల్ టైమ్ రాజకీయాల్లో అలర్ట్ ఉంటే ఎలా ఉంటుందోనని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై వరంగల్ కాంగ్రెస్ నేతలు ఏ విధంగా స్టాండ్ తీసుకుంటారోనని రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.




## తప్పకుండా ముఖ్యమంత్రి అవుతా: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ : రాజకీయాల్లో ఎమ్మెల్సీ కవిత దూకుడు పెంచారు. జాగృతి బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారు. జాగృతి సంస్థ ఉద్యమం నుంచే ఉండగా.. ఉద్యమంలో సాంస్కృతిక అంశాలపై పోరాడింది. మరోసారి దీనిని బలోపేతం చేయడానికి కవిత కృషి చేస్తున్నారు.

ఇందులో భాగంగానే ప్రస్తుతం వేగం పెంచారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ మీడియా ఛానల్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చాలా ఓపెన్గా మాట్లాడారు. మీరు సీఎం అవుతారా అన్న ప్రశ్నకు ఆసక్తికర సమాధానం ఇచ్చారు. 'ఇంకో పదేళ్లకో, పదిహేనేళ్లకో, ఎప్పటికైనా తప్పకుండా ముఖ్యమంత్రి అవుతా. ఎవరైనా రాజకీయాల్లో వ్యక్తిగతంగా ఎదగాలనే కోరుకుంటారు' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే.. నిజామాబాద్పై దృష్టి సారిస్తా.. ఊహించని రీతిలో అభివృద్ధికి ప్రయత్నిస్తా అని చెప్పారు.


# పెట్టుబడులకు స్వర్గధామం...

# మన తెలంగాణ!

## మహేశ్వరంలో మలబార్ తయారీ యూనిట్‌సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జులై 03: హైదరాబాద్‌ను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మహేశ్వరంలో మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరంలో మలబార్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించబోతున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామన్నారు. మహేశ్వరంలో ఫోర్త్ సిటీ భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించబోతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా మన పారిశ్రామిక పాలసీలు మార్చలేదని గుర్తు చేశారు. పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ముందుకు వెళుతున్నామని వివరించారు.

పెట్టుబడులను ఆకర్షించడమే కాదు.. వారికి లాభాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి యూనిట్ ఏర్పాటు చేసిన మలబార్ గ్రూప్‌నకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.




**హైదరాబాద్ చేరుకున్న ఏఐసీసీ చీఫ్..** తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే గురువారం సాయంత్రం హైద రాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో దిగిన ఆయనకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. అనంతరం నగరంలోని తాజ్ కృష్ణ హెూటల్‌కు ఖర్గే చేరుకున్నారు. అయితే మంత్రి పదవి ఆశించి భంగపడ్డ పలువురు ఎమ్మెల్యేలతో ఖర్గే భేటీ కానున్నారు.

అందుకోసం వారికి ఖర్గే అపాయింట్‌మెంట్ ఇచ్చారు. కాగా, ఆది శ్రీనివాస్, బాలు నాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, సుదర్శన్ రెడ్డి, తదితరులు ఇప్పటికే తాజ్ కృష్ణా హెూటల్‌కు చేరుకున్నారు. అలాగే తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య సైతం ఖర్గేతో భేటీ కానున్నారు. జులై 4వ తేదీన నగరంలోని ఎల్బీ స్టేడియంలో పార్టీ కార్యకర్తలతో భారీ సభ జరగనుంది. ఈ సభకు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

ఆ సందర్భంగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు క్యాడర్‌కు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భారీగా కేడర్‌ను ఈ సభకు తరలించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు శుక్రవారం జరగనున్న ఈ సభకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.



## కేసీఆర్‌కు జ్వరం.. ఆరోగ్యంపై సీఎం రేవంత్ ఆరా

హైదరాబాద్, జులై 03: మాజీ సీఎం, బీఆర్ఎస్ చీఫ్ కె. చంద్రశేఖర్ రావు ఆరోగ్యంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరా తీశారు. కేసీఆర్ అనారోగ్యానికి గురికావడం.. వెంటనే ప్రైవేట్ ఆసుపత్రిలో చేరడంతోపాటు ఆయనకు అందిస్తున్న చికిత్సకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్‌కు మెరుగైన చికిత్స అందించాలని ఈ సందర్భంగా వైద్యులు, ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని.. మంచి ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కొన్ని రోజులుగా జలుబు, దగ్గు, జ్వరంతో మాజీ సీఎం కేసీఆర్ బాధపడుతున్నారు. దీంతో ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచి గురువారం నాడు నందినగర్‌లోని తన నివాసానికి కేసీఆర్ చేరుకున్నారు. అక్కడ ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అయితే ఆయనకు మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. దీంతో ఆయన్ను ఆసుపత్రిలో చేరాలని వైద్యులు సూచించారు. వారి సూచనలకు అనుగుణంగా సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో కేసీఆర్ చేరారు. ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కేసీఆర్ ఆసుపత్రిలో చేరిన సమయంలో ఆయన వెంటే మేనల్లుళ్లు హరీశ్ రావు, సంతోష్ రావులు ఉన్నారు. మరోవైపు కేసీఆర్ ఆసుపత్రిలో చేరడంతో.. సోమాజిగూడకు భారీఎత్తున బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు చేరుకుంటున్నారు. కాగా, యశోద ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు. ఇక కేసీఆర్ ఆరోగ్యంపై యశోద ఆసుపత్రి హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. కేసీఆర్.. నిరసంతో ఆసుపత్రిలో చేరారని వైద్యులు తెలిపారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు. కేసీఆర్‌కు చికిత్స కొనసాగుతుందని యశోద ఆసుపత్రి వైద్యులు స్పష్టం చేశారు.



## బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక ఎన్నికలు వద్దు

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జులై 17న రైల్ రోకోకు పిలుపునిచ్చామని భారాస ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామన్న సీఎం ఇంకా స్పందించలేదన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి వీల్లేదని పేర్కొన్నారు. భాజపాపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఖర్గేకు లేఖ రాస్తున్నట్లు తెలిపారు.

"జులై 8 లోపు అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలి. కాంగ్రెస్‌లోని బీసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. బీసీ రిజర్వేషన్ల కోసం భారాస సహకరిస్తోంది. గోదావరి–బనకచర్ల విషయంలో ప్రభుత్వం మెతక వైఖరి అవలంబిస్తోంది" అని కవిత అన్నారు.



## చాలా కేసులకే నేను భయపడలేదు

హైదరాబాద్: తాను వెనుకబడిన వర్గాల ప్రతినిధిని అని కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. తన సతీమణి, మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయ్యారు. ఉమ్మడి వరంగల్‌లో జరుగుతున్న అంశాలపై ఆమెకు నివేదిక ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "ఒకరి గురించి నేను కామెంట్ చేయను. నాకు ప్రజాబలం ఉంది. చాలా కేసులకే నేను భయపడలేదు.. భయం లేదని ముందు నుంచీ చెబుతూనే ఉన్నా.

**పేదల సమస్యలు పరిష్కరిస్తాం కాబట్టే జనం నా దగ్గరికి వస్తారు...** నేను బీసీ కార్డు పట్టుకునే బతుకుతున్నా. పేదల సమస్యలు పరిష్కరిస్తాను కాబట్టే జనం నా దగ్గరికి వస్తారు. పనిచేసే వారిపైనే కొందరు రాళ్లు వేస్తారు. నడిచే ఎద్దునే పొడుస్తారు. పార్టీ ఎవరికి టికెట్లు ఇచ్చినా గెలిపించే బాధ్యత నేను తీసుకుంటానని మీనాక్షి నటరాజన్‌తో చెప్పా. మా సేవల్ని పార్టీ ఉపయోగించుకోవాలని కోరా. కాంగ్రెస్ పార్టీని బతికించడమే నా ఉద్దేశం. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం నా లక్ష్యం. రేవంత్‌రెడ్డిని ఇంకో పదేళ్లు ముఖ్యమంత్రిగా చూడాలి. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు అండగా నిలుస్తా. శుక్రవారం జరగబోయే సభపై చర్చించాం. వరంగల్ నుంచి ఎంత మంది వస్తారనే అంశంపై మాట్లాడాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచేలా కృషి చేస్తా. ఎమ్మెల్యేలను మళ్లీ వరంగల్‌లో గెలిపించడమే నా బాధ్యత. నేను ఎవరికీ భయపడేది లేదు. ఎలాంటి గ్రూపు రాజకీయాలతో నాకు సంబంధం లేదు" అని కొండా మురళి తెలిపారు.

**సుష్మిత రాజకీయ ఆలోచనలను తప్పు పట్టలేం: కొండా సురేఖ...** తనకు ఇచ్చిన శాఖలకు న్యాయం చేస్తున్నానని మంత్రి కొండా సురేఖ అన్నారు. "నిబంధనల ప్రకారమే పని చేస్తున్నాను. నా శాఖలో ఉన్న ఫైల్స్ అన్నీ పరిశీలించుకోవచ్చు. మంత్రిగా ఇప్పటివరకు ఎలాంటి తప్పులు చేయలేదు. సుష్మితలో పారేది కొండా మురళి, కొండా సురేఖ రక్తం. ఆమెకు మా ఆలోచనలు వంశపారంపర్యంగా రావడంలో తప్పు లేదు. సుష్మిత రాజకీయ ఆలోచనలను తప్పు పట్టలేం. భవిష్యత్తు ఎలా ప్లాన్ చేసుకోవాలో నిర్ణయించే అధికారం ఆమెకు ఉంది. పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూస్తాం." అని కొండా సురేఖ అన్నారు. ఇటీవల ఓ కార్యక్రమంలో వరంగల్‌లోని నేతలను ఉద్దేశించి కొండా మురళి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను ఇటీవల పీసీసీ క్రమశిక్షణ కమిటీ.. గాంధీ భవన్‌కు పిలిచి వివరణ అడిగింది. దీనిపై లిఖిత పూర్వక వివరణ కోసం మళ్లీ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది.

## సిగాచీ పరిశ్రమలో నిపుణుల కమిటీ అధ్యయనం



సంగారెడ్డి: పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో 38 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ బృందం గురువారం పరిశ్రమను పరిశీలించింది. అగ్నిప్రమాదం జరిగిన తీరుపై అధ్యయనం చేస్తోంది. కార్మికుల భద్రతకు యాజమాన్యం నిబంధనలు పాటించిందా? లేదా?అన్న అంశంపై విచారణ చేపట్టింది. నెల రోజుల్లో ప్రమాదంపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఈ కమిటీకి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ఎమెరిటస్ శాస్త్రవేత్త డాక్టర్ బి.వెంకటేశ్వరరావు ఛైర్మన్‌గా.. ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ టి.ప్రతాప్‌కుమార్, చెన్నైలోని సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ సూర్యనారాయణ, పుణెలోని నేషనల్ కెమికల్ ల్యాబ్ భద్రతాధికారి డాక్టర్ సంతోష్ గుగే సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయడంతోపాటు భవిష్యత్తులో కెమికల్, ఫార్మా పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన సూచనలు, విధివిధానాలతో నివేదిక రూపొందించనుంది.



## రైతుకు అదిరిపోయే గిఫ్ట్..

## సోనూసూద్ మంచి మనసు.. ఆ రైతు కష్టం చూసి చలించిపోయి..

ప్రముఖ నటుడు సోనూసూద్ మంచితనం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కరోనా మహమ్మారి పీక్స్‌లో ఉన్న సమయంలో ఎంతో మందికి ఆయన సాయం చేశారు. ఇప్పటికీ సాయం చేస్తున్నారు. అడిగిన వారికి.. అర్హులైన వారికి కాదనకుండా సాయం చేస్తున్నారు. తాజాగా, ఓ రైతు కష్టం చూసి సోనూసూద్ చలించిపోయారు. ఆయనకు సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఆ రైతుకు అదిరిపోయే గిఫ్ట్ ఇవ్వనున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. మహారాష్ట్ర, లాతూర్ జిల్లా, హదోల్తి గ్రామానికి చెందిన 76 ఏళ్ల అంబదాస్ పవార్ అనే రైతుకు పొలం ఉంది. ఆయనకు పొలం ఉన్నా.. ఖర్చు పెట్టి దాన్ని దున్నించేంత డబ్బు లేదు. అందుకే భార్యా, భర్తలు కలిసి నాగలి లాంటి పరికరాన్ని తయారు చేసుకున్నారు. దాన్ని పొలానికి తీసుకెళ్లారు. భార్య నాగలి మేడితోక పట్టుకుంది. ఆ వృద్ధ రైతు నాగలి కోలను మెడకు వేసుకుని లాగాడు. ఇలా ఇద్దరూ ఆ పొలం మొత్తం దున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నటుడు సోనూసూద్ దృష్టికి కూడా వెళ్లింది. ఈ నేపథ్యంలోనే ఆ వృద్ధ దంపతుల కష్టం చూసి ఆయన చలించిపోయారు.

వారికి సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో .. 'మన రైతు సోదరుడికి ట్రాక్టర్ నడపటం రాదు. అందుకే ఎద్దులు గిఫ్ట్‌గా ఇస్తాను' అని అన్నారు. సోనూసూద్ తమకు ఎద్దులు గిఫ్ట్ ఇవ్వబోతున్నాడని తెలిసి ఆ వృద్ధ దంపతులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. సోషల్ మీడియాలో సైతం సోనూసూద్‌పై ప్రశంసల జల్లులు కురుస్తున్నాయి.



## వరంగల్ ఇష్యూ.. మీనాక్షికి నివేదిక ఇచ్చిన కొండా దంపతులు

హైదరాబాద్, జులై 3: కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కొండా దంపతులు కలిశారు. ఈరోజు (గురువారం) ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు వచ్చిన కొండా మురళి, సురేఖ.. ఉమ్మడి వరంగల్‌లో జరుగుతున్న అంశాలపై మీనాక్షికి నివేదిక ఇచ్చారు. మొత్తం 16 పేజీల నివేదికను మీనాక్షి నటరాజన్‌కు కొండా సురేఖ అందజేశారు. ఉమ్మడి వరంగల్‌లో నియోజకవర్గం వారిగా ఇంచార్జ్‌కు రిపోర్ట్ ఇచ్చారు. తమపై వచ్చిన ఆరోపణలపై మీనాక్షికి కొండా సురేఖ, కొండా మురళీ సమాధానం చెప్పారు. రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చామని చెప్పిన కొండా దంపతులు.. నిజాలు తెలుసుకున్న తర్వాత ఎవరిది తప్పుంటే వాళ్ళపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**నేను ఏ తప్పు చేయలేదు: కొండా సురేఖ...** ఇంచార్జ్‌తో భేటీ అనంతరం కొండా దంపతులు మీడియాతో మాట్లాడారు. 'నాకు ఇచ్చిన శాఖలకు న్యాయం చేస్తున్నాను. రూల్స్ ప్రకారమే నేను పని చేస్తున్నాను. నా డిపార్ట్మెంట్‌లో ఉన్న ఫైల్స్ అన్నీ పరిశీలించుకోవచ్చు. మంత్రిగా నేను ఇప్పటి వరకు ఎలాంటి తప్పులు చేయలేదు. నా మంత్రి పదవిపై ఎవరు మాట్లాడినా నేను స్పందించాను. సుష్మితలో పారేది కొండా మురళీ, కొండా సురేఖ రక్తం. నా కూతురికి మా ఆలోచనలు వంశ పారపర్యంగా రావడంలో తప్పు లేదు. సుష్మిత రాజకీయ ఆలోచనలను తప్పు పట్టలేం' అని కొండా సురేఖ అన్నారు.

**అదే నా ఉద్దేశం: కొండా మురళి...** 'నేను బీసీ కార్డును పట్టుకునే బతుకుతున్నాను. అణగారిన వర్గాలు బలం ఉన్నవాడి దగ్గరికే వస్తారు. పేదల సమస్యలు తీర్చుతాను కాబట్టే జనం నా దగ్గరికి వస్తాను. నాకు ప్రజాబలం ఉంది. పనిచేసే వారిపైనే బండలు వేస్తారు. నడిచే ఎద్దునే పొడుస్తారు . పార్టీ ఎవరికి టికెట్లు ఇచ్చిన గెలిపించే బాధ్యత నేను తీసుకుంటానని మీనాక్షితో చెప్పాను. మమ్మల్ని పార్టీ ఉపయోగించుకోవాలని చెప్పాను. పార్టీకి మీ సేవలు అవసరమని మీనాక్షి చెప్పారు. కాంగ్రెస్ పార్టీని బతికించడమే నా ఉద్దేశం. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం నా ఉద్దేశం. రేవంత్ రెడ్డిని ఇంకో పదేండ్లు ముఖ్యమంత్రిగా చూడడం నా ఉద్దేశం. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు అండగా నిలుస్తా' అని కొండా మురళి స్పష్టం చేశారు. కాగా.. గత కొద్ది రోజులుగా ఉమ్మడి వరంగల్ పంచాయతీ కొనసాగుతున్న విషయం తెలిసిందే. కొండా వర్సెస్ మిగతా నాయకులుగా వివాదం నడుస్తోంది. ఇప్పటికే ఇరు వర్గాల నేతలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. గత శనివారం గాంధీ భవన్‌కు వచ్చిన కొండా మురళి.. క్రమశిక్షణ కమిటీతో భేటీ అయి నివేదికను అందజేశారు. తనపై వచ్చిన ఆరోపణపై వారం రోజుల్లో లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని కొండా మురళిని క్రమశిక్షణ కమిటీ ఆదేశించింది.

## బీసీ రిజర్వేషన్లపై కవిత లేఖ రాయడం హాస్యాస్పదం: మహేశ్ కుమార్‌గౌడ్



హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై ఎమ్మెల్సీ కవిత.. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు లేఖ రాయడం హాస్యాస్పదంగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస నాయకురాలిగా లేఖ రాశారా, జాగృతి అధ్యక్షురాలి హోదాలో రాశారో చెప్పాలన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కవిత.. బీసీల గురించి మాట్లాడారా? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న రిజర్వేషన్లను 21 శాతానికి తగ్గించింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. 2014 నుంచి 2018 వరకు తెలంగాణ క్యాబినెట్‌లో ఒక్క మహిళ కూడా లేనప్పుడు స్పందించారా? ఉద్యమాలు చేశామని చెప్పుకొంటున్న కవిత ఏనాడైనా సాటి మహిళల గురించి మాట్లాడారా అని నిలదీశారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం సామాజిక సమరభేరి పేరిట కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. గ్రామకమిటీలను ఉద్దేశించి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ప్రసంగిస్తారని తెలిపారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై రామచందర్ రావు విమర్శలు



బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ(గురువారం) రామచందర్ రావు మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటా లేదా.. బీజేపీతో ఎవరికైనా మైత్రి ఉందా అనేది వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో, గ్రేటర్ ఎన్నికల్లో తెలుస్తుందని చెప్పుకొచ్చారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కమల వికాసమేనని ధీమా వ్యక్తం చేశారు. తనకు తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి రావడంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పాత్ర ఉందని ఎవరూ నిరూపించిన వారికీ ఆస్కార్ అవార్డ్ ఇప్పిస్తామని విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులకు తాము సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు. బీజేపీ అధిష్టానం తనకు ఇచ్చిన అవకాశాన్ని ప్రతి కార్యకర్త, పార్టీ అధికారం కోసం పనిచేస్తానని రామచందర్ రావు పేర్కొన్నారు.



## గత ప్రభుత్వంలో తితిదేలో అక్రమాలు

## జగన్ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బ తీసింది: బీజేపీ ఎంపీ లక్ష్మణ్

తిరుమల: గత జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమలలో చాలా అక్రమాలు జరిగాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ఆరోపించారు. గతంలో ఉన్న టీటీడీ పాలకమండళ్లు భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడాయని విమర్శించారు. ఇవాళ(గురువారం) ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో వెంకటేశ్వర స్వామివారిని లక్ష్మణ్ దర్శించుకున్నారు. అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారి లడ్డూలో జరిగిన కల్తీ భక్తులను ఆందోళనకు గురి చేసిందని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో తిరుమలలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తానని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# యుగ పురుషుడు వివేకానందుడు జూలై 4... స్వామి వివేకానంద వర్ధంతి



భారతదేశ సంస్కృతిని, ఆధ్యాత్మిక చింతనను, విదేశాలకు చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద. ఉపన్యాసాల ద్వారా భారత యోగ, వేదాంత శాస్త్రాలను ఖండాంతరాలు దాటించిన వ్యక్తి ఆయన. అమెరికాలోని చికాగోలో, ఇంగ్లాండులో ఆనాడు చేసిన ఆయన ప్రసంగాలను భారత సమాజం గర్వంగా గొప్పగా నేటికీ గుర్తు చేసుకుంటునే ఉంటుంది. పాశ్చాత్య దేశాల్లో అడుగు పెట్టిన తొలి హిందూ సన్యాసి కూడా వివేకానందనే కావడం విశేషం. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరం'...'లేవండి..మేల్కోండి.. గమ్యం చేరేవరకు విశ్రమించకండి' వంటి వివేకానంద సూక్తులు ఇప్పటికీ ఎంతోమంది యువతకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. యువతకు స్ఫూర్తి ప్రదాత అయిన వివేకానందుని వ్యక్తిత్వాన్ని ఆయన జయంతి సందర్భంగా భారతీయులు ఏటా స్మరించుకుంటున్నారు. ఆయన సేవలను స్మరిస్తూ భారత ప్రభుత్వం వివేకానంద జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం'గా జరుపుతోంది. స్వామి వివేకానంద 1863 సంవత్సరం జనవరి 12 తేదీన మకర సంక్రాతి రోజున ఒక బెంగాలీ కుటుంబంలో కలకత్తాలో జన్మించారు. జులై 4, 1902న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. చిన్న వయసులోనే ఎన్నో పాశ్చాత్య , తత్వ శాస్త్ర గ్రంధాలు, నవలలు, చరిత్రలు, అన్ని మతాల గ్రంధాలు, ఇలా ఎన్నో చదివే వారు. జీవించింది కేవలం 39 సంవత్సరాలే కానీ శతాబ్దాల పాటు చెరిగిపోని ముద్ర వేశారు. తూర్పు మరియు పశ్చిమ సంస్కృతుల మధ్య ఒక వారధి నిర్మించారు. మన దేశానికి ప్రపంచ దేశాల్లో గౌరవం తెచ్చిన గొప్ప వ్యక్తి. ఆయన జీవితం మొత్తం మీద తనకంటూ చేసుకున్నది, దాచుకున్నది ఏది లేదు. ఆయన విదేశాలలో ఎలాంటి ముద్ర వేశారంటే ఇప్పటికి అమెరికాలో ఒక వీధికి "స్వామి వివేకానంద స్ట్రీట్" అని పేరు పెట్టుకున్నారు అంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది. మహాత్మా గాంధీ , సుభాష్ చంద్రబోస్, లోకమాన్య తిలక్, బిపిన్ చంద్ర పాల్ వంటి ఎంతోమంది స్వాతంత్ర యోధులకు వివేకానందుడే ఆదర్శం. . "మీరు ఇండియా గురించి తెలుసు కోవాలను కుంటే స్వామి వివేకానంద గురించి చదవండి" అన్నారు విశ్వకవి టాగోర్. ముఖ్యంగా యువతకోసం ఆయన ఎంతో తపించారు. రామకృష్ణ మఠాన్ని స్థాపించి తద్వారా భారతీయ యువతకు దిశా నిర్దేశం చేశారు. భారతదేశ భవిష్యత్తుని మార్చగలిగేది యువతేనని, యువత ఒక మంచి ఆశయంతో ముందుకు వెళ్లాలని ఆయన అనేవారు. అందుకే "డబ్బు లేని వాడు కాదు... జీవితంలో ఒక ఆశయం అంటూ లేని వాడు అసలైన పేదవాడు" అనే వారు వివేకానంద. ఆయన ఎప్పుడు కూడా "గొర్రెలలా కాదు సింహంలా ధైరంగా బ్రతకమని" దేనికి భయపడవద్దని చెపుతుండే వారు. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన కొంతమంది యువకులను నాకు అప్పగిస్తే ఈ దేశం స్వరూపాన్నే మార్చేస్తాను" అని స్వామీజీ తరచూ అనేవారు. మన దేశంలో యువత మనసులో స్ఫూర్తి నింపినవారిలో వివేకానంద అంతటి వారు మరొకరు లేరు. అందుకే మన దేశంలో ఆయన పుట్టినరోజు జనవరి 12 ను "నేషనల్ యూత్ డే" గా జరుపు కుంటారు. ఆయన తన ప్రసంగాలతో, సూక్తులతో పుస్తకాలతో, యువతరాన్ని ఉత్తేజపరిచి, దిశానిర్ధేశం చేశారు. వ్యక్తి విజయవంతమైన జీవితం గడపడానికి కొన్ని సూత్రాలను వివేకానందుడు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక భావనలతో వ్యక్తిలో నిస్వార్థమైన వైఖరులు ఏర్పడతాయని వివరించారు. సుఖదు:ఖాలు నాణేనికి రెండు పార్శ్వాలు లాంటివి. కాబట్టి సానుకూల దృక్పథంతో ఉండాలి. కష్టాలు వచ్చినప్పుడు ఏడుస్తూ కూర్చుంటే సమయం వృథా అవుతుందే తప్ప ప్రయోజనం ఉండదు. విశ్వంలో ప్రతి అంశం తార్కిక ఆలోచనలతో ముడిపడి ఉంటుంది. కాబట్టి తార్కిక ఆలోచనలతో ప్రపంచాన్ని అవగాహన చేసుకోడానికి ప్రయత్నించాలి. ఎవరి సామర్థ్యంపై వారికి నమ్మకం ఉండాలి. ఇతరులపై ఆధారపడే విధానానికి స్వస్తి పలకాలి. మందలో ఉండకు ..వందలో ఉండటానికి ప్రయత్నించు.. ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు. కెరటం నాకు ఆదర్శం... లేచి పడుతున్నందుకు కాదు పడినా కూడా లేస్తున్నందుకు. మతం అనేది సిద్దాంత రాద్ధాంతాలలో లేదు... అది ఆచరణలో ఆధ్యాత్మికులుగా పరిణతి చెందడంలో మాత్రమే ఉంది. ఈ ప్రపంచం బలవంతులకు మాత్రమే సహాయ పడుతుంది.. ఇలా యువతకు వివేకానందుడు స్ఫూర్తిని కలిగించే ప్రయత్నం చేశారు. జీవితం నిరాశ నిస్పృహలతో నిండిపోయి నప్పుడు, భయ భ్రాంతులకు గురైనపుడు, మనసు చెడు మార్గాలవైపు మళ్ళి ఏమి చెయ్యాలో దిక్కు తోచని పరిస్థితులలో ఉన్నపుడు స్వామి వివేకానందకు సంబందించిన పుస్తకాలు, సూక్తులను చదవాలి. వివేకానందుడి సందేశాలు సూటిగా మన హృదయాన్ని తాకుతాయి. మనసులో ఒక తెలియని ధైర్యం, ఆలోచనలో మార్పు కలుగుతుంది. జీవితానికి అసలైన అర్థం తెలుస్తుంది. నిద్రాణమై ఉన్న భారత జాతిని మేల్కొలిపిన ఆ మహనీయుడు, యుగ పురుషుడు ఎప్పటికి మన గుండెల్లో నిలిచే ఉంటారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# "జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య" - జూలై 4... వెంకయ్య వర్ధంతి



భారతీయులు సగర్వంగా, సగౌరవంగా తలెత్తి వందనం చేసే, భారత సార్వభౌమాధికారానికి ప్రతీక అయిన త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య. స్వాతంత్ర్య సమరయోధునిగా, వ్యవసాయ, భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా, జపనీస్ భాషా బోధకునిగా, రచయితగా, వివిధ దేశాల పర్యాటకునిగా, బహుముఖ ప్రజ్ఞ కలిగిన వెంకయ్యను భారతీయులంతా గుర్తు చేసుకోవాల్సిన సందర్భం అనివార్యం. 1878 ఆగస్టు 2న కృష్ణాజిల్లా పెద్ద కళ్ళేపల్లిలో, జన్మించిన వెంకయ్య, భట్లపెనుమర్రులో విద్యాభ్యాసం ముగించుకొని, తన 19 వ ఏటనే బ్రిటిష్ వెళ్లి సైన్యంలో చేరారు. మద్రాసులో ప్లేగు ఇన్స్పెక్టరు శిక్షణ పూర్తి చేసి, కొంతకాలం బళ్లారిలో ప్లేగ్ ఇన్స్పెక్టరుగా పనిచేసారు. అతని జ్ఞాన దాహం అంతులేనిది. శ్రీలంక వెళ్లి కొలంబోలోని సిటీ కాలేజీలో పొలిటికల్ ఎకనామిక్స్ ప్రత్యేక విషయంగా చదివి కేంబ్రిడ్జి సీనియర్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. కొంతకాలం రైల్వేలో గార్డుగా పనిచేసాడు. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి లాహోర్ లోని డి.ఏ.వి. కాలేజీలో చేరి, సంస్కృతం, ఉర్దూ, జపాన్ భాషల్లో మంచి పాండిత్యం సంపాదించారు. జపాన్ భాషలో అనర్గళంగా మాట్లాడే వెంకయ్య గారిని "జపాన్ వెంకయ్య" అని పిలిచేవారు. 1899 – 1902 మధ్య డచ్ సైన్యానికి వ్యతిరేకంగా, దక్షిణాఫ్రికాలో బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. అక్కడే ఆయనకు స్వాతంత్రోద్యమ నిర్దేశకులు, భావిభారత జాతిపిత మహాత్మా గాంధీతో పరిచయం ఏర్పడింది. దక్షిణాఫ్రికాలో ఉండగా మహాత్మా గాంధిని కలిశారు. గాంధీతో వెంకయ్యకు ఏర్పడిన ఈ సాన్నిహిత్యం అర్ధశతాబ్దం పాటు నిలిచింది. భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా మైకా, వజ్రాలపై ఆయన విస్తృత పరిశోధనలు జరిపారు. స్వదేశం వస్తూ అరేబియా, ఆఫ్ఘనిస్థాన్ లు చూసి వచ్చారు. గాంధీజీ పరిచయం అయిన నాటి నుండి జాతీయ జెండా ఎలా ఉండాలనే సమస్యనే తన అభిమాన విషయంగా పెట్టుకొని, దాని గురించి దేశంలో ప్రచారం ప్రారంభించారు. 1913 నుండి ప్రతి కాంగ్రెస్ సమావేశానికి హాజరై, నాయకులందరితోనూ జాతీయ పతాక రూపకల్పన గురించి చర్చలు జరిపారు. 1916లో "భారత దేశానికి ఒక జాతీయ పతాకం" అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు. 1916 లో "నీడ్ ఫర్ నేషనల్ ఫ్లాగ్" పేరున 30 నమూనాలతో జాతీయ పుస్తక రచన గావించారు. ఈ గ్రంథానికి అప్పటి వైస్రాయ్ కార్యనిర్వాహక సభ్యుడైన కేంద్రమంత్రి సర్ బి.ఎన్.శర్మ ఉత్తేజకరమైన పీఠిక రాశారు. 1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య తయారు చేసిన జాతీయ జెండానే ఎగుర వేశారు. 1919లో జలంధర్ వాస్తవ్యులైన "లాలా హన్స్ రాజ్" మన జాతీయ పతాకంపై రాట్నం చిహ్నముంటే బాగుంటుందని సూచించగా గాంధీజీ దాన్ని అంగీకరించారు. 1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో జరిగాయి. గాంధీజీ వెంకయ్యను ఆ సమావేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు కలిగి, మధ్య రాట్నంగల ఒక జెండాను చిత్రించమని కోరారు. మహాత్ముడు సూచించిన ప్రకారంగానే, ఒక జెండాను సమకూర్చాడు వెంకయ్య. అనంతరం వచ్చిన ఆలోచనల మేరకు, సత్యం, అహింసలకు ప్రత్యక్ష నిదర్శనమైన, తెలుపు రంగు కూడా ఉండాలని గాంధీజీ అభిప్రాయ పడగా, వెంకయ్య ఆ జెండాలో అదనంగా తెలుపు రంగును చేర్చి, నేటి త్రివర్ణ పతాకాన్ని దేశానికి ప్రసాదించారు. "మడత పెడితే పిడికెడే కానీ, కోటానుకోట్ల భారతీయుల ప్రియ వస్త్రం"గా "గాంధీజీ"చే, వెంకయ్య రూపకల్పన చేసిన జాతీయ పతాకం ప్రశంసా పాత్రమైంది. 1947, జూలై 22 వ తేదీన భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి ఒక తీర్మానం చేస్తూ, మునుపటి త్రివర్ణ జెండాలోని రాట్నాన్ని తీసేసి, దాని స్థానంలో అశోకుని ధర్మచక్రాన్ని చిహ్నంగా ఇమిడ్చారు. చిహ్నం మార్పు తప్పితే పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకు నేటి జెండాకు తేడా ఏమీ లేదు. అశోకుని ధర్మచక్రం మన పూర్వ సంస్కృతికి సంకేతం. పింగళి వెంకయ్య 1906 నుంచి 1922 వరకు భారత జాతీయోద్యమం లోని వివిధ ఘట్టాలలో పాల్గొన్నారు. వందేమాతరం, హోంరూల్ ఉద్యమం, ఆంధ్రోద్యమంలాంటి ప్రసిద్ధ ఉద్యమాలలో ప్రధాన పాత్రధారిగా ఉన్నారు. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆయన బెంగుళూరు, మద్రాసు లలో "రైల్వే గార్డు"గా పనిచేశారు. ఆ తరువాత కొంత కాలము బళ్లారిలో "ప్లేగు అధికారి"గా ప్రభుత్వ ఉద్యోగము చేశారు. వెంకయ్యలో ఉన్న దేశభక్తి ఆయనను ఎంతో కాలము ఉద్యోగము చేయనివ్వలేదు. 1906 నుండి 1922 వరకు జాతీయోద్యమాలతో పాటు మునగాల పరగణా నడిగూడెంలో జమీందారు రాజా బహదూర్ నాయని రంగారావు కోరిక మేరకు, నడిగూడెంలో నివాసముండి, పత్తి మొక్కలలోని మేలు రకములు పరిశోధనలలో వినియోగించారు. నడిగూడెంలో వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించాడు. ఈ పరిశోధనలలో "కంబోడియా పత్తి" అను ఒక ప్రత్యేక రకమైన పత్తి మీద విశేష కృషి చేశారు. ఆయన కృషిని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వముకూడా గుర్తించడముతో ఆయనకు "పత్తి వెంకయ్య" అని పేరు వచ్చింది. తరువాత నెల్లూరు చేరి, 1924 నుండి 1944 వరకు అక్కడే ఉంటూ మైకా (అభ్రకం) గురించి పరిశోధన చేశారు. వజ్రకరూరు, హంపిలలో ఖనిజాలు, వజ్రాలు గురించి విశేషంగా పరిశోధనలు జరిపి ప్రపంచానికి తెలియని వజ్రపు తల్లిరాయి అనే గ్రంథం రాసి 1955లో దాన్ని ప్రచురించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత ప్రభుత్వం వెంకయ్యను ఖనిజ పరిశోధక శాఖ సలహాదారుగా నియమించింది. ఆ పదవిలో ఆయన 1960 వరకు పనిచేసారు. అయితే వెంకయ్య జీవిత చరమాంకం దయనీయ స్థితిలో ముగిసింది. 1960 లో భారత ప్రభుత్వం భూగర్భ ఖనిజాలు సంస్థ సలహాదారుగా వెంకయ్యకు ఇచ్చే గౌరవ వేతనాన్ని సైతం నిలిపి వేసింది. వృద్ధాప్యంలో ఆర్థిక బాధలు ఆయనను చుట్టు ముట్టాయి. మిలటరీలో పని చేసినందుకు విజయవాడ చిట్టినగరులో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో, ఆయన గుడిసె వేసుకొని దారిద్ర్య జీవితాన్ని గడపవలసి వచ్చింది. జీవితాంతం దేశం కొరకు, స్వాతంత్ర్యం కొరకు పోరాడిన వెంకయ్య జీవితం పేదరికంలో తిండికి కూడా మొహం వాచి, నానా అగచాట్లు పడినట్లు ' త్రివేణి ' సంపాదకులు డా. భావరాజు నరసింహారావు పేర్కొన్నారు. అంతిమదశలో విజయవాడలో డా. కె.ఎల్.రావు, డా.టి.వి.ఎస్.చలపతిరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు మున్నగు పెద్దలు 1963 జనవరి 15న వెంకయ్యను సత్కరించి, కొంత నిధిని అందించారు. కన్నుమూసే ముందు ఆయన చివరి కోరికను వెల్లడిస్తూ " నా అంత్య దశ సమీపించింది. నేను చనిపోయిన తర్వాత త్రివర్ణ పతాకాన్ని నా భౌతిక కాయంపై కప్పండి. శ్మశానానికి చేరిన తర్వాత ఆ పతాకం తీసి అక్కడ ఉన్న రావి చెట్టుకు కట్టండి. ఇది నా తుది కోరిక " అన్నారు. ఆత్మాభిమానానికి మారుపేరైన వెంకయ్య, కడు పేదరికాన్ని అనుభవిస్తూ, 1963 జూలై 4న విజయవాడలో తుది శ్వాస వదిలారు. 1964 లో జులైలో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, వెంకయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించినా, విజయవాడ గాంధీ హిల్ నందు విగ్రహావిష్కరణ జరిగినా, భారతీయులు ఆచంద్ర తారార్కం గుర్తుంచు కోవలసిన పింగళి వెంకయ్యకు... రావలసిన గౌరవం రాకపోవడం నిజంగా బాధాకరం. గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదులో ట్యాంక్ బండ్ పై ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి ఆయన దర్శన భాగ్యం ప్రజలకు లభింపజేసి, కొంతలో కొంతైనా ప్రజలకు గుర్తుండేలా చేసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# బ్రిటీషర్ల గుండెల్లోకి దూసుకుపోయిన విప్లవ బాణం అల్లూరి - జూలై 4... విప్లవ వీరుని జయంతి



విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గురించి తెలియని వారుండరు. మన్యం ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసి, వారి కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుడైన అల్లూరి, అక్కడి ప్రజలకు దైవ సమానుడై, భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడుగా, మన్యం వీరుడుగా, అగ్గి పిడుగుగా ప్రసిద్ది గాంచిన పోరాట యోధుడు సీతారామరాజు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. ఆయన ఒక మహోజ్వల శక్తి. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు అయిన అనుచరులతో, చాలా పరిమిత వనరులతో బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడు. రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కనుకులేకుండా చేసిన సీతారామరాజు.. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేశాడు. సీతారామరాజు జన్మదినం 1897 జూలై 4.. హేవళంబి నామ సంవత్సరం, ఆషాఢ మాసం, శుద్ధ పంచమి – 23 ఘడియల 30 విఘడియలు. (సాయంకాల 4 గంటలకు) మఖా నక్షత్రయుక్త వృశ్చిక లగ్నం. వారి స్వగ్రామం ఇప్పటి పశ్చిమ గోదావరి జిల్లాలోని మోగల్లు ,అయినా విజయనగరం దగ్గరి పాండ్రంగిలో తాతగారైన (మాతామహుడు) మందలపాటి శ్రీరామరాజు ఇంట రాజు జన్మించాడు. అయితే పెరిగింది మాత్రం పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో. రామరాజు తండ్రి వెంకట రామరాజు, తల్లి సూర్యనారాయణమ్మ. 9వ తరగతి వరకు చదివిన అల్లూరి.. సంస్కృతం, జోతిష్యశాస్త్రం, జాతక శాస్త్రం, విలువిద్య, గుర్రపు స్వారీలో ప్రావీణ్యం పొందారు. 1917లో విశాఖపట్నం జిల్లా క్రిష్ణదేవీపేట ద్వారా మన్యంలోకి అడుగుపెట్టారు. రాజు కుటుంబం 1918 వరకు తునిలోనే ఉంది. ఆ కాలంలోనే చుట్టుపక్కలగల కొండలు, అడవులలో తిరుగుతూ, గిరిజనుల జీవన విధానాన్ని గమనిస్తూ ఉండేవాడు. ధారకొండ, కృష్ణదేవీ పేట మొదలైన ప్రాంతాలు ఈ సమయంలో చూసాడు. వత్సవాయి నీలాద్రిరాజు వద్ద జ్యోతిష్యం, వాస్తు శాస్త్రం, హఠయోగం, కవిత్వం నేర్చుకున్నాడు. సూరి అబ్బయ్యశాస్త్రి వద్ద సంస్కృతం, ఆయుర్వేదం నేర్చుకున్నాడు. మన్యం ప్రజల దీన స్థితిగతులను పరిశీలించి, బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను పురిగొల్పాడు. చిన్నప్పటినుండి సీతారామరాజులో దైవ భక్తి, నాయకత్వ లక్షణాలు, దాన గుణం అధికంగా ఉండేవి. నిత్యం దైవ పూజ చేసేవాడు. తుని సమీపంలో పెదతల్లి ఉన్న గోపాలపట్టణంలో సీతమ్మ కొండపై రామలింగేశ్వరాలయంలో కొంతకాలం తపస్సు చేశాడు. 1916 ఏప్రిల్ 26 న ఉత్తరభారతదేశ యాత్రకు బయలుదేరాడు. బెంగాలులో సురేంద్రనాథ బెనర్జీ వద్ద అతిథిగా కొన్నాళ్ళు ఉన్నాడు. తరువాత లక్నోలో జరిగిన కాంగ్రెసు మహాసభకు హాజరయ్యాడు. కాశీలో కొంతకాలం ఉండి సంస్కృతభాషను అధ్యయనం చేశాడు. ఈ యాత్రలో ఇంకా బరోడా, ఉజ్జయిని, అమృత్‌సర్, హరిద్వార్, బదరీనాథ్, బ్రహ్మకపాలం మొదలైన ప్రదేశాలు చూసాడు. బ్రహ్మకపాలంలో సన్యాసదీక్ష స్వీకరించి, యోగిగా తిరిగివచ్చాడు. ఈ యాత్రలో అనేక భాషలు, విద్యలు కూడా అభ్యసించాడు. గృహవైద్య గ్రంథము, అశ్వశాస్త్రము, గజశాస్త్రము, మంత్రపుష్పమాల, రసాయన ప్రక్రియలు వంటి విషయాల గ్రంథాలను స్వయంగా వ్రాసుకొని భద్రపరచుకొన్నాడు. అనేక యుద్ధవిద్యల్లోను, ఆయుర్వేద వైద్యవిద్యలోను ప్రావీణ్యుడవటంచేత త్వరలోనే రాజు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఆరాధ్యుడయ్యాడు. మన్యం ప్రజల కష్టాలను నివారించడానికి ప్రయత్నించేవాడు. ముహూర్తాలు పెట్టడం, రక్షరేకులు కట్టడం, మూలికా వైద్యం, చిట్కా వైద్యం, రామాయణ భారత భాగవత కథలు వినిపించడం చేసేవాడు. భక్తి చూపేవారు. 1918 ప్రాంతంలో కొంగసింగిలో ఒక మోదుగ చెట్టు క్రింద మండల దీక్ష నిర్వహించాడు. ఇతనికి అతీంద్రియ శక్తులున్నాయని ప్రజలు భావించేవారు. బ్రిటిష్ ప్రభుత్వం మన్యం ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేసింది. ఆ రోజుల్లో ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగతాలకు, దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారు. శ్రమదోపిడి, ఆస్తుల దోపిడి, స్త్రీల మానహరణం సర్వసాధారణంగా జరుగుతూ ఉండేవి. మన్యంలో గిరిజనుల జీవితం దుర్భరంగా ఉండేది. పోడు వ్యవసాయం చేసుకుంటూ, అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని అమ్ముకుని జీవించే వారిపై బ్రిటీషువారు ఘోరమైన దురాగతాలు చేసేవారు. రక్షిత అటవీప్రాంతం పేరుతో పోడు కొరకు చెట్లను కొట్టడాన్ని నిషేధించింది ప్రభుత్వం. గిరిజనులకు జీవనాధారం లేకుండా చేసింది. అటవీ ఉత్పత్తుల సేకరణలో కూడా అడ్డంకులు సృష్టించింది. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటానికి సిద్ధ మైనాడు. చుట్టుపక్కల 30, 40 గ్రామాల ప్రజలకు రాజు నాయకుడయ్యాడు. గంటందొర, మల్లుదొర, మొట్టడం వీరయ్యదొర, కంకిపాటి ఎందు పడాలు, సంకోజి ముక్కడు, వేగిరాజు సత్యనారాయణ రాజు (అగ్గిరాజు), గోకిరి ఎర్రేసు, బొంకుల మోదిగాడు వంటి సాహస వీరులు 150 మంది దాకా ఇతని అజమాయిషీలో తయారయ్యారట. పోలీసు స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్ళడంతో విప్లవం ప్రారంభమైంది. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి చింతపల్లి పోలీసు దోపిడీకి నిశ్చయించుకొన్నారు. ఆగష్టు 22న మన్యం విప్లవం ఆరంభమైంది. చింతపల్లి, కృష్ణదేవు పేట, రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం, తదితర పోలీస్ స్టేషన్ లను ముట్టడించి ఆయుధాలను తీసుకెళ్లారు. ప్రభుత్వం ప్రజలను పెడుతున్న కష్టాలను చూడలేని రాజు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డారు. 1924 మే 7న కొయ్యూరు గ్రామ సమీపంలో ఒక ఏటి వద్ద కూర్చొని, ఒక పశువుల కాపరి ద్వారా తనున్న చోటును పోలీసులకు కబురు పంపాడట. ఏటి ఒడ్డున స్నానం చేస్తూ ఉండగా పోలీసులు చుట్టుముట్టి రాజును బంధించారు. కొయ్యూరులో విడిది చేసి ఉన్న మేజర్ గుడాల్ వద్ద రాజును హాజరు పరిచారు. బందీగా ఉన్న అల్లూరి సీతారామ రాజును (ఒక చెట్టుకు కట్టివేసి) ఏ విచారణ లేకుండా గుడాల్ కాల్చి చంపాడు. తల్లికి కూడా రాజు మరణ వార్తను తెలియజేయలేదు. మే 8 న రాజు దేహాన్ని ఫొటో తీయించిన తరువాత దహనం చేసారు. అతని చితా భస్మాన్ని సమీపంలో ఉన్న వరాహ నదిలో కలిపారు. ఆ విధంగా కేవలం 27 ఏళ్ళ వయసులోనే అల్లూరి సీతారామరాజు అమరవీరుడయ్యాడు. రామరాజు చనిపోయే ముందు రూథర్ ఫర్డ్ తో సాగిన సంభాషణ ఆయన వ్యక్తిత్వానికి దర్పణం పడుతుంది... నీలాంటి వీరుడు మా దేశంలో పుట్టి ఉంటే అని రూథర్‌ఫర్డ్ అన్న సందర్భంలో...."రూథర్‌ఫర్డ్.. పొరపాటున కూడా అలా ఊహించవద్దు. ఇది నా మాతృభూమి. ఇక్కడి మట్టి పవిత్రం, నీరు పవిత్రం, గాలి పవిత్రం. నదులు, కొండలు సమస్తం పవిత్రం. ఈ జన్మకే కాదు.. వేయి జన్మలకైనా ఈ పుణ్యభూమిలోనే పుడతాను. నా ప్రజల సముద్ధరణకే పాటుపడతాను". స్వరాజ్యం ఒకరిస్తే పుచ్చుకునే బిచ్చం కాదు. పోరాడి గెలుచుకునే హక్కు. రక్తమాంసాలు దారబోసి రక్షించుకోవాల్సిన వరం. నేను కోరేది సంపన్నులు, మేధావులు అనుభవించే స్వరాజ్యం కాదు. అట్టడుగున ఉన్న మనిషి కూడా స్వేచ్ఛా వాయువులు పీల్చే స్వరాజ్యం. ఎక్కడ భయానికి చావులేదో, ఎక్కడ ప్రతి మనిషి తల ఎత్తుకొని తిరగగలడో, ఎక్కడ ఒకరి కష్టాన్ని మరొకరు కొల్లగొట్టరో, ఏది ద్వేష అసూయలకు అతీతమైన సంఘమో అలాంటి సంఘాన్ని రామరాజ్యాన్ని నేను కోరుతున్నాను. నీ దుష్ట రాజ్యం నా జాతిని సర్వనాశనం చేసింది. ఆ కన్నీటి ప్రవాహాల్లో కరిగిన ఈ గుండె కరడుకట్టింది. మీ పాలనపై పగబట్టింది. రేగిన ఈ అగ్ని జ్వాల చల్లారదు. మీ అధికారం అంతమయ్యేంతవరకు, ఆఖరి తలప్రాణి ఈ గడ్డ వదలి పారిపోయేంత వరకు ఈ నిప్పుటేరులే, ఈ రక్త వర్షాలే, ఈ జీవన మరణ పోరాటమే.. ఒక్క సీతారామరాజు చనిపోతే లక్షలాది సీతారామరాజులు ఉద్భవిస్తారు. ఒక్కొక్కడు ఒక్కొక్క విప్లవ వీరుడై విజృంభించి బ్రిటిష్ సామ్రాజ్యపు పునాదులు పెళ్లగిస్తారు. సీతారామరాజు ఒక వ్యక్తి కాదు.. సమూహశక్తి, సంగ్రామ భేరి, స్వాతంత్ర్య నినాదం. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నైతికత, నిపుణత, నాయకత్వం - రాంచందర్ రావు నేతృత్వం భాజపాకు ఆశాజనకం



తెలంగాణ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న వేళ, భారతీయ జనతా పార్టీకి తగిన పునర్నిర్మాణం అత్యవసరమై ఉంది. బహుముఖ సమస్యలు, లోపాలు, విభేదాల మధ్య బీజేపీకి స్థిరతనిచ్చే నాయకత్వం కోసం అన్వేషణ కొనసాగింది. అటువంటి సమయంలో పార్టీకి నూతన అధ్యక్షుడిగా న్యాయవాది, రాజకీయ విశ్లేషకుడు, ఉద్యమ నేత ఎన్. రాంచందర్ రావు బాధ్యతలు చేపట్టడం ఒక ఆశాజనక పరిణామం. పౌరహక్కుల పరిరక్షణకు తన వృత్తి జీవితాన్ని అంకితం చేసిన ఆయన, ఇప్పుడు పార్టీ హక్కులను రక్షిస్తూ, క్యాడర్ చైతన్యాన్ని మేల్కొలిపే మార్గదర్శిగా మారే అవకాశముంది. రాంచందర్ రావు రాజకీయాల్లో నిబద్ధత, న్యాయబద్ధత, సంయమనం అనే మూల విలువలతో కొనసాగుతున్న నాయకుడు. ఆయన వృత్తి జీవితంలో న్యాయస్థానం వేదికగా న్యాయ పోరాటాలు చేసిన తీరు, ప్రజా సమస్యలపై తనదైన శైలిలో ప్రశ్నించిన తీరు, శాసన మండలిలో వాదనల్లో నిరూపించిన నైపుణ్యం... ఇవన్నీ ఆయన సామర్థ్యానికి నిదర్శనాలు. ఎలాంటి ప్రచారాలకీ, పదవులకీ గురి కాకుండా, స్వయంగా ఓ వృత్తిపరమైన, సేవా పూరితమైన వ్యాపకం ద్వారా రాజకీయ వేదికపైకి వచ్చిన ఆయనకి కలిగిన విశ్వసనీయత బీజేపీకి కొత్త శక్తిని సమకూర్చే అవకాశం ఉంది. రాష్ట్ర బీజేపీలో ముడిపడి ఉన్న వర్గీయ పోరాటాల నివారణ రాంచందర్ రావు ముందున్న తొలి సవాల్. పార్టీ కేంద్రానికి అత్యంత సన్నిహితంగా ఉన్న నేతల వర్గం, స్థానికంగా ప్రజల్లో మద్దతు గడించిన నేతల వర్గం మధ్య నెలకొన్న విభేదాలను సమర్థంగా సమతుల్యం చేయగల నేతగా ఆయనపై అంచనాలు ఏర్పడుతున్నాయి. ఎందుకంటే ఆయన ఎలాంటి వర్గానికి వీరాభిమానిగా కాదు, బీజేపీ వ్యవస్థానికే శ్రద్ధగల వాడిగా గుర్తింపు పొందారు. ఎవరి అభిప్రాయాన్నయినా వినగల ఓర్పు, ఒత్తిళ్ల లోను సంయమనం పాటించే చిత్తశుద్ధి ఆయన ప్రత్యేకత. ఈ లక్షణాలు వర్గ పోరును పరిష్కరించడంలో ఆయన్ని దృఢమైన మధ్యవర్తిగా నిలబెట్ట గలవు. గత ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో టికెట్లు లభించక, ప్రచారంలో ప్రాధాన్యత రాకపోయిన నాయకులు, కార్యకర్తలు %–% వీరిలో ఏర్పడిన అసంతృప్తిని పరిష్కరించాల్సిన బాధ్యత కొత్త నాయకత్వంపై ఉంది. రాంచందర్ రావు వీరిని కలిసే దశలో నేరుగా స్పందించే వ్యక్తి. ఆయనకు బాధితుల బాధను అర్థం చేసుకునే సామర్థ్యమే కాదు, సంస్థాగత పరిష్కారాలను క్రమబద్ధంగా అమలు చేసే పరిపక్వత కూడా ఉంది. అందువల్ల అసంతృప్తులను మాటలతో కాదు, చర్యలతో చల్లార్చగల నేతగా ఆయన నుంచి పార్టీ కార్యకర్తలు ఆశలు పెట్టుకున్నారు. తెలంగాణ బీజేపీలో పెద్ద సమస్యగా మారిన అంశం క్యాడర్ నిరాసక్తత. కార్యకర్తలు అనిశ్చిత స్థితిలో ఉండడం, విభిన్న వర్గాలకు దూరంగా మారడం, ఆధునిక ప్రచార పద్ధతులకు లోబడిన కొందరు నాయకుల చేతుల్లో పార్టీ పరిమిత మవడం వల్ల గ్రాస్ రూట్ స్థాయిలో అసంతృప్తి తలెత్తింది. రాంచందర్ రావు నియోజకవర్గ స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు, బూత్ స్థాయిలో తిరిగి పనిచేసే స్వచ్ఛత కలిగిన గుణాత్మక కార్యాచరణను రూపొందించే సామర్థ్యం కలిగిన నేత. ఆయన వ్యక్తిగత జీవితంలో ఉండే క్రమశిక్షణను పార్టీలోకి చేర్చి, ఒక చక్కటి చైతన్యాన్ని నింపగలరన్న విశ్వాసం కార్యకర్తల్లో ఉంది. కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతలు %–% ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి చేరిన వారితో సామరస్యం నెలకొల్పడమన్నదీ ఓ సవాల్. పాతవారిని నిర్లక్ష్యం చేయకుండా, కొత్తవారిని ఆసక్తితో కలుపుకుంటూ... ఈ రెండు వర్గాల మధ్య సంభాషణకు వేదికగా ఉండగల నాయకుడు రాంచందర్ రావు. ఆయన మాట్లాడే తీరులో పొలిటికల్ శబ్దం కన్నా, సామరస్యాన్ని సూచించే సున్నిత భాష ఉంటుంది. అలాంటి చతురత రాజకీయాల్లో కొద్దిమందికే సాధ్యం. తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉన్నప్పటికీ, బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడలేక. పోవడంలో ప్రధాన కారణం %–% రాజకీయ దూకుడు లేకపోవడమే. ఈ స్థితిని మారుస్తూ, నిరుద్యోగం, విద్యా, వ్యవసాయ సమస్యలపై బలమైన ఉద్యమాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత రాంచందర్ రావుపైనే ఉంది. ఆయన గతంలో న్యాయ వేదికలపై చేసిన ఉద్యమాలు, ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఉద్యమంలో పాల్గొన్న తీరు ఇప్పుడు బీజేపీ ఉద్యమాల్లో ప్రత్యక్షించాల్సిన మార్గాన్ని సూచిస్తాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పార్టీకి ఇప్పుడే వ్యూహాత్మక ప్రణాళిక అవసరం. బూత్ కమిటీల పునర్వ్యవస్థీకరణ, సోషల్ మీడియా ప్రచార వ్యూహాలు, సామాజిక వర్గాల తత్వాల అర్థం, వాటిపై అవగాహన కలిగిన ప్రణాళికలు%ొ% ఇవన్నీ రాంచందర్ రావు వంటి పరిణతితో కూడిన నాయకుడి చేతిలో రూపొందితేనే విజయవంత మవుతాయి. రాంచందర్ రావు న్యాయవాది కాబట్టి, విశ్లేషణాత్మకంగా ఆలోచించే శైలి ఆయన రాజకీయ నిర్ణయాలకు కూడ అన్వయించ గలదు. పోటీదారుల గౌరవాన్ని నిలుపుతూ, వారిని సమర్థవంతంగా ఉపయోగించుకునే విధానాన్ని అమలు చేయగల నాయకుడిగా రాంచందర్ రావు వ్యవహరించ గలరన్న నమ్మకం ఉంది. పార్టీలో పోటీ తత్వాన్ని అంతరంగిక విభేదంగా కాక, బలంగా మార్చే శక్తిని ఆయన దృక్పథం కలిగించి చూపగలదు. ఎవరి వైపు మొగ్గు చూపక, పార్టీ ప్రయోజనాలకే పెద్దపీట వేసే నైతిక స్థైర్యం ఆయన వ్యక్తిత్వాన్ని ప్రత్యేకంగా నిలబెడుతుంది. రాంచందర్ రావు కు గల ప్లస్ పాయింట్స్...ఆయన తక్కువ గొడవలతో, ఎక్కువ ప్రభావాన్ని చూపగల నాయకుడు. వాదనకు పదును, వ్యవహారానికి సంయమనం కలగలిపిన నాయకుడు. వర్గీయ సర్దుబాట్లకు అనువైన వ్యక్తిత్వం. న్యాయవాది శైలి ద్వారా వ్యవస్థాపిత రాజకీయం. ఢిల్లీ మద్దతుతో పాటు, రాష్ట్ర క్యాడర్‌కు అవగాహన ఉన్న వ్యక్తి. దూకుడు రాజకీయం కాకుండా, దృఢమైన వ్యవస్థాపక దిశలో పార్టీని నడిపించే శక్తి. ఇవన్నీ సమీక్షిస్తే, బీజేపీకి రాంచందర్ రావు నాయకత్వం ఒక వ్యూహాత్మక వనరుగా మారవచ్చునన్న అంచనాలు కొట్టిపారేయ లేనివి. పార్టీకి నూతన దిశ, క్యాడర్‌కి ప్రేరణ, ప్రజల్లో విశ్వాసం, రాజకీయ ప్రత్యామ్నాయంగా నిలవగల సామర్థ్యం %–% ఈ నాలుగు అంశాల సమ్మిళితి ఈ నాయకుడిలో కనిపిస్తుంది. ఈ సందర్భంగా బీజేపీ తన గమనాన్ని క్రమబద్ధత, క్రమశిక్షణ, ప్రజాసమస్యల పట్ల స్పందనలతో నింపుకుని ముందుకు నడిచే అవకాశాన్ని చేజార్చు కోకూడదు. నాయకత్వ మార్పు అపహాస్యం కాకూడదు. రాంచందర్ రావుతో ఆ అవకాశం ఇప్పుడు బీజేపీ ముందుంది. ఆ అవకాశాన్ని ఎంతవరకు వినియోగించు కుంటుందో? ఏ మేరకు సఫలీకృతం అవుతుందో! వేచి చూడాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు, కాలమిస్టు... 9440595494**

చురకలు

## సంపాదకీయం

# ఏపీ బీజేపీలో మాధవ్..

## నెట్టుకొస్తారా.. నెగ్గుకొస్తారా ..!

ఏపీ బీజేపీ చీఫ్‌గా పగ్గాలు చేపట్టారు పాకాల వెంకట నాగేంద్ర మాధవ్ (పీవీఎన్ మాధవ్). ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో మాధవ్ పగ్గాలు చేపట్టడం ఎవరికీ ఇబ్బంది లేకపోయినా.. వాస్తవ పరిస్థితిని గమనిస్తే.. మాత్రం పార్టీని ఎలా ముందుకు నడిపిస్తారన్నది మాత్రం ప్రశ్నగానే మిగులుతుంది. పార్టీలో గత ఎన్నికలకు ముందు నుంచి కూడా.. రెండు మూడు గ్రూపులు పనిచేస్తున్నాయి. ఈ వర్గ, గ్రూపు రాజకీయాలే పార్టీని క్షేత్రస్థాయిలో డెవలప్ కాకుండా అడ్డుకుంటున్నాయన్న చర్చ కూడా ఉంది. వీటిలో ప్రధానంగా వ్యక్తుల ఆధారంగా ఏర్పడిన గ్రూపులు, సైద్ధాంతిక విధానాల ప్రాతిపదికన ఏర్పడిన గ్రూపులు. ఇక, సామాజిక వర్గాల ఆధారంగా కూడా గ్రూపులు ఏర్పడ్డాయి. ఇలా ఏపీ బీజేపీ ఎక్కడికక్కడ గ్రూపులు కట్టింది. ఎవరి లాభం వారు చూసుకుంటున్నారు. అదేసమయంలో అధిష్టానంలోని పెద్దలతో మచ్చిక పెంచుకుని .. చక్రాలు తిప్పుతున్న వారు కూడా ఉన్నారు. ఇలాంటివారిని లైన్‌లో పెట్టాల్సిన అవసరం పార్టీకి ఉందన్నది తరచుగా చెప్పుకొనే మాట. కానీ, అంత తేలిక కాదు. రాష్ట్రంలో ఒకప్పుడు బీజేపీకి, ఇప్పుడున్న బీజేపీకి తేడా ఏంటంటే.. ఒకప్పుడు.. ఆర్ ఎస్ ఎస్ వాదంతో తెర మీదికి వచ్చిన నాయకులు పార్టీ తరఫున వాయిస్ వినిపించేవారు. కానీ, తర్వాత కాలంలో వ్యాపారులు, సామాజిక వర్గం పరంగా శాసించేవారు బీజేపీ బాటపట్టారు. చిత్రం ఏంటంటే.. ప్రస్తుతం ఎన్నికైన వారిలో ఎక్కువగా ఉన్నది కూడా వీరే. టికెట్లు దక్కించుకున్నది కూడా వీరే. సో.. ఇలాంటి వారి ఆధిపత్యాన్ని పాత కాపులు సహించలేక పోతున్నారు. ఇంకో మాటలో చెప్పాలంటే.. క్షత్రియ, కాపు సామాజిక వర్గం.. బీజేపీని ఓన్ చేసుకున్న పరిస్థితి ఒకప్పుడు ఉంది. కానీ, తర్వాత కాలంలో కమ్మ సామాజిక వర్గం జోక్యంతో తమ హవాకు బ్రేకులు పడుతున్నాయన్న ది వారు చెబుతున్న మాట. ఈ నేపథ్యంలోనే ఎప్పటికప్పుడు రాష్ట్ర బీజేపీ చీఫ్‌పై ఒత్తిడి పెరుగుతూనే ఉంది. కానీ, గత చీఫ్‌లు వీటిని పెద్దగా పట్టించుకోలేదు. దీంతో పార్టీ దూకుడు కూడా.. కొందరికే పరిమితం అయింది. ఇక, ఇప్పుడు మాధవ్ పైనే అందరూ ఆశలు పెట్టుకున్నారు. మరి మాధవ్ ఎలాంటి వ్యూహంతో ముందుకు సాగుతారు? అనేది చూడాలి. ఇతర నాయ కుల దూకుడుకు తానే అలవాటు పడి నెట్టుకు రావడమా..? లేక, అందరూ తన మాట విని.. పార్టీ సిద్ధాంతా లకు అనుకూలంగా పనిచేయించేలా నెగ్గుకు వస్తారా? అనేది చూడాలి.

# తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య - జూలై 4.......దొడ్డి కొమరయ్య వర్ధంతి



తెలంగాణ చరిత్రలో దొడ్డి కొమరయ్య పేరు ఒక శాశ్వత చిహ్నం. అతను ఒక వ్యక్తి కాదు ఒక చైతన్యం, ఒక ఉద్యమ కెరటం. భూస్వామ్య దోపిడీ, వెట్టి చాకిరి, జాతి వివక్ష, నిజాం నియంతృత్వం వంటి అన్యాయాలపై తొలి ఉద్యమపు అగ్రశ్రేణి పోరాట యోధుడు. ప్రజల జీవన హక్కుల కోసం పోరాడుతూ తన ప్రాణాన్ని అర్పించిన తొలి అమరుడు. ఈయన కథ తెలంగాణ ప్రజల చరిత్రలో మరచి పోలేని విప్లవగాథ. తెలంగాణ సాయుధ పోరాటానికి పూర్వ నేపథ్యం తెలుసుకోవాల్సి వస్తే, నిజాం పాలిత హైదరాబాద్ సంస్థానంలోని సామాజిక పరిస్థితుల వైపు దృష్టి మళ్లించాలి. నిజాం రాజ్య వ్యవస్థ బ్రిటిషు వలస పాలనను దాటిపోయే విధంగా ఫ్యూడల్ భూస్వామ్యపు పెత్తనాన్ని నిగ్రహ రహితంగా అమలు చేసింది. పేద రైతులు తమ భూముల్లోనూ భూస్వాముల అనుమతి లేకుండా సాగు చేయలేని స్థితి. బలవంతపు పన్నులు, వడ్డీలు, శ్రమ దోపిడీ సామాన్య జీవనాన్ని అంధకారపు తెరల్లోకి నెట్టేశాయి. వెట్టి చాకిరి అశేష తెలంగాణ ప్రజానీకం దశాబ్దాల తరబడి ఎదుర్కొన్న శాప గ్రస్త జీవితం. వ్యవసాయ భూములు నిజాం ప్రభుత్వానికే చెందాలన్న భావ జాలంతో, దొరలు దేశ్‌ముఖ్‌లుగా నియమితులై ప్రజలపై రాజనీతి, ఆర్థికంగా ఆడి పాడారు. వివిధ పేర్లతో బహుళ రకాల పన్నుల భారం ప్రజలపై మోప బడింది. తల్లిదండ్రుల బాకీ తాళం విడిపించు కోవాలంటే, వారి పిల్లలు దొరల ఇంట్లో పనులు చేయాల్సిన దుస్థితి. ఇది కేవలం ఆర్థిక అంశం కాదు ఇది మానవీయ హక్కుల విషయం. ఈ నిష్ఠుర పాలనకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు కమ్యూనిస్టు పార్టీ ఓ మార్గదర్శక పాత్ర పోషించింది. విప్లవ ప్రచార కర్తలు గ్రామాల చుట్టూ తిరుగుతూ భూస్వామ్య దోపిడీపై ప్రజలకు అవగాహన కల్పించారు. సంఘాల రూపంలో గ్రామ స్థాయిలో ప్రజా సంఘటనలు ఆవిర్భవించాయి. ఇదే సమయంలో, యువతలో ఉద్యమ స్ఫూర్తి మేల్కొంది. ఆ యువశక్తిలో అగ్రగామిగా నిలిచిన వ్యక్తి దొడ్డి కొమరయ్య. కొమరయ్య 1927 ఏప్రిల్ 3న వరంగల్ జిల్లా లోని (ప్రస్తుతం జనగామ జిల్లా) దేవరుప్పుల మండలానికి చెందిన కడివెండి గ్రామంలో పుట్టాడు. కురుమ వృత్తి నిరత కుటుంబంలో పుట్టినా, ధైర్యమే ఆయన మూలధనం. చిన్న వయస్సులోనే వ్యవసాయ శ్రమలో పాల్గొన్న ఆయన, దొరల అరాచకాల పట్ల అసహనంతో ఉన్నాడు. అతని అన్న దొడ్డి మల్లయ్య కమ్యూనిస్టు ఉద్యమంలో చురుకైన నాయకుడు. ఆ ప్రభావంతో కొమరయ్య బాల్యం లోనే ప్రజా సమస్యలపై స్పందించడం ప్రారంభించాడు. ప్రజల్లో ఉన్న భయాన్ని చెరిపి వేసే ధైర్యం, చైతన్యం ఆయన వాణిలో ప్రతిఫలించేది. కడివెండి గ్రామంలోని దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి, అతని తల్లి జానకమ్మలు ప్రజల భూములు, పంటలు, పశువులపై తమదైన హక్కులున్నట్లు ప్రవర్తించేవారు. ప్రజలు నిరంతరం దాడులకు, అవమానాలకు గురయ్యేవారు. దొడ్డి మల్లయ్య ఆధ్వర్యంలో "గుత్పల సంఘం", "వడిసెల సంఘం", "కారంపొడి సంఘం"లు ఏర్పడ్డాయి. వీటివల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. కొమరయ్య ఈ సంఘాల ద్వారా గ్రామ స్థాయిలో ప్రజలకు చైతన్యం తీసుకొచ్చాడు. అన్యాయాలను భరించ వద్దని, తిరగ బడాలని నినదించాడు. 1946 జూలై 4వ తేదీ తెలంగాణ చరిత్రలో మరిచి పోలేని రోజు. దేశ్‌ముఖ్ గడిపై తిరుగుబాటు చేయాలని నిర్ణయించిన గ్రామ ప్రజలు ఊరేగింపుగా, నినాదాలతో ముందుకు సాగారు. దొడ్డి మల్లయ్య, దొడ్డి కొమరయ్య ముందుండి నడిపించారు. గడిలో దాగి ఉన్న రజాకార్లు, దేశ్‌ముఖ్ బంట్లు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దొడ్డి కొమరయ్య ఛాతీలో బుల్లెట్ తగిలి అక్కడికక్కడే వీరమరణం పొందాడు. అప్పటికి అతని వయస్సు కేవలం 19 సంవత్సరాలు మాత్రమే. ఈ సంఘటన తెలంగాణ సాయుధ పోరాటానికి మారుపథాన్ని ఇచ్చింది. అప్పటివరకు వాదనలతో, వ్యతిరేకతలతో సాగిన ఉద్యమం ఇకపై తుపాకులతో, ప్రాణాల బలిదానాలతో సాగవలసిన నిశ్చయానికి వచ్చిందని ఈ సంఘటన తెలియ జేసింది. కొమరయ్య మరణం విన్న గ్రామాలు రగిలి పోయాయి. దొరల గడులు కాలి పోయాయి. భూస్వామ్య వ్యతిరేకత తెలంగాణ మట్టిలో విప్లవ స్వరూపాన్ని తీసుకుంది. "దున్నేవాడిదే భూమి" అన్న నినాదం మానవ హక్కుగా మారింది. 1946 నుంచి 1951 వరకు సాగిన ఈ సాయుధ పోరాటంలో వేలాది మంది యువకులు ప్రాణాలను పణంగా పెట్టారు. లక్షల ఎకరాల భూమి లేని పేదలకు పంచబడింది. నిజాం పాలన కుదేలైంది. 1948 సెప్టెంబర్ 17న "ఆపరేషన్ పోలో" ద్వారా భారత ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానాన్ని భారత సమాఖ్యలో విలీనం చేయ గలిగింది. ఇది తక్షణ విజయంగా కనిపించినా, దాని వెనుక శ్రమించిన అమరుల రక్తం, ధైర్యం మసక బారనిది. దొడ్డి కొమరయ్య ఆ అమరులలో తొలి జ్యోతి. ఆయన త్యాగం కేవలం తెలంగాణ సాయుధ పోరాటానికి మాత్రమే కాదు, దశాబ్దాల తర్వాత ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి కూడా బలాన్నిచ్చింది. కొమరయ్య పేరు జెండాలపై మెరిసింది, నినాదాలలో పలికింది, ప్రజా పాటల గుండెల్లో వినిపించింది. విద్యార్థి సంఘాల పేర్లలో ఆయనను గుర్తు చేసుకున్నారు. ఉద్యమాలలో స్ఫూర్తిగా నిలిచారు. దొడ్డి కొమరయ్య పేదల హక్కుల కోసం ప్రాణం అర్పించిన తొలి దీపం. అణచివేతకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగిసిన ధీర కెరటం . ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచే తెలంగాణ యోధ కిషోరం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు, కాలమిస్టు ...9440595494**

# బడ్జెట్ కూర్పులో సాటిలేని మేటి కొణిజేటి - జూలై 4.. కొణిజేటి రోశయ్య జయంతి

ఆయన సీనియర్ రాజకీయ నాయకుడు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వివిధ కీలక శాఖల మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కర్ణాటక, తమిళ నాడు గవర్నర్ గా విధులు నిర్వర్తించిన అరుదైన అవకాశాలు పొందిన రాజకీయ దురంధరుడు. బడ్జెట్ తయారీ స్పెషలిస్టుగా, తన వాగ్ధాటితో శాసన సభ్యులను, మండలి సభ్యులను ఆకట్టుకున్న ప్రత్యేక శైలిని కలిగి ఉన్న ఘనుడు. విపక్షాలకు శాసన సభలో, మండలిలో ధీటైన సమాధానాలు చెప్పి ఒప్పించిన చతురుడు. 15సార్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన అరుదైన గౌరవం పొందిన మంత్రి. ఆయనే కొణిజేటి రోశయ్య. ఆచార్య ఎన్జీ రంగా శిష్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన రోశయ్య అనేక పదవులు నిర్వహించారు. ఎమ్మెల్యేగా ..ఎమ్మెల్సీగా..ఎంపీగా చట్ట సభల్లో సుదీర్ఘ కాలం పని చేసిన ఘనత ఆయనకే దక్కింది. 1968–85: శాసనమండలి సభ్యుడుగాబీ 1978–79: శాసన మండలిలో ప్రతిపక్ష నేతగాబీ 1979–83: రాష్ట్ర మంత్రిగాబీ 1985–89: తెనాలి శాసన సభ్యునిగాబీ 1989–94: మంత్రిగాబీ 2004–09: చీరాల శాసన సభ్యునిగాబీ 2004 : మంత్రిగాబీ 2009 : రాష్ట్ర శాసన మండలి సభ్యునిగాబీ 2009, సెప్టెంబరు – 2010 నవంబరు 24: ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రిగాబీ 3 సెప్టెంబరు 2009 %–% 25 జూన్ 2011 వరకు, కర్ణాటక గవర్నర్ గా 28 జూన్ 2014 %–% 31 ఆగస్టు 2014 వరకు, తమిళ నాడు గవర్నర్ గా 31 ఆగస్టు 2011 %–% 30 ఆగస్టు 2016 వరకు పని చేశారు. వివిధ పదవులు అనుభవించిన, సమర్థ వంతంగా నిర్వహించిన సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి రోశయ్య. 1933, జూలై 4న గుంటూరు జిల్లా వేమూరు గ్రామములో జన్మించారు. గుంటూరు హిందూ కళాశాలలో కామర్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. రోశయ్య విద్యార్థి దశలోనే ఎన్జీ రంగా శిష్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసారు. ఆయన 1968,1974, 1980,2009 లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 1979లో టంగుటూరి అంజయ్య ప్రభుత్వంలో రవాణ, గృహ నిర్మాణం, వాణిజ్య పన్నుల శాఖలు, 1982లో కోట్ల విజయ భాస్కరరెడ్డి ప్రభుత్వంలో హోం శాఖ, 1989లో మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, రవాణ, విద్యుత్తు శాఖలు, 1991లో నేదురుమల్లి జనార్ధనరెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్తు శాఖలు, 1992లో కోట్ల విజయ భాస్కర రెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్తు శాఖలకు మంత్రిగా పనిచేసారు. 1994 నుంచి 1996 వరకు ఆయన పీసీసీ అధ్యక్షుడిగా పని చేసారు. 1998లో నరసరావుపేట నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2004, 2009లో వై.యస్. రాజశేఖర రెడ్డి ప్రభుత్వములో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిం చారు. ఆయన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ (ఆర్థిక ప్రణాళిక)ను ఇప్పటికి 15 సార్లు ఆంధ్ర ప్రదేశ్ శాసనసభలో ప్రవేశపెట్టారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో సుదీర్ఘకాలం పాటు ఆర్థికమంత్రిగా పనిచేసిన రోశయ్య 2009–10 బడ్జెటుతో కలిపి మొత్తం 15 సార్లు రాష్ట్ర బడ్జెటును ప్రవేశ పెట్టారు. ఇందులో చివరి 7 సార్లు వరుసగా ప్రవేశ పెట్టడం విశేషం. అలా బడ్జెట్ కూర్పులో రోశయ్య సాటిలేని మేటి గా పేరు పొందారు. ముఖ్యమంత్రిగా వై.ఎస్. రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందడంతో 2009, సెప్టెంబర్ 3 న రోశయ్య ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసారు. పద్నాలుగు నెలలు అధికారంలో కొనసాగిన అనంతరం 2010 నవంబరు 24 వ తేదీన తన పదవికి రాజీనామా చేసారు . 2011 ఆగస్టు 31న రోశయ్య



తమిళనాడు రాష్ట్ర గవర్నరుగా ప్రమాణ స్వీకారం చేశారు. 2016 ఆగస్టు 30 వరకూ గవర్నరుగా తన సేవలు అందించారు. 2007లో ఆంధ్ర విశ్వ విద్యాలయం రోశయ్యకు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. 2018 ఫిబ్రవరి 11 నాడు టి.సుబ్బి రామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యను గజమాలతో సత్కరించి జీవన సాఫల్య పురస్కారం అందించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా వెంకయ్య నాయుడు... రోశయ్యకు స్వర్ణ కంకణం బహుకరించారు. అనారోగ్యంతో బాధపడుతూ రోశయ్య (88) 2021 డిసెంబర్ 4న ఉదయం రక్త పోటు తగ్గి, ఆస్పత్రికి తరలించ బడి, మార్గమధ్యలోనే మృతి చెందారు. రోశయ్య తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించు కున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఆపత్కాలంలో ఆపద్ధర్మ ప్రధాని నందా - జూలై 4...గుల్జారీలాల్ నందా జయంతి

గుల్జారీలాల్ నందా పేరు ఈ తరం వారికి చాలా మంది తెలియక పోవచ్చు. అయన భారత దేశానికి రెండు సార్లు ఆపద్ధర్మ ప్రధాన మంత్రిగా భాధ్యతలను చేపట్టారు. పదవిలో ఉన్న ప్రధాని ఆకస్మికంగా మరణిస్తే, లోకసభ సభ్యులు మరో నేతను ఎన్నుకుని ఆ పదవిలో సదరు నేత చేరే వరకు తాత్కాలికంగా ప్రధాని పదవిని రాజ్యాంగం ప్రకారం నిర్వహించే పదాధికారిని ఆపద్ధర్మ ప్రధాన మంత్రి అంటారు. అలా నందా మొదటి సారి 1964 లో భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ మరణం తరువాత13 రోజులు (27 మే 1964 %–% 9 జూన్ 1964)బీ రెండవసారి 1966లో లాల్ బహదూర్ శాస్త్రి మరణం తరువాత (11 జనవరి 1966 %–% 24 జనవరి 1966) 13 రోజులు ఈ పదవిని చేపట్టారు. గుర్జారీలాల్ నందా (జూలై 4, 1898 – జనవరి 15, 1998) నిబద్ధత కలిగిన జాతీయ రాజకీయ నాయకుడు, ఆర్థికవేత్త. కార్మిక సమస్యలపై ప్రత్యేకంగా కృషిచేసిన వ్యక్తి. రెండు పర్యాయములు భారతదేశ తాత్కాలిక ప్రధాన మంత్రిగా నెల రోజుల లోపే పదవిలో ఉన్నారు. రెండు సందర్భాలలోనూ లోకసభలో మెజారిటీ సభ్యులు కలిగి ఉన్న భారత జాతీయ కాంగ్రెస్, లోకసభ నాయకుడిని అంటే ప్రధాన మంత్రిగా కొత్త నేత ఎన్నిన్నుకునే వరకు ఈ రెండు సందర్భాలలో దేశ మలి రాష్ట్రపతి సర్వేపల్లి రాధా కృష్ణన్ చేత ప్రమాణ స్వీకారం చేయించ బడి, పరిపాలన బాధ్యతలు చేపట్టారు. 1997లో అతనికి భారత రత్న పురస్కారం స్వీకరించారు. గుల్జారీలాల్ నందా 1898 జూలై 4న బ్రిటిష్ ఇండియాలో అవిభాజ్య పంజాబ్ ప్రాంతములోని సియాల్‌కోట్ (ప్రస్తుతము పంజాబ్ (పాకిస్తాన్)లో ఉన్నది) పంజాబీ హిందూ కుటుంబంలో జన్మించారు. లాహోర్, అమృత్‌సర్, ఆగ్రా, అలహాబాద్ లలో విద్యాభ్యాసం చేసారు. ఆయున1920–1921 వరకు ఈయున అలహాబాద్ విశ్వవిద్యాలయములో కార్మిక సమస్యలపై పరిశోధన చేశారు. 1921 లో బొంబాయిలోని నేషనల్ కాలేజీలో ఆచార్య పదవిని పొందారు. అదే సంవత్సరము బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగిన సహాయ నిరాకరణోద్యమములో పాల్గొన్నారు. 1922లో అహమ్మదాబాద్ టెక్స్‌టైల్ కార్మిక సంఘము కార్యదర్శిగా చేరి 1946 వరకు అందులోనే కొనసాగారు. 1932లో సత్యాగ్రహము చేసి జైలు కెళ్లారు. మరలా 1942 నుండి 1944 వరకు జైలులో గడిపారు. రిజిస్టరు కాబడిన "అలహాబాదు విశ్వ విద్యాలయ పూర్వ విద్యార్థుల అసోసియేషన్" విడుదలచేసిన 42 సభ్యుల జాబితాలో "గర్వపడ వలసిన పూర్వ విద్యార్థి" గా గౌరవింప బడ్డారు. 1937లో బ్రిటిష్ ప్రభుత్వంలో బొంబాయి శాసనసభకు ఎన్నికైనారు. తరువాత 1937 నుండి 1939 వరకు బొంబాయి ప్రభుత్వంలో పార్లమెంటు సెక్రటరీ గా (కార్మిక, ఎక్సైజ్ శాఖలు) సేవలనందించారు. 1946 నుండి 1950 వరకు బొంబాయి ప్రభుత్వంలో కార్మిక మంత్రిగా ఉన్నప్పుడు అతను రాష్ట్ర శాసనసభలో కార్మిక వివాదాల బిల్లును ప్రవేశపెట్టడంలో విజయవంతంగా నాయకత్వం వహించారు. కస్తూర్బా మెమోరియల్ ట్రస్టు లో ఒక ట్రస్టీగా తన సేవలను అందించారు. హిందూస్థాన్ మజదూర్ సేవక్ సంఘ్ కు సెక్రటరీగా, బొంబాయి హౌసింగ్ బోర్డు కు చైర్మన్ గా పని చేశారు. జాతీయ ప్లానింగ్ కమిటీలో సభ్యుడుగా ఉన్నారు. "ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్" ను నిర్వహించడంలో ముఖ్యపాత్ర వహించి, తరువాత ఆ సంస్థకు అధ్యక్షునిగా భాధ్యతలు చేపట్టారు. 1947లో నందా జెనీవా, స్విడ్జర్లాండ్ దేశాలలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సభలకు ప్రభుత్వ ప్రతినిధిగా హాజరయ్యారు. ఆ సమావేశంలో "ఫ్రీడం ఆఫ్ అసోసియేషన్ కమిటి"లో పనిచేస్తూ, స్వీడన్, ఫ్రాన్స్, స్విడ్జర్లాండ్, బెల్జియం, యు.కె దేశాలను సందర్శించి ఆ దేశాలలో గల కార్మికులు, వారి గృహ పరిస్థితులను అధ్యయనం చేసారు. మార్చి 1950లో భారత ప్లానింగ్ కమీషన్ లో వైస్ చైర్మన్ గా చేరారు. 1951 సెప్టెంబరులో అతను భారత ప్రభుత్వంలో ప్లానింగ్ మంత్రిగా నియమింప బడ్డారు. ఆయనకు వ్యవసాయం, విద్యుత్ శాఖలను కూడా అదనంగా కేటాయించారు. 1952 సార్వత్రిక ఎన్నికలలో బొంబాయి నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. తిరిగి ప్లానింగ్, వ్యవసాయం, విద్యుత్ శాఖలకు మంత్రిగా నియమితుడయ్యారు. 1955 లో సింగపూర్ లో జరిగిన ప్లాన్ కన్సల్టేటివ్ కమిటీకి భారతీయ ప్రతినిధులకు నాయకత్వం వహించారు. నందా 1957 ఎన్నికలలో లోక్‌సభకు ఎన్నిక అయి కార్మిక, ఉపాధి, ప్లానింగ్ శాఖలకు కేంద్రమంత్రిగా పనిచేసారు. 1959 లోజెనీవా జరిగిన అంతర్జాతీయ కార్మిక సమావేశాలలో పాల్గొన్నారు. తరువాత ప్లానింగ్ కమీషన్ డిప్యూటీ చైర్మంగా భాధ్యతలు చేపట్టారు. 1959లో ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్



జర్మనీ, యుగోస్లేవియా, ఆస్ట్రియా దేశాలకు పర్యటించారు. నందా 1962 ఎన్నికలలో లోక్‌సభకు గుజరాత్ లోని శంబర్ కాంత నియోజకవర్గం నుండి తిరిగి ఎన్నికయ్యారు. సామ్యవాద నిర్మాణం కోసం కాంగ్రెస్ ఫోరం ప్రారంభించారు.1962 %–% 1963 కాలంలో కార్మిక, ఉపాధి శాఖలకు కేంద్రమంత్రిగాను, 1963 %–% 1966 కాలంలో హోం మంత్రిగానూ పదవులను చేపట్టారు. 1967,1971 లోక్‌సభ ఎన్నికలలో హర్యానాలోని కైతల్ నియోజవ వర్గం నుండి ఎన్నికైనారు. 1970 %–% 1971 కాలంలో రైల్వే శాఖకు కేంద్రమంత్రిగా సేవలనందించారు. గుల్జారిలాల్ నందా రెండు సార్లు ఆపద్ధర్మ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో చైనాతో, పాకిస్తాన్ తో యుద్ధం జరిగిన కీలకమైన సమయంలో సమయోచితంగా పదవి నిర్వహించారు. నందా 1998 జనవరి 15న తన 99వ యేట మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## సహకారంలో.. బంగారం..!

నల్గొండ : బంగారం తాకట్టు రుణాల్లో నల్గొండ డీసీసీబీ (జిల్లా కేంద్ర సహకార బ్యాంకు) రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో మొత్తం 9 డీసీసీబీలు ఉండగా.. గతేడాది మన బ్యాంకు నాలుగో స్థానంలో ఉంది. ఈసారి రెండు స్థానాలు ఎగబాకింది. మొదటి స్థానంలో ఖమ్మం ఉంది. ఈ బ్యాంకుల్లో రైతులతో పాటు వివిధ వర్గాలకు చెందిన ఖాతాదారులున్నారు. కొన్ని నెలలుగా బంగారం తాకట్టు రుణాలపై బ్యాంకు అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పది నిమిషాల్లోనే రుణం మంజూరు చేస్తామని ప్రకటించి దాన్ని పక్కాగా అమలు చేశారు. దీంతో డీసీసీబీ పరిధిలోని శాఖల్లో అనేక మంది రుణాలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. నిబంధనలు సరళంగా ఉండటం, వెళ్లగానే జాప్యం లేకుండా మంజూరు చేయడం, బకాయిలు



చెల్లించిన వెంటనే ఆభరణాలను విడుదల చేయడం వల్ల రుణాలు తీసుకునే వారి సంఖ్య పెరిగింది. దీంతో పాటు దీర్ఘకాలిక, పంటరుణాలు ఏడాది పొడవునా ఎప్పుడైనా ఇస్తున్నారు.

ఇప్పటి వరకు 50,210 మంది రైతులకు రూ.710 కోట్ల రుణాలు మంజూరు చేశారు. వీటి వల్ల ఏడాదికి సుమారు రూ.4 కోట్ల వడ్డీ ఆదాయం రానుంది.

**సమష్టి కృషితోనే సాధ్యం**

బంగారు రుణాలు ఇవ్వడంలో రాష్ట్రంలో రెండో స్థానంలో ఉండటం ఆనందంగా ఉంది. బ్యాంకులో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, పాలకవర్గం సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమైంది. గతేడాది రూ.325 కోట్ల బంగారు రుణాలు ఇవ్వగా.. ఈ ఏడాది రూ.715 కోట్లు ఇచ్చాం. కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్, నల్గొండ.

## లక్ష్యానికి మించి.. బొగ్గు ఉత్పత్తి!

కొత్తగూడెం : అడపాదడపా వర్షాలు కురిసినప్పటికీ జూన్ నెల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి సింగరేణి సంస్థ చేరువైంది. సింగరేణి వ్యాప్తంగా ఐదు ఏరియాలు ఈ ఘనతను అధిగమించగా అందులో మూడు ప్రాంతాలు ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోనివి కావటం గమనార్హం.

**ఐదింట్లో మూడు మనవే..**

జూన్‌లో 49,56,235 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని సింగరేణి లక్ష్యం నిర్దేశించుకోగా 49,43,687 టన్నుల బొగ్గును వెలికితీసింది. సింగరేణి వ్యాప్తంగా ఐదు ఏరియాలు నూరుశాతానికిపైగా బొగ్గు ఉత్పత్తి చేశాయి. వీటిలో కొత్తగూడెం ఏరియా-109%, మణుగూరు ఏరియా-105%, ఇల్లెందు ఏరియా-103% బొగ్గును వెలికితీశాయి. రామగుండం2 ఏరియా 139 శాతంతో అగ్రభాగాన నిలిచింది. బెల్లంపల్లి ఏరియా 129 శాతం బొగ్గును వెలికితీసింది. రామగుండం1 ఏరియా-94%, శ్రీరాంపూర్ ఏరియా-89%, రామగుండం3



ఏరియా-84%, భూపాలపల్లి ఏరియా 79%, మందమర్రి ఏరియా 68% బొగ్గును ఉత్పత్తి చేశాయి. అత్యల్పంగా అడ్రియాల ప్రాజెక్టు కేవలం 13 శాతం బొగ్గు ఉత్పత్తికే పరిమితమైంది. 'రానున్న రెండు, మూడునెలల్లో వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగే ఆస్కారముంది. వర్షాకాలంలో కోల్ బెంచ్‌లను ఏవిధంగా నిర్వహించాలనే అంశంపై ఏరియా జీఎంలకు ఇదివరకే సూచనలు ఇచ్చాం. పని ప్రదేశంలో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపాం. బొగ్గు ఉత్పత్తికి సాధ్యమైనంత తక్కువ విఘాతం కలిగేలా చూసుకోవాలని ఆదేశించాం' అని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం తెలిపారు.

## జూనియర్ కళాశాలలకు మహర్దశ

చేగుంట : రాష్ట్రంలో జూనియర్ కళాశాలలను పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటివరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధుల కేటాయింపు అంతంతే ఉండేది. విద్యార్థుల ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ముందుకొచ్చింది. ఏళ్ల తర్వాత భారీ మొత్తంలో నిధులను ఇంటర్ విద్యాశాఖ మంజూరు చేయడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా 326 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.56.16 కోట్లు మంజూరు చేసింది. ఇందులో మెదక్ జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా రూ.3,26,80,000 కేటాయించారు. జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, నార్సింగి, శివ్వంపేట కళాశాలలకు పక్కా భవనాలు లేకపోవడంతో కేటాయించలేదు.

**మూడు నెలల క్రితం..**

కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు మూడు నెలల క్రితం ప్రతిపాదనలు పంపించారు. ఆ దస్త్రానికి తాజాగా ఆమోద ముద్ర పడింది. పదేళ్ల క్రితం వరకు ఎన్ఆర్జీపీ కింద ఏటా నిధులు మంజూరు చేశారు. అవి ఆగిపోవడంతో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు సొంతంగా ఖర్చు పెట్టడంతో పాటు దాతల సహకారంతో వివిధ పనులు చేయించారు. ఈ క్రమంలో ప్రభుత్వ కళాశాలల్లో సౌకర్యాలు ఉండవన్న భావన నెలకొంది. ఇక ఆ సమస్యలకు పరిష్కారం దొరికే అవకాశం ఉంది.

**వసతుల కల్పనకు..**

విద్యుదీకరణ, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఫర్నిచర్, బోరు బావితో పాటు ఇతర వసతులు కల్పించనున్నారు. వచ్చే నిధులతో అవసరమైన మరమ్మతులు చేపట్టనున్నారు. జిల్లాలో పక్కా భవనాలున్న వాటికి ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలో అత్యధికంగా పాపన్నపేట - రూ.35.50 లక్షలు, చేగుంట- రూ.32 లక్షలు మంజూరయ్యాయి. అత్యల్పంగా మెదక్ బాలికల జూ. కళాశాలకు రూ.11 లక్షలు కేటాయించారు.

# వైద్యం.. సమాజ సేవలో వైవిధ్యం



కరీంనగర్: వైద్యులు ప్రాణాపాయంలో ఉన్న వారిని రక్షిస్తుంటారు. అందుకే వారిని దైవంతో పోలుస్తుంటారు. వారికి సమాజంలో ఎనలేని గౌరవం ఉంటుంది. వృత్తిపరంగా వివిధ విభాగాల్లో వైద్యం చేస్తూనే స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజ సేవ చేస్తున్నారు కొందరు. నిరుపేదలకు అండగా ఉంటూ.. అవసరమైనప్పుడు ఉచిత వైద్య శిబిరాలనూ నిర్వహిస్తున్నారు.

గత అయిదేళ్లతో పోల్చితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్యుల సంఖ్య పెరుగుతోంది. గతంలో రెండు ప్రైవేట్ మెడికల్ కళాశాలలు ఉండేవి. జిల్లాల విభజన తర్వాత గత ప్రభుత్వ హయాంలో నాలుగు కొత్త జిల్లాల్లో ఒక్కో వైద్య కళాశాలను మంజూరు చేసింది. అలా ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారి సంఖ్య కూడా పెరుగుతోంది. కొందరు పీజీ చదవడానికి వెళ్తుండగా.. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు అందుబాటులో ఉన్న పట్టణాల్లో సేవలందిస్తున్నారు. కొందరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పని చేస్తున్నారు. ఫలితంగా వైద్య సేవలు జిల్లా, మండల స్థాయిలో అందుబాటులోకి వస్తున్నాయి. 2020లో ఉమ్మడి జిల్లాలో 1800 వరకు వైద్యులు ఉండేవారు. ప్రస్తుతం వారి సంఖ్య 4,000కు పైగా పెరిగింది.

**అనాథలు, వృద్ధులకు ఉచితంగా చికిత్స**

కరీంనగర్‌లోని ప్రముఖ వైద్యుడు డాక్టర్.ప్రదీప్‌కుమార్ అనాథ పిల్లలు, వృద్ధుల కోసం ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ముకరంపురలో ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తున్న అనాథ పిల్లల ఆశ్రమానికి ప్రతి నెలా కొంత డబ్బులు కేటాయిస్తూనే, ఉచిత వైద్య సేవలూ అందిస్తున్నారు. వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వడమే కాక, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. వాసవి వృద్ధాశ్రమంలోనూ, పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

**స్వచ్ఛంద సేవలో..**

ఎలగందుల శ్రీనివాస్ 25 ఏళ్లుగా కరీంనగర్‌లో వైద్య సేవలు అందిస్తూనే లయన్స్ క్లబ్ ద్వారా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రూ.8 లక్షలతో అంతిమయాత్ర రథాన్ని కొని క్లబ్‌కు అందజేశారు. పోలంపల్లికి ప్రత్యేకంగా అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించారు. పార్థివదేహాలను భద్రపర్చడానికి ఇల్లంతకుంటకు ఫ్రీజర్ కొనిచ్చారు. మహిళలకు కుట్టు మిషన్లు, ఎల్లారెడ్డిపేట మండలంలోని గిరిజన గ్రామం వాంపల్లికి మినరల్ వాటర్‌ప్లాంట్‌ను అందజేశారు. సంతాన సాఫల్య వైద్య సేవలు అందిస్తూనే అవసరమైన వారికి ఉచితంగా చికిత్స చేస్తున్నారు డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని. ఆమె అత్తమ్మ బంగారి లక్ష్మి మహేష్ ట్రస్ట్ ద్వారా ఏటా పది మంది నిరుపేదలను గుర్తించి (ఇప్పటివరకు 50 మందికి) దాదాపు రూ.20 లక్షలతో ఐవీఎఫ్ ద్వారా ఉచిత వైద్యం అందిస్తూ సంతాన భాగ్యం కలిగిస్తున్నారు. ఆమె భర్త బంగారు స్వామి కూడా ఏటా పది మందికి సొంత ఖర్చుతో మోకాళ్ల శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

# కొలతల లెక్క తేలేనా?



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించిన కొలతల పుస్తకాలు(ఎంబీ) మాయంపై ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. కొన్నేళ్లుగా ఎంబీలను ఏఈల దగ్గరే ఉండాలని కమిషనర్లు ఆదేశిస్తున్నా.. కొందరు పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండటం, గుత్తేదారులే పట్టుకొని తిరుగుతుండటం, అంచనాలకు మించి రికార్డు చేయడం కొన్నేళ్లుగా చర్చనీయాంశమైంది. కిసాన్‌నగర్ మార్కెట్‌యార్డులో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ ఎంబీ పుస్తకం మాయం కావడంపై బల్దియా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తీవ్రంగా పరిగణించారు. ఈ విషయంపై మెమో, షోకాజ్ నోటీసు ఇవ్వగా సమాధానం సరైన విధంగా ఇవ్వకపోవడంతో ఏఈ గఫూర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**కొలతలపై ఫిర్యాదులు** వ్యవసాయ మార్కెట్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను రూ.4.80 కోట్లతో నిర్మించేందుకు అప్పటి ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు తయారు చేశారు. అందులో లేని పనులను జత చేశారని, అడ్డగోలుగా రాక్ కట్టింగ్, నాలుగు ఇంచుల సీసీని ఒక ఫీట్‌గా చూపించారని, స్టీల్ డిజైన్‌లో 12 మి.మీ వాడి దానిని 16 మి.మీగా నమోదు చేశారని ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయంపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు రావడంతో అప్పటి అధికారులు విచారణకు ఆదేశించారు. మాజీ కార్పొరేటర్లు బండారి వేణు, ఎం.చంద్రశేఖర్ కమిషనర్‌తోపాటు ఏసీబీ, విజిలెన్స్, సీడీఎంఏ, కలెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీలకు ఫిర్యాదు చేశారు.

**అంచనాలకు మించి..**

నగరంలో కొన్ని అభివృద్ధి పనుల్లో అంచనాలకు మించి బిల్లులు రికార్డు చేశారనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఓ జంక్షన్‌కు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని మళ్లీ ఎంబీ రికార్డు చేయడంతో అధికారులు కంగుతిన్నారు. దాంతో దానిని పక్కన పెట్టేశారు. పనులు పూర్తయిన తర్వాత బిల్లులు అందుకున్నా ఎంబీ ఎందుకు మూసి వేయడంలేదని మాజీ కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు.

**రికవరీ జరిగేనా?**

కిసాన్‌నగర్ సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల ఎంబీ మాయం కావడంతో దానికి సంబంధించిన కొలతలు ఏవిధంగా తీసుకుని లెక్క తేల్చుతారో అధికారులకే తెలియాలి. ఏఈ కొలతల పుస్తకం గుత్తేదారు చేతిలో పెట్టారని, తిరిగి తీసుకోకుండా పోగొట్టారంటూ చర్యలు తీసుకున్నారు. అయితే ఇక్కడితోనే సరి పెడతారా? నిధుల దుర్వినియోగంపై తిరిగి కొలతలు నిర్వహించి రికవరీ చేస్తారా? అనే విషయంలో ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సిందే.

# ఆచార్యుల కొరతపై చింత లేదిక



గోదావరిఖని : రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ఆచార్య, సహాయక ఆచార్యుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అలాగే 49 అడిషనల్ డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ పోస్టులను భర్తీ చేయనుంది. దీంతో ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, గోదావరిఖనిలో వేధిస్తున్న ఆచార్యుల కొరత ఇక తీరనుందనే ఆశాభావం వ్యక్తమవుతుంది.

**ఒకరిద్దరితోనే తరగతులు**

ఆసుపత్రుల్లోని కొన్ని విభాగాల్లో ఒకరిద్దరితోనే తరగతులు నిర్వహిస్తుండగా.. కొన్ని విభాగాల్లో అసలే లేరు. ఒప్పంద విధానంలోనూ నియమించుకునేందుకు ఆయా కళాశాలల నిర్వాహకులకు ప్రభుత్వం అవకాశమిచ్చినా.. ఆయా విభాగాల్లో అర్హులైనవారు పని చేసేందుకు ముందుకు రావడం లేదు. గతంలో ప్రభుత్వ నియామక చర్యలు చేపట్టినప్పుడు కొందరు జాయినింగ్ రిపోర్టు ఇచ్చి దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లారు. అనంతరం ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించుకున్నారు.

**నాన్ క్లినికల్ విభాగంలోనే అధికం**

వైద్య కళాశాలల్లో గైనకాలజిస్ట్, ఎముకలు, పిల్లలు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ తదితర క్లినికల్ విభాగాల్లో కొరత తక్కువగానే ఉన్నప్పటికీ.. తాజాగా ప్రభుత్వం చేపట్టిన నియామకాల్లో ఈ విభాగాల్లోనే అత్యధికంగా సహాయ ఆచార్యుల నియామకానికి చర్యలు తీసుకుంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా నాన్ క్లినికల్ విభాగంలో వివిధ స్థాయిలోని ఆచార్యుల కొరత తీవ్రంగా ఉంది. కొన్ని విభాగాల్లో ఒకే ఒక్క సహాయ ఆచార్యుడు విధులు నిర్వహించాల్సిన పరిస్థితులున్నాయి. గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో 10 మంది ఆచార్యులు, 25 అసోసియేట్, 24 అసిస్టెంట్ ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**దూర ప్రాంతాల్లో బోధనకు విముఖత**

గోదావరిఖనిలో నర్సింగ్, పారామెడికల్ కళాశాలలను మంజూరు చేసినప్పటికీ.. ఆచార్యులను నియమించలేదు. అసలే కొరత ఉండగా.. కొందరు ఇతర ప్రాంతాలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. అయితే ఇటీవల ప్రభుత్వం డిప్యుటేషన్లను రద్దు చేయడంతో వారు యథాస్థానాల్లోకి వచ్చారు. దీంతో కొంత ఉపశమనం కలిగినట్లయింది. అయితే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సహాయ ఆచార్యులుగా నియమితులయ్యేవారు ప్రైవేటు ప్రాక్టీసు చేసుకునే అవకాశం లేకపోవడంతోపాటు హైదరాబాదుకు దూరంగా ఉన్న గోదావరిఖనిలాంటి ప్రాంతాలకు వచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నారనే అభిప్రాయాలున్నాయి.

**నిలిచిన సేవలు**

గోదావరిఖనిలోని బోధనాసుపత్రిలో యూరాలజీ, న్యూరాలజీ విభాగాల్లో వారానికి రెండు రోజులు కొందరు ఆచార్యులు సేవలందిస్తుండగా.. తమతోపాటు సహాయకులు సైతం రెగ్యులర్‌గా ఆసుపత్రికి రావాలంటూ పట్టుబట్టడంతో న్యూరాలజీ విభాగంలోని ఒక సహాయ ఆచార్యుడు ఇటీవల రాజీనామా చేశారు. దీంతో సేవలు నిలిచిపోయాయి. జాతీయ వైద్య కమిషన్ నోటీసులకు స్పందించిన ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటుంది.

## పంచాయతీ ఎన్నికల వేళ.. కాంగ్రెస్‌లో పంచాయితీ

ఆసిఫాబాద్ : జిల్లా కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. తాజాగా సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్‌ను పార్టీ అధిష్ఠానం బహిష్కరించడం చర్చనీయాంశంగా మారింది. ఇదివరకే భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే కోనప్ప సైతం తనకు పార్టీ ప్రాధాన్యం ఇవ్వడం లేదని దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ దండె విఠల్ ఒక్కరే నియోజకవర్గంలో పెద్ద దిక్కుగా నిలిచారు. కాంగ్రెస్‌లో నాయకుల మధ్య సయోధ్యలేదని, తమను పట్టించుకునే వారెవరని కార్యకర్తలు అసంతృప్తికి లోనవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న వేళ సిర్పూర్ నియోజకవర్గం పార్టీ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్ సస్పెన్షన్ ఆసక్తిని కలిగిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఎన్నికల అనంతరం మాజీ ఎమ్మెల్యే కోనప్ప భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరడం



తో.. రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఎమ్మెల్సీ దండె విఠల్ సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో.. మూడు గ్రూపులుగా మారాయి.

**ఒకరి అసంతృప్తి.. మరొకరి వ్యూహం**

ఎమ్మెల్సీ విఠల్ కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి నియోజకవర్గంలో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ బలం పెంచుకునేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. పార్టీలో తనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఇటీవల మాజీ ఎమ్మెల్యే కోనప్ప అసంతృప్తికి లోనై పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థికి బహిరంగంగా మద్దతు పలికిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ నుంచి తప్పుకోబుతున్నట్లు కోనప్ప ప్రకటించి, సీఎం రేవంత్ రెడ్డి నుంచి ఫోన్ చేయడంతో వెళ్లి కలిశారు. దీంతో ఆయన అందులోనే కొనసాగుతారని భావించారు. కానీ తిరిగి వచ్చాక.. పార్టీలో సంతృప్తి లేదని దూరంగా ఉంటున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన మద్దతుదారులను పోటీలో నిలబెట్టాలన్న ఆలోచనతో కోనప్ప ఉన్నట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. మంత్రి సీతక్కపై వ్యతిరేకంగా మాట్లాడారని రావి శ్రీనివాస్‌ను పార్టీ క్రమశిక్షణ కమిటీ సస్పెండ్ చేయడంతో.. ఎమ్మెల్సీ విఠల్‌కు అక్కడ పోటీదారులెవరూ లేకుండా పోయారు.

**ఇక్కడా విభేదాలే..**

ఆసిఫాబాద్ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు కొనసాగుతున్నాయి. డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు.. రెండు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఇది కొన్ని సందర్భాల్లో తమను ఇరుకున పెడుతోందని కొందరు కార్యకర్తలు వాపోతున్నారు. తమ నాయకుడికి చెక్ పెట్టేందుకు భారాస నుంచి ఎంపీగా పోటీ చేసి ఓటమిపాలైన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును.. కాంగ్రెస్ పార్టీలో చేర్పించారని శ్యాంనాయక్ వర్గీయులు విమర్శిస్తున్నారు. ఈ వర్గ విభేదాలు కొన్ని పార్టీ నామినేటెడ్ పదవుల నియామకంపై ప్రభావాన్ని చూపుతున్నట్లు పార్టీ కార్యకర్తలు వాపోతున్నారు. ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి భర్తీ కాకపోవడానికి వర్గ విభేదాలే కారణమన్న చర్చ జరుగుతోంది. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉండగా.. జిల్లాలో మాత్రం భారాస, భాజపా ఎమ్మెల్యేలు ఉండడంతో రాజకీయం రసవత్తరంగా సాగుతోంది.

## వ్రత మండపం.. నిర్మాణంలో జాప్యం!

భద్రాచలం : భద్రాచల రామాలయం, పర్ణశాల దేవాలయాల అభివృద్ధికి మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిధులతో చేపట్టిన పనులు ఇంకా పూర్తికాలేదు. నిబంధనల ప్రకారం ఈపాటికే కొన్ని భవనాలు అందుబాటులోకి రావాల్సి ఉన్నప్పటికీ అది సాధ్యపడలేదు. గుత్తేదారుల జాప్యంతో ఏ పని ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయం పర్యాటకశాఖ రాష్ట్ర అధికారుల దృష్టికి చేరటంతో ఇకనైనా మార్పు వస్తుందని భక్తులు భావిస్తున్నారు.

**పర్యాటక శోభ పెంచేందుకు..**

పుణ్యక్షేత్రాల్లో పర్యాటక శోభ పెంచేందుకు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము 2022 డిసెంబరులో భద్రాచలం రాములవారిని దర్శించుకుని 'ప్రసాద్' పథకానికి భూమిపూజ చేశారు. రాముడు కొలువైన భద్రగిరితో పాటు వనవాసంలో నివాసమున్న పర్ణశాలలో రూ.42కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. రామాలయ స్టేడియం సమీపంలో శిల్పిసగర్‌కాలనీలో రూ.10కోట్లతో వ్రత మండపం నిర్మిస్తున్నారు. దీన్ని గతేడాది అప్పగించాల్సి ఉన్నప్పటికీ పనులు ముందుకు సాగలేదు. రెండుమూడు సార్లు గుత్తేదారుకు నోటీసులు ఇచ్చినప్పటికీ అదే పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టర్‌ను కొనసాగించాలా వద్దా అనే అంశంపై పర్యాటకశాఖ అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. ఇకనుంచైనా పనుల్లో వేగం పెంచితే ఐదారు నెలల్లో వ్రత మండపం అందుబాటులోకి వస్తుంది. దీన్ని రామాలయం అనుబంధం కోసం కేటాయించే ఆస్కారముంది.

**యాత్రికులను ఆకట్టుకునేందుకు..**

గోదావరి బ్రిడ్జి సమీపంలో ఒడ్డుపై రూ.2.75 కోట్లతో క్యాంటీన్ నిర్మిస్తున్నారు. 75శాతం పనులు పూర్తిచేశారు. ఇంటీరియల్ డెకొరేషన్‌తో పాటు సుందరీకరణ పనులను మరో నెలలో పూర్తిచేసేందుకు అధికారులు యత్నిస్తున్నారు.

రూ.1.65 కోట్లతో మిథిలా మండపం ప్రాంగణంలో 1,000 మందికి సరిపడా షెడ్ల నిర్మాణానికి పూనుకున్నారు. 80శాతం పనులు పూర్తిచేశారు. కొద్దిరోజుల్లోనే దీనిని దేవస్థానం స్వాధీనపరచుకోనుంది. పర్ణశాల రామాలయం వద్ద రూ.3.69 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. వీటితో పాటు ప్రధానాలయం వద్ద ప్రసాదాల కౌంటర్లు, రూఫింగ్, ఫ్లోరింగ్, బారికేడ్లను నిర్మించాలి. కోవెల పరిసరాల్లో అప్రోచ్ దారులు, స్వాగత ద్వారం, నడక మార్గానికి అందాన్నిచ్చే లైటింగ్, సేద తీరేందుకు బల్లలు, కరకట్ట వైపు బయో టాయిలెట్లు, దుస్తులు మార్చుకునే సదుపాయం, నదీ విహారం, సీసీ టీవీ వ్యవస్థ ఏర్పాటుచేయాలి. వ్రత మండపం పనుల్లో జాప్యంపై నివేదిక పంపించాం. ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పుడు చేపట్టిన పనులు పూర్తవగానే సీసీ కెమెరాలు అమర్చుతాం.

# ఆంక్షలే అడ్డంకి!

పెద్దపల్లి : తెల్లకాగితాలపై క్రయవిక్రయ ఒప్పందాలు రాసుకున్న వ్యవసాయ భూములకు పట్టా హక్కులు పొందేందుకు భూభారతిలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. 2014 జూన్ 2 నాటికి ముందు సాదాబైనామాలో కొనుగోలు చేసిన రైతులు క్రమబద్ధీకరణకు అర్జీ చేసుకున్నారు. అయిదేళ్ల క్రితం దరఖాస్తులు స్వీకరించగా ప్రస్తుతం భూభారతిలో ఐచ్ఛికం కల్పించారు. అయితే కోర్టు ఆదేశాలతో పట్టా హక్కుల పరిశీలనపై సందిగ్ధం నెలకొంది. కోర్టు స్టే ఖాళీ చేస్తే తప్ప కదలిక వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కాగా ఆగస్టు 15నాటి శతశాతం భూ సమస్యలు పరిష్కరించే లక్ష్యంగా అధికారులు సిద్ధమవుతున్నారు.

**గతంలో క్రమబద్ధీకరణ ఇలా..**

2016లో అప్పటి ప్రభుత్వం తొలిసారి సాదాబైనామా క్రమబద్ధీకరణలో అయిదెకరాలకు మించని వ్యవసాయ భూములను ఉచితంగా తహసీల్దార్ కార్యాలయంలో పట్టా మార్పిడి చేశారు. స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్



ఛార్జీలు తీసుకోలేదు. అయిదెకరాల కంటే ఎక్కువ భూములకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు తీసుకున్నారు. భూభారతిలో ఆర్డీవోలు విచారణ చేసి అర్హులకు రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ ఛార్జీలు వసూలు చేసి పట్టా హక్కులు కల్పించనున్నారు.

**నిరీక్షణకు ఎదురుచూపులు**

తెల్లకాగితంపై కొనుగోలు చేసిన బాధితుల భూములకు హద్దులను గుర్తించి వాంగ్మూలం తీసుకుంటారు.
ఫారం-8 నోటీసులు జారీ చేసి గ్రామపంచాయతీల్లో అతికిస్తారు.
అభ్యంతరాలపై సమగ్ర విచారణ చేసి వాస్తవాలు తేల్చి అర్హులకు పట్టాలు పంపిణీ చేస్తారు. ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉండటంతో పరిశీలనలో జాప్యం నెలకొంది. కోర్టు నుంచి అనుమతి వచ్చిన వెంటనే కదలిక వచ్చే అవకాశం ఉంది. గ్రామాల్లో వీఆర్వోలు లేకపోవడంతో దరఖాస్తుల వడబోత ప్రశ్నార్థకంగా మారింది.
మండలానికి ఇద్దరు చొప్పున ఆర్ఐలు విధుల్లో కొనసాగుతున్నారు. ఒక్కొక్కరికీ పది కంటే ఎక్కువగానే రెవెన్యూ గ్రామాలు ఉండటంతో దరఖాస్తుల పరిశీలనపై సందిగ్ధం నెలకొంది.

**అర్జీలు భద్రమేనా?**

సాదాబైనామాలో 12 అక్టోబరు 2020 నుంచి 10 నవంబరు 2020 మధ్య కాలంలో క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారికి పట్టా హక్కులు కల్పించనున్నారు. అయిదేళ్ల క్రితం జిల్లాలో 35,580 దరఖాస్తులురాగా ప్రస్తుతం భూభారతిలో మరో 5,787 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు కూడా మళ్లీ ఆధారపత్రాలతో దరఖాస్తు చేశారు. గతంలో స్వీకరించిన అర్జీలను తహసీల్ కార్యాలయాల్లో భద్రపరిచారు. ఆన్‌లైన్ చేయకపోవడంతో దరఖాస్తులపై ఆందోళన వ్యక్తమవుతోంది. వీటిని భద్రపరిచారా? లేదా అనే అయోమయం నెలకొంది.

# దర్జాగా కబ్జా

బీబీనగర్ : రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. రాత్రికిరాత్రే నిర్మాణాలు సాగుతున్నా అటువైపు చూసే అధికారే కరవయ్యారు. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలోని యాదాద్రి భువనగిరి బీబీనగర్ మండలంలో సుమారు తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమి (బిలా నెంబర్)లో ఆరు ఎకరాల వరకు కబ్జాకు గురైంది.

**మూడు గ్రామాల మధ్యన మిగులు భూమి**

బీబీనగర్ మండలం రహీంఖాన్‌గూడ శివారులోని రెవెన్యూ సర్వే నెంబర్లు 86, 87, 88, 89, రాఘవాపురం రెవెన్యూ సర్వే నెంబర్లు 572, 573, 574, 575, బీబీనగర్ రెవెన్యూ సర్వే నెంబర్ 522లకు మధ్యన, మూడు రెవెన్యూ గ్రామాల నడుమ సుమారు తొమ్మిది ఎకరాల మిగులు భూమిని గతంలో రహీంఖాన్‌గూడ గ్రామానికి చెందిన కొందరు రైతులు (పక్క సర్వే నెంబర్ల పట్టాదారులు) సాగు చేసే వారు. ఆ తర్వాత ఇరవై ఏళ్ల కిందట సదరు పట్టాదారులు వారిపై పట్టా ఉన్న మొత్తం భూమిని వేరొకరికి విక్రయించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మూడేళ్ల కిందట తమ కుటుంబానికి చెందిన భూమిని మేం సాగుచేసుకుంటామని కొందరు వచ్చి అక్కడ పాక వేసేందుకు ప్రయత్నించగా అది ప్రభుత్వ భూమి అని నాటి సర్పంచి మంచాల రవికుమార్ వారించారు. అయినా వారు వినకుండా అక్కడ సాగుచేసేందుకు ప్రయత్నించడంతో సర్పంచి రవికుమార్ 2022లో బీబీనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయి పరిశీలన చేసి, ప్రభుత్వ మండల సర్వేయర్‌తో సర్వేచేసిన తర్వాత నాటి తహసీల్దార్ అశోక్‌రెడ్డి సదరు స్థలం మూడు గ్రామాల శివారుల మధ్య ఉన్న ఖాళీ భూమి (బిలా నెంబర్) అని, అది ప్రభుత్వానికి చెందుతుందని అధికారికరంగా ధ్రువీకరించారు.

**విద్యుత్తు అనుమతులు ఇవ్వకున్నా..**

రహీంఖాన్‌గూడ శివారులోని భూమిలో బోరు వేసి సౌర విద్యుత్తు సాయంతో అక్కడ సాగుచేయడం మొదలుపెట్టారు. అప్రమత్తమైన గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రభుత్వ భూమిలో అక్రమంగా చొరబడ్డ వారికి ఇంటి, విద్యుత్తు అనుమతులు ఇవ్వొద్దని నాటి సర్పంచి అధికారిక లెటర్ హెడ్‌పై 2024 జనవరి 22న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు మారడం, సర్పంచి పదవీకాలం ముగియడంతో వారిని పట్టించుకునే వారు లేకపోవడంతో ఆక్రమణదారులు సాగుతో ఆగకుండా కట్టడాలకు తెరలేపారు. రహీంఖాన్‌గూడ గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రామకృష్ణను వివరణ కోరగా ఆ విషయం తమకు తెలియదనడం కొసమెరుపు.
ప్రభుత్వ భూమిగా గుర్తించిన ఖాళీ స్థలం నుంచి ఆక్రమణదారులను పంపించాలని 2023 ఫిబ్రవరి 14న (ఫైల్ నెంబర్- బి/161/2023) ద్వారా బీబీనగర్ పోలీసులకు లేఖ కూడా రాశారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇన్నాళ్లు ఖాళీగా ఉన్న భూమిలో ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం**

బీబీనగర్, రహీంఖాన్‌గూడ, రాఘవాపురం గ్రామాల మధ్యన ఉన్న మిగులు భూమిని గత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన, సర్వేచేసి బిలా నంబర్‌గా గుర్తించారు. సదరు భూమిపై పూర్తిహక్కులు ప్రభుత్వానికే ఉంటాయి. ఆక్రమణదారులు కాదని కబ్జాచేసేందుకు యత్నిస్తే చర్యలు తప్పవు. శ్యాంసుందర్‌రెడ్డి, తహసీల్దార్, బీబీనగర్

# 'అమృత్' యోగం.. మందగమనం



తాండూరు: తాండూరు పట్టణం క్రమేపీ విస్తరిస్తోంది.. జనాభా అదే స్థాయిలో పెరుగుతోంది. తాగునీటి అవసరాలు మాత్రం తీరడం లేదు. ఏ కాలమైనా స్థానికులు ఎద్దడి ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద నిధులు మంజూరు చేసింది. గతేడాది ఆగస్టులో పనులకు శంకుస్థాపన జరిగినా, దాదాపు పది నెలలు గడుస్తున్నా వేగం పెరగలేదు. ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మించేందుకు రెండు చోట్ల గుంతలు తవ్వి వదిలేశారు. ఒక చోట మాత్రమే పనులు ప్రారంభించారు.

**పూర్తయితే 3 ఎం.ఎల్.డి. నీటి సరఫరా..**

ఈ పథకం ద్వారా తాగునీటి సరఫరా ప్రాజెక్టు పూర్తయితే పట్టణ వాసులకు నిత్యం 3 ఎం.ఎల్.డి.(మిలియన్ లీటర్ ఫర్ డే) నీరు సరఫరా జరుగుతుంది. ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్‌గృహకల్ప కాలనీల్లో 500 కె.ఎల్ చొప్పున నీటి సామర్థ్యం ఉన్న ఒక్కో ట్యాంకు, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద 1,000 కె.ఎల్ సామర్థ్యం ఉన్న ఒక ట్యాంకు నిర్మిస్తారు. వీటికి మిషన్ భగీరథ ద్వారా 3 ఎం.ఎల్.డి. నీరు సరఫరా చేస్తారు. మొత్తం 60 కిలోమీటర్ల పొడవునా విస్తరించే పైపులైన్‌ను పట్టణంలోని పాత పైపులైన్‌కు అనుసంధానించి నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. పనులు వేగంగా జరగక పోవడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. అవసరాలకు నీటిని కొనుగోలు చేస్తున్నారు. చిన్న కుటుంబాలైతే ప్రతి నెలా రూ.300, పెద్ద కుటుంబాలు రూ.600 చొప్పున వ్యయం చేస్తున్నాయి

**వినియోగంలోకి రాని పాత పంప్‌హౌస్..**

తాండూరు పట్టణ వాసులకు ఒకప్పుడు అవసరానికి తగ్గట్టు తాగునీటిని సరఫరా చేసిన రెండు పంప్‌హౌస్‌ల్లో ఒకటి వినియోగించడంలేదు. దీన్ని అందుబాటుల్లోకి తీసుకురావాల్సిన అధికారులు అటు వైపు దృష్టి పెట్టడం లేదు.

ఇదీ సమాచారం
మున్సిపాలిటీ: తాండూరు
వార్డులు: 36
నివాస గృహాలు: 14,000
అధికారిక జనాభా: 71,000
అనధికారిక జనాభా లెక్క: లక్షకు పైనే
కుళాయిలు: 9,000
ఓవర్‌హెడ్ ట్యాంకులు: 6
నిత్యం అవసరమయ్యే తాగునీరు: 12 ఎం.ఎల్.డి
మిషన్ భగీరథ, పాత పంప్‌హౌస్ నుంచి సరఫరా జరుగుతున్నది: 9 ఎం.ఎల్.డి.

ఆరు నెలల్లో మెరుగైన నీటి సరఫరా

తాండూరు పట్టణానికి ఆరు నెలల్లో మెరుగైన తాగునీటి సరఫరా చేస్తాం. అమృత్ 2.0 పనులు ఆలోగా పూర్తి చేస్తాం. ప్రత్యేకంగా విస్తరించే పైపులైన్‌ను పట్టణంలోని పాత పైపులైన్‌కు అనుసంధానిస్తాం. ప్రజల అవసరాలకు తగ్గట్టు 12 ఎం.ఎల్.డి. నీటిని సరఫరా చేస్తాం. నిరుపయోగంగా ఉన్న పంప్‌హౌస్ అందుబాటులోకి తీసుకువస్తాం. ఖాజాహుస్సేన్, సహాయ ఇంజినీరు.

# తప్పు చేసి.. ముప్పును పసిగట్టి



కరీంనగర్: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.37 లక్షలు అప్పనంగా పలు ఖాతాల్లోకి మళ్లించారు. చేసిన తప్పును తెలుసుకొని తిరిగి వాటిని ఖజానాకు జమ చేస్తున్నారు. ప్రణాళిక లేకపోవడం, పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఇచ్చిన సొమ్మును తిరిగి రాబడుతున్నారు. జిల్లా విద్యాశాఖలోని ఈ వింత వైఖరి ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ బడుల్లోని మౌలిక వసతుల కల్పనకు కొన్ని నెలల కిందటి నుంచి దృష్టి సారించారు. స్వయం సహాయక సంఘాలతోపాటు ప్రధానోపాధ్యాయులు పలు అభివృద్ధి పనులను కలిసికట్టుగా చేశారు. ఈ పనులను ఇంజినీరింగ్ శాఖ, విద్యాశాఖలోని ప్రణాళిక విభాగం అధికారులు పర్యవేక్షించారు. పనుల విషయంలో ఈ అధికారులే అంచనాలు రూపొందించారు. వేగంగా జరగాలని పురమాయించారు. దీంతో వచ్చిన నిధులు ఖర్చవడం.. బిల్లులు చెల్లించడం చకచకా అయిపోయాయి.

**అసలు 'చిక్కు' ఇక్కడే..!**

చేసిన పనులకు కొలతలేసి.. ఎంబీ రికార్డులు నమోదు చేసి బిల్లులు చెల్లించాక.. విద్యాశాఖ అధికారులు ఆలస్యంగా కళ్లు తెరిచారు. చేసిన పనికంటే బిల్లులను ఎక్కువ చెల్లించామని గుర్తించారు. తప్పును సరిదిద్దుకునేందుకు ఇంజినీరింగ్ అధికారులతోపాటు విద్యాశాఖ జిల్లాధికారులు తంటాలు పడుతున్నారు. పాఠశాలల వారీగా అదనంగా వెళ్లిన డబ్బులను తిరిగి ఇవ్వాలని పలువురు ప్రధానోపాధ్యాయులతోపాటు వీవోలకు హుకుం జారీ చేశారు. స్వయం సహాయ సంఘాల్లోని వీవోలతోపాటు ప్రధానోపాధ్యాయుడి సంయుక్త ఖాతాలో నగదును బదిలీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 344 పాఠశాలకు సంబంధించి చేపట్టాల్సిన పనులకు అంచనాలు రూపొందించారు. 336 చోట్ల తాగునీటి వసతి పూర్తయింది. 319 బడుల్లో విద్యుత్తు వ్యవస్థ మెరుగైంది. చిన్నపాటి మరమ్మతులు 304 పాఠశాలల్లో పూర్తయ్యాయి. 335 చోట్ల మూత్రశాలలు నిర్మించారు. రంగులు వేయడం తదితర పనులను 286 చోట్ల చేపట్టారు. వీటికి సంబంధించి రూ.9.83 కోట్లను ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లోకి జమ చేశారు. ఎక్కువ బిల్లులిచ్చామని తిరిగి వసూలుకు శ్రీకారం చుట్టారు.

**రూ.30 లక్షల రికవరీ..!**

114 పాఠశాలల విషయంలో ఇలా తప్పు జరిగినట్లు విద్యాశాఖ అధికారులు ఆలస్యంగా గుర్తించారు. 25 శాతం మొబిలైజేషన్ మొత్తాన్ని అదనంగా ఇచ్చామని గుర్తించారు. ఇలా రూ.37 లక్షల పైచిలుకు ఖాతాల్లోకి వెళ్లింది. ఇందులో ఇప్పటి వరకు రూ.30 లక్షలు రికవరీ చేశారు. మరో 15 బడుల నుంచి రూ.7లక్షలు వసూలు చేయాల్సి ఉంది. గత కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా ఈ పనులను విద్యాశాఖలోని కొందరు చక్కబెట్టారు. ఒక్కో ప్రధానోపాధ్యాయుడికి ఫోన్ చేసి దబాయిస్తూ మరీ.. సొమ్మును తిరిగి రాబట్టారు. అయితే వీరి వైఖరిని ప్రధానోపాధ్యాయులు, వీవోలు తప్పుబడుతున్నారు. కొందరి నుంచి బలవంతంగా ఖాళీ చెక్కులను తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై జిల్లా విద్యాధికారి మొండయ్యను వివరణ కోరగా తాను ఇటీవల బాధ్యతలు చేపట్టానని, గతంలో బిల్లుల చెల్లింపు విషయంలో గందరగోళమనే పరిస్థితి తన దృష్టికి వచ్చిందని దీనిపై దృష్టి సారిస్తానన్నారు.

# నీటిచుట్టూ పాచి.. రోగాల బూచి..!

సూర్యాపేట : వర్షాలు ప్రారంభమయ్యాయి. వ్యాధులు ముసురుకునే సమయం ఇదే. దోమలతోనే కాకుండా మంచినీరు కలుషితం కావడం వల్ల కూడా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకునేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లుగానే ప్రత్యేకంగా వానాకాలం మంచినీటి ట్యాంకుల నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమం చేపడితే తప్పా.. ఉన్న ట్యాంకులు శుభ్రమయ్యే పరిస్థితి లేదు. కొన్ని పురపాలికల్లో నెలలో రెండు సార్లు శుభ్రం చేస్తున్నట్లు చెబుతున్నా వాస్తవానికి నెలకుపైగా సమయం తీసుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం సిబ్బంది కొరత ఉండటమే కాక కొంత నిర్లక్ష్యం కూడా ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం మంది ప్రజలు మంచినీటిని కొనుక్కొని తాగుతుండటం వల్ల ట్యాంకుల శుభ్రతపై అధికారులు దృష్టి సారించడం లేదు. హుజూర్‌నగర్‌లో నెలకోసారి ట్యాంకులను శుభ్రం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. సిబ్బంది కొరత వల్ల అన్నిసార్లు సాధ్యం కావడం లేదు. పట్టణంలో మొత్తం 11 ట్యాంకులున్నాయి. అన్నీ వాడకంలోనే ఉన్నాయి. పురపాలికలో 28 వార్డులు ఉండగా.. 8,600 ఆవాసాలు ఉన్నాయి. 8,600 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. పట్టణం పెరుగుతున్నందున మరో 2 వేల వరకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. ట్యాంకులకు నీటిని విడుదల చేసే సమయంలో సిబ్బంది వెంటనే చూడక పోవడం వల్ల నీరు పొంగిపొర్లి చుట్టూ నాచుపట్టి అపరిశుభ్రంగా తయారవుతోంది. కొన్నిసార్లు మంచినీటి ట్యాంకుల ద్వారా నీరు విడుదల చేయలేని రోజుల్లో ఒక కలుషితమైన బావి నుంచి ఇస్తున్నారు. కమిషనర్ శ్రీనివాసరెడ్డిమాట్లాడుతూ.. నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తున్నామన్నారు. కోదాడ పట్టణంలో చాలా వరకు నీటి ట్యాంకులు పాకురు పట్టి దర్శనమిస్తున్నాయి. పట్టణ వ్యాప్తంగా సుమారు 21 ట్యాంకులు ఉన్నాయి. వీటిలో చాలా ట్యాంకులు పాకురు పట్టి, నీరు లీకేజీతో ఉన్నాయి. ఈ చిత్రంలో ట్యాంకు చుట్టూ పాకురు పట్టి కనిపిస్తున్న ప్రాంతం పట్టణంలోని మాతానగర్‌లోనిది. ట్యాంకు బయటి వైపే ఇలా ఉంటే లోపలి పరిస్థితి



అర్థం చేసుకోవచ్చు. పుర కమిషనర్ రమాదేవి స్పందిస్తూ పట్టణంలోని అన్ని ట్యాంకులు నిత్యం శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశిస్తున్నట్లు తెలిపారు.

**సూర్యాపేటలోని శుభ్రం చేసిన ట్యాంకు**

సూర్యాపేట పురపాలికలో ట్యాంకుల శుభ్రతనుపుర అధికారులు పాటిస్తున్నారు. పట్టణంలో మొత్తం 12 ట్యాంకులు ఉండగా, 11 ట్యాంకులు పట్టణ ప్రజలకు నీటిని అందిస్తున్నాయి. మొత్తం 48 వార్డులుండగా 39,800 నివాసాలు ఉన్నాయి. 70 శాతం నల్లానీటిపై ఆధారపడుతున్నారు. మిగతా 30 శాతం నివాసాలు బోరు నీటిని వినియోగిస్తున్నాయి. మొత్తం నల్లా కనెక్షన్లు 27,820 ఉన్నాయి. 11 ట్యాంకులను నెలకు రెండుసార్లు పుర అధికారులు శుభ్రం చేయిస్తున్నారు. నిర్మల ఆసుపత్రి రోడ్డులోని ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్యాంకు నీటిని నిలిపివేశారు. పుర కమిషనర్‌ను వివరణ కోరగా త్వరలో కొత్త ట్యాంకు నిర్మాణం చేపడతామని, దానికి అనుమతులు వస్తే వెంటనే పాత ట్యాంకును కూల్చివేస్తామని తెలిపారు.

# జల వనరులపై పట్టింపేదీ?

సిరిసిల్ల : చెరువుల మరమ్మతులు కేవలం ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ప్రజలకు బహుళ ప్రయోజనాలు ఇచ్చే జల వనరుల నిర్వహణను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చెరువులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని చెబుతున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 12 చెరువులు, కుంటలు ఉంటాయి. అందులో కొత్త చెరువు, మినీ ట్యాంక్‌బండ్ మినహా అన్ని కట్టలు తుమ్మచెట్లతో దర్శనమిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

**కట్టలు బలహీనంగా..**

భారాస ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువుల్లో పూడిక తీయించారు. నీటి సరఫరా చేసే తూములు, కాలువలకు మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం చెరువుల్లోకి కొద్దిపాటి నీరు చేరింది. ప్రస్తుతం చెరువులో, కట్టలపై పిచ్చిచెట్లు ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించక క్షేత్ర స్థాయి పరిస్థితి



అధ్వానంగా మారింది. చెరువు కట్టలు బలహీనంగా మారాయి. వర్షాలకు పూర్తి స్థాయిల్లో చెరువులు, కుంటలు నిండి పొర్లి కట్టలు తెగిపోతే పెద్దమొత్తంలో నష్టాలు చవిచూడాల్సి వస్తోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

**గత కష్టనష్టాలను మరిచారా?**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాల పెద్దచెరువు కట్టకు 2021లో గండి పడింది. కట్ట తెగిపోవడంతో సిరిసిల్ల పట్టణాన్ని వరద ముంచెత్తింది. తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. పట్టణలోని సంజీవయ్యనగర్‌కు చెందిన దేవయ్య.. రోడ్డు దాటే క్రమంలో వరద నీటిలో మునిగి మృతి చెందారు. నాటి తాలుకు నష్టాల నుంచి పట్టణ ప్రజలు ఇప్పటికీ కోలుకోలేదు. ఇప్పటికైనా మేలుకొని అలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఏటా చెరువులకు గండ్లు పడుతున్నా పట్టించుకోకపోవడం సరికాదని.. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు స్పందించి చెరువు కట్టలను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

# దళారుల దగా

ధర్మపురి: ధర్మపురి కూరగాయల మార్కెట్లో దళారుల రాజ్యమే నడుస్తోంది. పల్లెల నుంచి రైతులు తీసుకువస్తున్న వివిధ రకాల కూరగాయలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ.. అక్కడే అవే కూరగాయలను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. వారు లబ్ధి పొందుతూ.. అన్నదాతలు, వినియోగదారులను మోసం చేస్తున్నారు. ధర్మపురి కూరగాయల మార్కెట్లో గత దశాబ్దకాలంగా ఇది కొనసాగుతోంది.

**సుమారు 50 మంది..**

ధర్మపురి కూరగాయల మార్కెట్లో సుమారుగా 50 మంది దళారులు విక్రయాలు సాగిస్తున్నారు. కొద్దిమంది రైతులు మాత్రమే స్వయంగా విక్రయిస్తున్నారు. ప్రస్తుతం బీర, దొండ, వంకాయ, బోడకాకర, సోరకాయలను రైతులు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. అయితే దళారులు ఒక్కటై రైతులను మభ్యపెట్టి గంప గుత్తగా వారివద్ద నుంచి కూరగాయలు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ.. అక్కడే అధిక ధరలకు



విక్రయిస్తున్నారు. దళారుల దందా నిబంధనలకు విరుద్ధమేనని తెలిసినా పుర అధికారులు చర్యలు తీసుకోవటం లేదు. రూ.8 కోట్ల వ్యయంతో ఆధునిక వసతులు, హంగులతో మార్కెట్‌ను నిర్మించినా ఆరు బయటే విక్రయాలు జరుగుతున్నాయి. ఓ వైపు వర్షం, పశువుల పేడల మధ్య అపరిశుభ్ర వాతావరణంలోనే విక్రయిస్తున్నారు.

**పన్ను తీసుకుంటూ.. వసతులు కరవు**ప్రతి కూరగాయల విక్రయదారుడి వద్ద పుర అధికారులు పన్ను తీసుకుంటున్నారు. కానీ కనీస వసతులు కల్పించలేకపోతున్నారు. దళారుల ప్రమేయం బాగా ఉంది. దీంతో రైతులు నష్టపోతున్నారు. మార్కెట్ స్థలంలో పశువుల పేడ కార్మికులు తొలగించటం లేదు.- తిరుపతి, రైతు

# అనుసంధాన అవస్థలు

మిర్యాలగూడ : నిరుపేద కుటుంబాల వారికి తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వారికి రక్షణ కల్పించే ఆరోగ్యశ్రీ పథకం నూతనంగా ఇచ్చిన రేషన్‌కార్డుల వారికి అనుసంధాన ప్రక్రియ జాప్యం కావడంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2005లో నూతనంగా అప్పటి ప్రభుత్వం రేషన్ కార్డులు అందించిన సమయంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డులను సైతం అందజేసింది. అప్పట్లో రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు వేర్వేరుగా ఉండేవి. ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొని వెళ్తే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందించేవారు.
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సుమారు పదేళ్లపాటు నూతన రేషన్ కార్డులు మంజూరు చేయకపోగా..ఉన్న కార్డులోనే మార్పులు చేసి ఆన్‌లైన్ కార్డులు అందించారు.

ఈ సమయంలో రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొని ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేశారు. నిరుపేదలు అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లినప్పుడు రేషన్‌కార్డు తీసుకెళ్తే దీని ఆధారంగా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తూ వచ్చారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల క్రితం కొత్తగా రేషన్ కార్డులను మంజూరు చేసింది. పాత కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్చడం, మృతుల పేర్లు తొలగింపు, కొత్తగా పెళ్లి చేసుకున్న వారికి నూతనంగా కార్డులు అందించారు. వీరికి చౌక దుకాణాల్లో రేషన్ సరకులు సైతం అందిస్తున్నారు.
నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులకు ఉన్నతాధికారులు ఆరోగ్యశ్రీ అనుసంధానం చేయకపోవడంతో సమస్య తలెత్తుతుంది. నూతనంగా మంజూరు చేసిన కార్డులను ఎప్పటికప్పుడు అనుసంధానం చేసినట్లైతే ఆరోగ్యశ్రీ సేవలు అందే అవకాశం ఉంది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టిసారించి సమస్య పరిష్కరించాలని నూతన రేషన్ కార్డు లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ సమస్యపై తహసీల్దారు శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని వివరించారు.
ఇటీవల మిర్యాలగూడ మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన ఓ చిన్నారికి అనారోగ్య సమస్య తలెత్తగా హైదరాబాద్‌లో ఆపరేషన్ కోసం వెళ్లారు. నూతన రేషన్ కార్డు ఆరోగ్యశ్రీకి అనుసంధానం కాకపోవడంతో అక్కడ తిరస్కరించారు. తిరిగి మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ప్రత్యేకంగా ధ్రువీకరణ పత్రం తీసుకొని వెళ్లడంతో సమస్య తీరింది.

# డీజీపీఎస్ సర్వే.. ఆక్రమణలు ఆగేనా?

హైదరాబాద్: ఆలయ భూముల ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు దేవాదాయశాఖ డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) సర్వే చేపట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో భాగంగా హైడ్రా బృందంతో కలిసి నెక్నాంపూర్‌లోని గణేశ్ ఆలయ భూములను సర్వేచేశారు. రాజధాని పరిధిలో 19,482.3 ఎకరాల దేవాదాయశాఖ భూములుండగా.. అందులో 6,410.58 ఎకరాలు ఆక్రమణకు గురైంది. తాజాగా చేపట్టిన సర్వే ద్వారా అన్నీ ఆలయాల భూములను డిజిటలీకరించి, నక్షా హద్దులను నిర్ధారించనున్నారు.క్యాడ్ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి భూసర్వే నిర్వహించి కచ్చితమైన మ్యాప్‌లు రూపొందించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

**ఆక్రమణల్లో రెండు, మూడు స్థానాల్లో..**

రాష్ట్రవ్యాప్తంగా ఆలయ భూములు ఆక్రమణకు గురైన జిల్లాల్లో మహబూబ్‌నగర్ మొదటి స్థానంలో ఉండగా.. మేడ్చల్ జిల్లా



రెండోస్థానంలో ఉంది. ఇక్కడ 4,125.03 ఎకరాల భూములు ఉండగా 2,888.18 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. మూడో స్థానంలో హైదరాబాద్ జిల్లా ఉంది. ఇక్కడ 5,718.01 ఎకరాల భూమికి 2,374.25 ఎకరాలు కబ్జాకు గురైంది. సికింద్రాబాద్‌లో 279.25 ఎకరాల భూమికి 7.12 ఎకరాలు కబ్జా చెరలో ఉంది. రంగారెడ్డి జిల్లాలో 9,360.01 ఎకరాలు ఉండగా 1,148.15 ఎకరాలు కబ్జాదారులు ఆక్రమించుకున్నారు. భూముల రక్షణ, నిర్వహణ బాధ్యతలను దేవాదాయశాఖ పర్యవేక్షిస్తోంది.సిబ్బంది కొరతతో ఒక్కో ఈవోకు రెండు నుంచి మూడు ఆలయాల బాధ్యతలు అప్పగించారు. సరైన పర్యవేక్షణ లేక భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

**స్పష్టత కరవు:** సర్వేలు చేయడం, ఆక్రమణలు గుర్తించడం ఆ తర్వాత విస్మరించడం పరిపాటిగా మారిందంటూ ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు విమర్శిస్తున్నారు. చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి కూల్చివేతలు చేపడతారో లేదో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఇందిరమ్మ ఇల్లు.. మాకొద్దు వెళ్లు

హైదరాబాద్: నగరంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మరో సవాలు ఎదురైంది. బస్తీల్లోని గుడిసెలు కూల్చి అక్కడే గృహ సముదాయాలు నిర్మిస్తామంటూ సర్కారు ప్రత్యామ్నాయ ఆలోచనతో ముందుకొచ్చింది. అయితే.. పేదలు దానిపై ఆసక్తి చూపడం లేదు. మొత్తం 8 మండలాల్లోని 13 బస్తీలను ఇళ్ల నిర్మాణానికి ఎంపిక చేయగా.. వాటిలో ఏడు బస్తీల్లో అధికారులు పర్యటించారు. ఎక్కడా స్థానికులు సుముఖత వ్యక్తం చేయలేదని అధికారులు చెబుతున్నారు.

**400చ.అడుగుల విస్తీర్ణంలో 1బీహెచ్‌కే..:** ఎంపిక చేసిన బస్తీల్లో గుడిసెలను తొలగించి.. అక్కడే జీ3 సముదాయాలను నిర్మించాలని





సర్కారు నిర్ణయించింది. ఒక్కో లబ్ధిదారుకి 400చదరపు అడుగుల విస్తీర్ణంలో ఓ పడక గది ఉండే ఫ్లాటును ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. మెహిదీపట్నంలోని మాంగార్‌బస్తీలో ఉన్న 350 వాంబే ఇళ్లను మూడు రోజుల్లో కూల్చాలని అధికారులు నిర్ణయించారు.ఇక్కడ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని అధికారులు చెబుతున్నారు.

**ఏడు చోట్ల తనిఖీలు పూర్తి..**

ఆసిఫ్‌నగర్ మండలంలోని నాలుగు బస్తీలు, సైదాబాద్‌లో రెండు బస్తీలను, మారేడుపల్లిలోని ఓ బస్తీని జీహెచ్ఎంసీ అధికారులు తనిఖీ చేశారు. మాంగార్ బస్తీలోని శిథిల ఇళ్లను కూల్చి ఇందిరమ్మ ఇళ్లను కట్టాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. మిగిలిన చోట్ల మాత్రం.. అధికారుల ప్రతిపాదనను వ్యతిరేకించారు.

**పలు కారణాలతో నిరాసక్తత..**

కొందరికి తక్కువ విస్తీర్ణంలో ఇల్లు ఉండటం, మరికొందరి ఇల్లు పెద్దగా ఉండటం, ఇటీవలే ఇళ్లను ఆధునీకరించుకోవడం, నిర్మించుకోవడం, వ్యక్తిగత గృహాల్లో నివసించేందుకే ప్రాధాన్యమివ్వడం, రకరకాల కారణాలతో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై బస్తీల్లోని గుడిసెవాసులు నిరాసక్తత చూపుతున్నారు.

# జీహెచ్ఎంసీలో డీజిల్ దొంగలు

హైదరాబాద్: దోమల నివారణ కార్యక్రమాల పేరిట పలువురు జీహెచ్ఎంసీ అధికారులు రోజూ వేలాది లీటర్ల డీజిల్ దోపిడీ చేస్తున్నారు. ఏటా రూ.20 కోట్ల ప్రజాధనాన్ని దోచేస్తున్నారు. అవినీతిని అరికడతామంటూ తాజాగా జీహెచ్ఎంసీ 'వన్ డే.. వన్ డివిజన్' పేరిటకార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంతో డీజిల్ చోరీ తగ్గకపోగా, మరింత పెరిగింది. గతంలో సంబంధిత డివిజన్ల సూపర్‌వైజర్లు, సిబ్బంది మాత్రమే వాటాలు తీసుకునేవారు. ప్రస్తుతం సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్ల సూపర్‌వైజర్లు, సిబ్బంది.. రోజువారీ ఇంధన కొనుగోళ్లలో వాటాల కోసం పోటీ పడుతున్నారు. పది శాతం డీజిల్‌తో తూతూమంత్రంగా ఫాగింగ్ చేపట్టి, 90 శాతం ఇంధనం అమ్ముతున్నారు. దోమల నివారణ చర్యలకు జీహెచ్ఎంసీ ఏటా రూ.20 కోట్లు వెచ్చిస్తుంది. అయితే యాంటీ లార్వా ఆపరేషన్ సజావుగా సాగుతుండగా, ఫాగింగ్ గొడవలు సృష్టిస్తోంది.

**10లీటర్లే..:** మూసాపేట వై జంక్షన్ సమీపంలోని భారత్ పెట్రోలు బంక్‌లో జరిగిన ఎంటమాలజీ సిబ్బంది వ్యవహారాన్ని పరిశీలిస్తే.. డీజిల్ దోపిడీ ఏ మేర జరుగుతుందో తెలుస్తుంది. 72 లీటర్లకుగాను సిబ్బంది 10 లీటర్ల డీజిల్ తీసుకెళ్లారు. ఆ పది లీటర్లతో సర్కిల్ మొత్తం ఫాగింగ్ చేయాలి. ఈ రకంగా రోజూ 80 శాతం నుంచి 90 శాతం ఇంధనాన్ని అమ్ముకుంటున్నారు. కొందరు అధికారులు డీజిల్ పేరుతో రోజూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు.

# దవాఖానా.. ప్రాణాలు నిలిచేనా?



హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు వడ్డించే భోజనం విషయంలో శుభ్రత కరవవుతోంది. ముఖ్యంగా వంట గదుల్లో సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. మురుగు పారుతున్న ప్రాంతంలోనే వంటలు చేస్తుండటం.. సరైన జాగ్రత్తలు పాటించకుండా రోగులకు ఆహారం పంపిణీ చేస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవలి వైద్య ఆరోగ్యశాఖ తనిఖీల్లో రోగులకు ఆహార పంపిణీలో పలు లోపాలు బయట పడ్డాయి. తాజాగా ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో ఆహారం కలుషితమై ఒక రోగి చనిపోవడం, మరో 35 మంది అస్వస్థతకు గురి కావడంతో మరోసారి చర్చనీయాంశమైంది. కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రిలో వంటగది ముందు డ్రైనేజీ ఉండటంతో పంది కొక్కులు, ఎలుకలు వస్తున్నాయి.నాంపల్లి, గోల్కొండ, మలక్‌పేట ఏరియా ఆసుపత్రుల్లో వంట గదుల్లో ఎలుకలు, బొద్దింకలు తిరుగుతున్నట్లు విజిలెన్సు అధికారులు గుర్తించారు. సరోజినీదేవి నేత్ర వైద్య శాల వంట గది పక్కనే మురుగు పారుతోంది. ఉస్మానియా ఆసుపత్రిలో కిచెన్ పరిసరాల్లో ఎలుకలు, బొద్దింకలు స్వైర విహారం చేస్తున్నాయి. చేతులు పెట్టి రోగులకు భోజనం వడ్డిస్తున్నారు. దీంతో ఆహారం కలుషితమై మరింత అస్వస్థతకు గురవుతున్నారు.

**తోచిన మెనూ.. తింటే తిను..**

ఆసుపత్రిలో చేరిన వారికి ఆహారం అందించేందుకు ఒక్కో రోగికి ప్రభుత్వం రూ.80వంతున కేటాయిస్తోంది. అయితే పలు దవాఖానాల్లో మెనూ పాటించడం లేదని ఇప్పటికే అధికారులు తనిఖీల్లో గుర్తించారు. ప్రభుత్వం వద్ద డైట్ బకాయిలు పేరుకుపోయాయని చెబుతూ కొందరు గుత్తేదారులు తోచిన మెను వడ్డిస్తున్నారు. సుల్తాన్‌బజార్ మెటర్నిటీ ఆసుపత్రిలో నిత్యం ఒకే తరహా మెనుతో రోగులు సక్రమంగా తినడం లేదు. రాత్రి సమయంలో చాలామంది రోగులు ఉండటం లేదు. వారి పేరుతో మాత్రం భోజనం వడ్డిస్తున్నట్లు రాస్తున్నారు. గతంలో ఎర్రగడ్డ ఆయుర్వేద ఆసుపత్రిలో ఈ తరహా ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టారు.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి..**

వంట చేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

వంట చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలి. పాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

వంట గదిలో బొద్దింకలు, ఎలుకలు లాంటివి లేకుండా ఎప్పటికప్పుడు పెస్ట్ కంట్రోల్ చేయాలి


వంట చేసే ప్రాంతంలో మురుగు కాల్వలు, పైపులైన్ల లీకేజీలు ఉండకూడదు

వేడిగా ఉన్నప్పుడే రోగులకు ఆహారం అందించాలి..రోగుల ప్లేట్లు వేడి నీటితో కడుక్కునేలా ఏర్పాట్లు చేయాలి.

వడ్డించే సిబ్బంది చేతికి గ్లౌజులు ఉండాలి. తలకు టోపీ, నోటికి, ముక్కుకు మాస్క్ ఉండాలి.

వంట చేసేవాళ్లు, వడ్డించే వాళ్లు మరుగుదొడ్డికి వెళ్లినప్పుడు తప్పక చేతులు, కాళ్లు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

# తరువు తరలే.. తనువు మురిసే



హైదరాబాద్: సాధారణంగా ఏదైనా అభివృద్ధి ప్రాజెక్టు చేపడితే పనులకు ఆటంకంగా మారే చెట్లను నరికేస్తుంటారు. ఇది పర్యావరణానికి నష్టమే. రానురాను పచ్చదనం కనుమరుగయ్యే పరిస్థితి. కొత్తగా మొక్కను నాటి అది చెట్టుగా ఎదగాలంటే కొన్నేళ్ల సమయం పడుతుంది. అందుకే చెట్లను నరికేయకుండా వృక్ష సంపదను మరోచోటుకు తరలించి తిరిగి నాటే విధానం (ట్రాన్స్‌లొకేట్) అమలు చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాజెక్టు పనుల్లో భాగంగా వృక్షాలకు ప్రాణం పోస్తున్నారు.

**కొత్త ప్రాంతాల్లో పచ్చదనం...**

చాలావరకు చెట్లను హైదరాబాద్‌లోని జూ పార్కులో ట్రాన్స్‌లొకేట్ చేయనున్నారు. మరికొన్నింటిని కొత్తగా నిర్మించనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీలో పాతనున్నారు. ఇందులో అశోక, నేరేడు, రెయిన్‌ట్రీ, మునగ, మామిడి, సర్కారు తుమ్మ, వేప, బాదం, చింత, చిన్నబాదం, కొబ్బరి, కానుగ, మేడి, మర్రి, రావి, సీమచింత తదితర రకాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. భారీ నిర్మాణాలతో కాంక్రీట్ జంగిల్‌గా మారుతోంది. పచ్చదనం తగ్గిపోయి కాలుష్యం పెరుగుతోంది. ఈ తరుణంలో చెట్లను కాపాడుకోవాల్సి అవసరం చాలా ఉందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు.

**కమిటీకి బాధ్యతలు**

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ చేపడుతున్న రెండు భారీ ప్రాజెక్టు పనుల్లో భాగంగా చెట్లను ట్రాన్స్‌లొకేట్ చేయడానికి ప్రణాళిక సిద్ధమైంది. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫాం, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట అవుటర్ రింగ్ రోడ్డువరకు చేపడుతున్న రెండు ఎలివేటెడ్ కారిడార్లలో దాదాపు 10 వేల పెద్ద, చిన్న చెట్లను గుర్తించారు. సుమారు 4,230 చెట్లను మరోచోటుకు తరలించడానికి ప్రణాళిక సిద్ధంచేశారు. హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో ఒక కమిటీ ఈ పనులు చేపడుతోంది. తొలుత విలువైన చెట్లను గుర్తించి వాటికి మార్కింగ్ చేసి నష్టం లేకుండా తరలించనున్నారు. ఎలివేటెడ్ కారిడార్లలో చాలా చెట్లు పోతుండటంతో తొలుత పర్యావరణవేత్తల నుంచి విమర్శలు వచ్చాయి. దీనిపై కోర్టులో పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ పిటిషన్లు కూడా దాఖలైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసి ప్రతి చెట్టును పరిశీలించి నంబర్లు వేశారు. ట్రాన్స్‌లొకేట్‌కు వీలైనవాటిని గుర్తించి మార్కింగ్ వేశారు. ఇప్పటికే ప్యారడైజ్ నుంచి డెయిరీఫాం కారిడార్‌కు టెండర్లు కూడా పూర్తయ్యాయి. గుత్తేదారు ఎంపిక పూర్తయ్యింది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ముందు అవసరమైన ప్రాంతాల నుంచి చెట్లను ట్రాన్స్‌లొకేట్ చేసేందుకు హెచ్ఎండీఏ కార్యాచరణ రూపొందిస్తోంది.

రెండు కారిడార్లలో పచ్చదనం పరిస్థితి

రెండు కారిడార్లలో గుర్తించిన చెట్లు 10,623

తొలగించేందుకు గుర్తించినవి 3,298

ట్రాన్స్‌లొకేట్‌కు సిద్ధమైనవి 4,230

యథావిధిగా అక్కడేఉండేవి 3095

# అందని పరిహారం.. ఆగిన పనులు!



తాండూరు : వాహన రద్దీ నియంత్రించేందుకు.. ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా ప్రభుత్వం బాహ్యవలయ రహదారిని మంజూరు చేసింది. ఏళ్లుగడుస్తున్న నిధులు పనులు అసంపూర్తిగా మిగిలాయి. భూములు కోల్పోయిన రైతుల్లో కొందరికి ఇంకా పరిహారం చెల్లించలేదు. తాండూరు, యాలాల మండలాల్లోని గ్రామాల మీదుగా తొలిసారిగా బాహ్యవలయ రహదారి నిర్మించాలని ఖరారు చేశారు. 2016-17 నిధులు మంజూరయ్యాయి. 167వ జాతీయ రహదారి నుంచి చెంగోల్, అంతారం తండా, అంతారం, రాజీవ్ గృహకల్ప, ఖాంజాపూర్, బషీర్‌మియా తండా, రాతులపురం వద్ద జాతీయ రహదారి వరకు పనులు చేపట్టారు. అయితే జాతీయ రహదారి నుంచి చెంగోల్, అంతారం తండా, అంతారం మీదుగా ఖాంజాపూర్ గేటు వరకు 7.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తైంది.

**రైతులు అడ్డుకోవడంతో..** అంతారం, అంతారంతండా వద్ద రైతులు తమకు పరిహారం చెల్లించలేదంటూ అడ్డుకోవడంతో కంకరపరిచి పనులు నిలిపివేశారు. వారికి నగదు చెల్లించి పనులు పూర్తి చేస్తే రాకపోకలు సాగించే వీలుంటుంది. దీంతో వాహన రద్దీ తగ్గడంతో పాటు ప్రమాదాలు అరికట్టేందుకు తోడ్పడనుంది. దుమ్ము కాలుష్యం నుంచి లక్ష్మన్నర మందికిపైగా ప్రజలకు ఉపశమనం లభించనుంది. ప్రస్తుతం రహదారిని రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు, మక్కలు ఎండబెట్టేందుకు వినియోగిస్తున్నారు.

**దృష్టిసారించిన సబ్‌కలెక్టర్..**

పనుల ప్రారంభానికి సంబంధించి సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ దృష్టి సారించారు. మూడు నెలల కిందట రహదారిని పరిశీలించారు. ఎక్కడెక్కడ అసంపూర్తి ఉందో ఆరా తీశారు. ఆయా ప్రదేశంలోని రైతుల వివరాలు, సేకరించిన భూవిస్తీర్ణం, చెల్లించాల్సిన పరిహారంపై వివరాలు జరిపారు. పరిహారం అందని రైతులతో చర్చించారు.

**నవంబరులో అందుబాటులోకి: శ్రావణ్‌కుమార్, ఏఈ**

బాహ్యవలయ రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించే ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలో సమావేశం నిర్వహించి చెల్లింపులు పూర్తి చేస్తాం. జాతీయ రహదారి నుంచి ఖాంజాపూర్ వరకు అసంపూర్తి పనులు పూర్తి చేయిస్తాం. వర్షాకాలం పూర్తయ్యాక వాహనాల రాకపోకలకు అనుమతిస్తాం.

బాహ్యవలయ రహదారి: 12కిలోమీటర్లు

మంజూరైన నిధులు: రూ.78 కోట్లు

భూసేకరణ పెండింగ్: 17.5ఎకరాలు

రైతులు: 21 మంది

చెల్లించాల్సిన సొమ్ము: రూ.5కోట్లు

రహదారి నిర్మించింది: 7.5 కి.మీ.

# పంచాయతీలకు కొత్త భవనాలు

వికారాబాద్ : జిల్లాలో సొంత భవనాలు లేని పంచాయతీలకు ప్రభుత్వం కొత్త వాటిని మంజూరు చేసింది. మొత్తం 36 గ్రామాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు ఉపాధి హామీ నిధులు మంజూరు చేశారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున రూ.7.20 కోట్లు కేటాయించింది. అద్దె భవనాలు, ప్రభుత్వ సంస్థల కార్యాలయాల్లో కొనసాగుతున్న వాటికి ప్రాధాన్యమిచ్చారు. వీటి నిర్మాణాలు పూర్తయ్యాకే పరిపాలన సొంత భవనాల్లో కొనసాగుతుంది.

**స్థలాలున్న గ్రామాలే ఎంపిక..**

భవనాల నిర్మాణానికి స్థలాలున్న గ్రామాలనే ఎంపిక చేశారు. స్థలం లేకుండా భవనాలు మంజూరు చేస్తే ఇబ్బందులు పడతారన్న ఉద్దేశంతోనే ఈ విధంగా చేశామని అధికారులు పేర్కొన్నారు. సొంతగా ప్రైవేట్ స్థలాలు కొనుగోలు చేసే స్తోమత పంచాయతీలకు లేదు. ప్రస్తుతం మంజూరైన వాటిని నామినేషన్‌పై కేటాయిస్తారు. అయితే బిల్లులు సకాలంలో వస్తాయో రావోనన్న అనుమానంతో గుత్తేదారులు పనులు చేసేందుకు విముఖత చూపుతున్నారు. పనుల నిర్వహణ బాధ్యతను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు.

**ఇబ్బందులు తీరేలా..:**

జిల్లాలో కొత్త పంచాయతీలు ఏర్పాటయ్యాక సొంత భవనాలు లేక పరిపాలనలో ఇబ్బందులు ఎదురయ్యాయి. చాలా పంచాయతీలు అద్దె భవనాలు, కమ్యూనిటీ భవనాల్లో కొనసాగిస్తున్నారు. జిల్లాలో 566 పంచాయతీలు ఉండగా, కొత్తవాటితోపాటు మహబూబ్‌నగర్ జిల్లా



నుంచి 12, నారాయణపేట జిల్లా నుంచి 2 వికారాబాద్ జిల్లాలో విలీనం చేశారు. దీంతో జిల్లాలో 594 పంచాయతీలు ఏర్పడ్డాయి.

జిల్లాలో ఇలా పంచాయతీలు: 594

సొంత భవనాలు ఉన్నవి: 356

లేనివి: 238

శిథిలావస్థలో ఉన్నవి: 76

లేని వాటికే ప్రాధాన్యం..

జిల్లాలో పూర్తిగా భవనాలు లేని వాటికే కొత్త పంచాయతీ భవనాల మంజూరుకు ప్రాధాన్యమిచ్చాం. ఈ భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్న ఆలోచనతో అధికారులు ఉన్నారు. ముందుగా మండలానికి రెండు చొప్పున భవన నిర్మాణాలను చేపట్టి పూర్తి చేయాలని నిర్ణయించాం.డాక్టర్ పి.జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి

# రబీ ధాన్యానికి అనుమతి.. ఖరీఫ్‌వి తరలింపు

భగత్‌నగర్: అనుమతులు లేకుండా ఒక మిల్లు నుంచి మరో మిల్లుకు ధాన్యం తరలించారనే ఫిర్యాదుపై రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఇటీవల కరీంనగర్‌లో తనిఖీలు నిర్వహించింది. కరీంనగర్‌లోని రాంనగర్‌లో పావని ట్రేడర్స్ కేరాఫ్ హన్మాన్ రైస్‌మిల్లులో ఖరీఫ్‌కు చెందిన ధాన్యం తరలిస్తున్నారనే ఫిర్యాదుపై టాస్క్‌ఫోర్స్ అధికారులు అక్కడికి వచ్చి రికార్డులు పరిశీలించారు. తర్వాత నగునూర్‌లోని సరస్వతి రైస్‌మిల్లుకు వెళ్లి తనిఖీ చేశారు. అయితే వీరు ఖరీఫ్ నిల్వలు లెక్కించకుండా.. రబీ నిల్వలు లెక్కించారు.రాష్ట్ర ప్రభుత్వం మిల్లులకు తప్పనిసరిగా సార్టెక్స్‌తోపాటు పోషక విలువల ఆహారాన్ని జోడించడానికి బ్లెండెడ్ యంత్రాలు ఉండాలని నిబంధన విధించింది. చాలాచోట్ల ఈ యంత్రాలను బిగించుకోవడానికి అనువుగా లేవు. 'ఆ యంత్రాలు బిగించుకుంటాం.. సౌకర్యమున్న మిల్లులను అద్దెకు తీసుకుంటామనే నిబంధన'తో కొంతమంది మిల్లర్లకు ధాన్యం కేటాయించారు. అందులో ఒకటి హన్మాన్ రైస్‌మిల్లు. దీనికి ఖరీఫ్ 2024-25లో ధాన్యం కేటాయించారు. దీని నుంచి మర ఆడించకుండా ఆరుబయట నిల్వ చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా కొన్ని మిల్లుల్లో స్థలం లేకపోయినా, ఇతర ప్రాంతాల్లో నిల్వ చేసుకోవడానికి జిల్లా అధికారులు ప్రస్తుత రబీ ధాన్యం తరలించడానికి అనుమతులు జారీ చేశారు. దీనిని ఆసరాగా చేసుకుని హన్మాన్ రైస్ మిల్లు నుంచి 2008 ఖరీఫ్ ధాన్యం బస్తాలను సరస్వతి రైస్ మిల్లుకు తరలించారు.

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రెండు మిల్లులు తనిఖీ చేశారు. లెక్క సరిపోయిందని తేల్చినట్లు తెలిసింది. ఖరీఫ్ ధాన్యం తరలింపునకు అనుమతులు లేవనే ఫిర్యాదుపై వచ్చిన వారు ఆ ధాన్యంపై ఉన్న టార్పాలిన్ కూడా తొలగించలేదు. నగునూర్‌కు వెళ్లి రబీ సీజన్ తాలుకు ధాన్యం బస్తాలు ఉజ్జాయింపుగా



లెక్కించారు.రాంపూర్ మిల్లులో ఇప్పటి వరకు ఖరీఫ్ ధాన్యమే మిల్లింగ్ చేయలేదు. అయినా జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు రబీ సీజన్‌కు చెందిన 2790 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించారు. నిబంధనల ప్రకారం ఆ రైస్ మిల్లులకు రబీ ధాన్యం కేటాయించొద్దు. వాటిలో మర ఆడిస్తే నూక శాతం ఎక్కువ వస్తుంది.

**ఫిర్యాదు మేరకే..**

రబీ ధాన్యాన్ని ఇతర మిల్లులకు తరలించాలని అనుమతి ఇస్తే ఖరీఫ్ ధాన్యం తరలించారని ఫిర్యాదు వచ్చింది. దీనిపై తనిఖీ చేయడానికి టాస్క్‌ఫోర్స్ బృందం వచ్చింది. నిజానిజాలు నివేదిక తర్వాత తేలుతాయి. – నర్సింగ్‌రావు, డీఎస్‌వో

**ప్రభుత్వానికి నివేదికమేము** ధాన్యాన్ని, రికార్డులను పరిశీలించాం. సంబంధిత నివేదికను ప్రభుత్వానికి పంపుతాం. దీనిపై ఇప్పుడే వివరాలు చెప్పం – ప్రభాకర్, ఓఎస్‌డీ

# ఈ నెలా ఉడకలే!

ఒంగోలు : జిల్లాలోని తెల్ల రేషన్ కార్డుదారులకు జులైలోనూ కందిపప్పు అందలేదు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నుంచే జిల్లాకు కేటాయింపులు లేకపోవడంతో డీలర్లు కూడా డీడీలు తీయలేదు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ నుంచి ఎండీయూ వాహనాలను రద్దు చేయగాబీ 65 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందుల్లేకుండా వారిళ్లకే డీలర్లు వెళ్లి సరకులు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో జులైకు సంబంధించి గత అయిదు రోజులుగా కార్డుదారుల ఇళ్ల వద్దకే సరఫరా చేస్తున్నారు. మిగతా కార్డుదారులకు జిల్లాలోని చౌక ధరల దుకాణాల ద్వారా మంగళవారం నుంచి నిత్యావసర సరకుల పంపిణీ ప్రారంభం కానుండగాబీ బియ్యం, పంచదార మాత్రమే అందించనున్నారు. గతేడాది నవంబరులో అన్ని రకాల సరకులు అందించేవిధంగా ఎన్డీయే ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లాలోని పౌరసరఫరాలసంస్థ గోదాంల నుంచి నూరు శాతం కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేసింది. ఆ తరువాత డిసెంబరు, జనవరి నెలలోనూ 50 శాతం కుటుంబాలకే కందిపప్పు సరఫరా జరిగింది. అనంతరం గత ఆరు నెలలగా కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో కార్డుదారులకు బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. నెలల తరబడి కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బయట కొనలేక...**

జిల్లాలో 1,392 చౌక ధరల దుకాణాలుండగా, 6.61 లక్షల బియ్యం



కార్డులున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచదార, కందిపప్పు తూకంలో తేడాలు నియంత్రించింది. కార్డుదారులకు నెలల తరబడి కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో కార్డుదారులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని కార్డుదారులకు నెలకు 650 టన్నులు డిమాండు ఉండగాబీ అందుకు ఈ నెలలోనూ కేటాయింపులు జరగలేదు. కిలో కందిపప్పు బయట మార్కెట్‌లో నాణ్యత ఆధారంగా ధర రూ.110 నుంచి రూ.130 వరకు పలుకుతుండగా, పౌరసరఫరాలశాఖ ద్వారా కేవలం రూ.67కే అందిస్తున్నారు. ఇది కార్డుదారులకు అధిక ధర నుంచి ఉపశమనం కలిగించనుంది. రాష్ట్ర స్థాయి నుంచే కందిపప్పు సరఫరా లేకపోవడంతో జిల్లాలోని పౌరసరఫరాలశాఖ అధికారులు చేతులెత్తేశారు. మరోపక్క కార్డుదారులకు డీలర్లు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది.


చౌక ధరల దుకాణాలు: 1,392

మొత్తం కార్డులు : 6,61,206

# పొగాకు కర్షకులు ఖుషీ!

ఒంగోలు : ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే కొనేవారు లేక నల్లబర్లీ పొగాకు రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని జాతీయ రహదారులపై నిరసనలు తెలిపారు. పంట కొనేందుకు పొగాకు వ్యాపారులు ముందుకు రాకపోవడం, ఒకవేళ వచ్చినా తక్కువ ధరకు అడగడంతో దిక్కుదోచని స్థితిలో కొట్టుమిట్టాడారు. రైతుల కష్టాలు తెలుసుకున్న ప్రభుత్వం నల్లబర్లీ పొగాకు కొంటామని హామీ ఇచ్చింది. గత వారం ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు, అద్దంకి, నాగులుప్పాలపాడు, మద్దిపాడు తదితర ప్రాంతాల్లో పొగాకు సాగైంది. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పది కొనుగోలు కేంద్రాలు నడుస్తున్నాయి. నాణ్యమైన పొగాకు కిలో ధర రూ.120 కాగా, తక్కువ నాణ్యత గల సరకు రూ.90, రూ.60 ధరకు కొనుగోలు చేస్తున్నారు. రైతులు సీఎం యాప్‌లో వివరాలు నమోదు చేసుకుని పంటను విక్రయిస్తున్నారు. నోబిడ్స్ కూడా పది శాతంలోపే ఉంటున్నాయి. ప్రస్తుతం జిల్లాలోని మద్దిపాడు మండలం గుండ్లాపల్లిలో రోజుకు 300 బేళ్లు వరకు కొనుగోళ్లు జరుగుతున్నాయి. గత సోమవారం నుంచి పూర్తిస్థాయిలో కేంద్రం తెరచుకోగా, ఇప్పటి వరకు సుమారు 1,700 బేళ్లు కొనుగోలు చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో కేంద్రాలు తెరచు కోవడంతో ప్రైవేటు కంపెనీలు కూడా ముందుకొచ్చాయి. రైతుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో నల్లబర్లీ పొగాకు రైతుల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రభుత్వం నాలుగు జిల్లాల పరిధిలో 20 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలుకు నిర్ణయం తీసుకుందని, ఆ మేరకు రైతుల నుంచి నల్లబర్లీ కొనుగోలు చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు హరికృష్ణ పేర్కొన్నారు. మరో రెండు నెలల వరకు కొనుగోళ్లు కొనసాగుతాయని తెలిపారు.

# పనులు జరిగినా.. మోక్షం కలగదా..?



గార : గార మండలం గొర్లెవానిపేట వద్ద ఉన్న జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్) సమీపంలో కొత్తగా రిసోర్సు భవనం నిర్మించారు. 2020 డిసెంబరులో రూ.2.4 కోట్లతో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. అవి పూర్తయి రెండున్నరేళ్లు అవుతున్నా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదు. విద్యాశాఖ పరంగా అందించే శిక్షణ కార్యక్రమాలు ఇక్కడే నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న చోట వసతి లేక అవస్థలు పడుతున్నారు. చాలా శిక్షణలు జిల్లా కేంద్రంలోనే నిర్వహిస్తున్నారు. 200 మంది ఛాత్రోపాధ్యాయులతో పాటు వివిధ అంశాలపై శిక్షణ పొందేందుకు మరో 300 మంది డైట్‌కు వస్తుంటారు. అదనపు భవనాలు ప్రారంభించి ఇబ్బంది లేకుండా చూడాలని వారంతా కోరుతున్నారు. పనులకు సంబంధించి సుమారు రూ.50 లక్షల వరకు బిల్లుల బకాయి ఉండటంతో భవనాలు అప్పగించేందుకు గుత్తేదారు సుముఖంగా లేనట్లు సమాచారం. ఈ విషయమై పనుల పర్యవేక్షక విభాగం ఏఈ సురేష్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. బిల్లు బకాయిలు చెల్లించి.. భవనాలు అప్పగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# అడిగేదెవరు.. తరలించేయ్..!



పుత్తూరు : నగరికి చెందిన వ్యక్తి 20 ఏళ్లుగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి కర్ణాటక తరలిస్తూ రూ.కోట్లు గడించాడు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆయనకు అడ్డే ఉండదు. ఇటీవల పలమనేరు నియోజకవర్గం గంగవరం పరిధిలోని దండపల్లె వద్ద 15 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ శ్రీనివాసులును అదుపులోకి తీసుకుని విచారించగా ఈ బియ్యం నగరికి చెందిన వ్యక్తివని గుర్తించి కేసు నమోదు చేశారు. ఆంధ్ర- తమిళనాడు సరిహద్దులోని తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా నిరాటంకంగా సాగుతోంది. అడ్డుకోవాల్సిన అధికార గణం మామూళ్ల మత్తులో జోగుతోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు అటు కర్ణాటక, ఇటు తమిళనాడు సరిహద్దు కావడంతో అక్రమ వ్యాపారులకు కలిసొస్తోంది. కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలు కర్ణాటకకు సరిహద్దున ఉన్నాయి. కుప్పం తమిళనాడు పక్కనే ఉండటంతో అక్రమ వ్యాపారులు రేషన్ బియ్యం సేకరించి వేలూరు, కృష్ణగిరి, పేర్నంబట్టు, గుడియాత్తం ప్రాంతాలకు తరలిస్తుంటారు. నగరి, జీడీనెల్లూరు, పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లో సేకరించిన బియ్యం కర్ణాటకకు తరలిపోతోంది. సత్యవేడు, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట తదితర ప్రాంతాల్లో సేకరిస్తున్న బియ్యం తడకు చేరుతుంది. అక్కడి నుంచి నెల్లూరుకు చేరి వివిధ పోర్టులకు దర్జాగా పంపుతున్నారు. ఇదంతా తెలిసినా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. జిల్లా నుంచి నిత్యం 10 నుంచి 15 లారీల రేషన్ బియ్యం అక్రమ రవాణా అధికారుల కనుసన్నల్లోనే సాగుతోందనే విమర్శలు ఉన్నాయి.

**అధికారుల సాక్షిగా..**

పలు ప్రాంతాల్లోని పౌరసరఫరాల శాఖ స్టాక్ పాయింటు నుంచే రేషన్ బియ్యం నల్లబజారుకు వెళ్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రేషన్ డీలర్లు లబ్ధిదారులకు కిలోకు రూ.14 నగదు ఇచ్చి బియ్యాన్ని వీరి వద్దే ఉంచుకుని వ్యాపారులకు విక్రయిస్తున్నారు.


**నేరుగా గిడ్డంగుల నుంచి వచ్చాయా..?**

పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం రెండు వాహనాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించినట్లు తేలింది. మరో రెండు వాహనాల్లో ప్రభుత్వ సీల్ కూడా తొలగించకుండా, నేరుగా చౌకదుకాణాల నుంచి వచ్చాయా? లేక గిడ్డంగుల నుంచి నేరుగా అక్రమార్కులకు చేరాయా అనేది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

**రవాణాదారుల అరెస్టు**

నగరి పరిసరాల్లో చౌకబియ్యం అక్రమ రవాణాదారులపై సోమవారం ఆకస్మిక దాడులు చేసి రూ.6 లక్షల విలువచేసే 13 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విక్రమ్, డీటీ మేఘవర్ణం తెలిపారు. కీళ్లపట్టు వద్ద ఖాళీ స్థలంలో రేషన్ బియ్యం లోడ్ చేస్తుండగా, ప్రధాన నిందితుడు అమృతరాజ్‌నాడార్ అలియాస్ టీఆర్‌ఎస్, మరో 8 మందిని అరెస్టు చేశాం. వారి నుంచి ఐదు వాహనాల్లో ఉన్న 13 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకుని వాహనాలు సీజ్ చేశాం. ఈ బియ్యాన్ని తిరుపతి జిల్లా పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు మండలాల నుంచి సేకరించినట్లు గుర్తించాం. ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు ఈ అక్రమ రవాణా రాకెట్ ఛేదించడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేశాం. ఎవరెవరు ఈ రాకెట్ నడుపుతున్నారనే అంశాలను త్వరలోనే వెలుగులోకి వస్తాయని సీఐ పేర్కొన్నారు. ఎస్సై విజయనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# అడిగినంత ఇచ్చుకో.. పన్ను తగ్గించుకో



చిత్తూరు : నగరంలో కొన్ని ప్రాంతాల్లో ఆస్తిపన్ను తగ్గించుకోవడానికి భవన యజమానులతో ఆర్ఐలు కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్నారు. పుత్తూరులో వాణిజ్య సముదాయానికి సంబంధించి ఓ వ్యక్తి ఆస్తిపన్ను విధింపునకు సవరణ చేయాలని ఓ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని సంప్రదించగా.. ఆర్ఐతో మాట్లాడి రూ.20వేల వరకు తగ్గించారు. ఆ మేరకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి కొంత నగదు ముట్టజెప్పాడు.

పురపాలక సంఘాల్లో రాబడి పెంచాలని ప్రభుత్వం తలచింది. ఇందుకుగాను ఇంటింటా సర్వే చేపట్టి, పక్కాగా భవనాల కొలతలు తీసి, ఆస్తి పన్ను మదింపు చేయాలని ప్రాంతీయ డైరెక్టర్లు, సమీక్షలు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని పురపాలికల్లోని రెవెన్యూ విభాగంలో పలువురు వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఒక్కో యజమాని నుంచి రూ.వేలల్లో దండుకుంటున్నారు.

**కొలతల్లో మతలబు**

పెద్ద భవనాలకు తక్కువ కొలతలు చూపి, పన్ను తక్కువగా చేయించుకుని యజమానులు చెల్లిస్తున్నారు. కొన్ని భవనాలకు ఎలాంటి పన్ను వేయలేదు. ఇలాంటి వాటిని గుర్తించి, పురపాలక సంఘంలో ప్రస్తుతం ఆస్తి పన్ను రాబడిని 20 శాతం మేర పెంచాలని, ఇందుకు పక్కాగా సర్వే చేపట్టాలని ఆ శాఖ రాష్ట్ర అధికారులు ఆదేశించారు. ఇది కాస్తా రెవెన్యూ సిబ్బందికి కాసులు కురిపిస్తోంది.

**ఇలా జరుగుతోంది**

పురపాలక సంఘాల్లోని రెవెన్యూ విభాగంలో అధిక సంఖ్యలో ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులు అరకొరగా ఉంటున్నారు. ఇక్కడ రెవెన్యూ అధికారి, ఇన్‌స్పెక్టర్, బిల్లు కలెక్టర్లు ఉంటారు. ఆర్వో, ఆర్ఐ రెగ్యులర్ ఉద్యోగులే ఉండగా, కిందిస్థాయిలో చాలా వరకు ఒప్పంద ఉద్యోగులున్నారు. వీరిలో కొందరు ఓ ముఠాగా ఏర్పడి, వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఇందులో రెగ్యులర్ ఉద్యోగుల హస్తం కూడా ఉంటోంది. భవనం వద్దకెళ్లి, కొలతలు తీస్తున్నారు. ఆ తర్వాత భవన యజమానికి ప్రస్తుతం చెల్లిస్తున్న పన్ను కన్నా.. అధిక మొత్తం చెల్లించాల్సి వస్తుందని, అయితే తమకు కొంత నగదు ముట్టజెప్పితే.. కాస్త కొలతలు తక్కువగా చూపి, పన్ను మదింపు తక్కువ వచ్చేలా చేస్తామని బేరసారాలు చేస్తున్నారు. ఇందులో ఒప్పంద ఉద్యోగులే సూత్రధారులుగా ఉంటున్నారు.

**లిఖితపూర్వక ఫిర్యాదు వస్తే చర్యలు**

నగరాలు, పట్టణాల్లో శాటిలైట్ సర్వే జరుగుతోంది. పన్ను పరిధికి రానివి, పన్ను విధింపులో ఏదైనా లోటుపాట్లు ఉంటే సవరణకు రాష్ట్ర ప్రభుత్వం సర్వేకు ఆదేశించింది. నిబంధనల ప్రకారం సర్వే చేసి ఆస్తిపన్ను మదింపు చేయాలి. చేతివాటం ప్రదర్శించినట్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు వస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.


విశ్వనాథ్, ఆర్డీ, మున్సిపల్ శాఖ

# ఆదిలోనే తడ'బడి'!

ఒంగోలు : ఒకటో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి జిల్లాలో సుమారు 2 వేల మంది విద్యార్థులకు సాంకేతిక సమస్య తలెత్తింది. ఆయా పిల్లలు బడిలో చేరినా యూడైస్‌లో నమోదు కాలేదు. ఫలితంగా 'తల్లికి వందనం' పథకం కింద ప్రయోజనం పొందలేని పరిస్థితి నెలకొంది. ఒకటో తరగతిలో ప్రవేశాలకు తుది గడువు జులై రెండో తేదీ వరకు పొడిగించారు. గతంలో ఈ నెలాఖరు వరకే అవకాశం కల్పించారు. అప్పటివరకు ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు 'తల్లికి వందనం' ఇచ్చేందుకు వివరాలు పంపాలని కోరారు. తాజాగా ఆ గడువు మరో రెండు రోజులపాటు పొడిగించారు. గతేడాదితో పోల్చుకుంటే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలు సుమారు ఏడు వేలు వరకు తగ్గాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చూస్తే 5,046 మంది తక్కువగా ఉంది. బడుల్లో చేరిన పిల్లల్లో ఆధార్ సంఖ్య లేనందువల్ల యూడైస్‌లో చేర్చడానికి వీలు కావడంలేదు.

**ప్రవేశాలు పెంచాలని ఆదేశాలు**

గత వారం రోజులుగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ డీఈవోలతో వెబ్ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. ఒకటో తరగతి ప్రవేశాలకు సంబంధించి జిల్లాల వారీగా లక్ష్యాలు, ఇప్పటివరకు ఎంతమంది చేరారు. లక్ష్యాలు చేరుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? తదితర అంశాలపై సూచనలు ఇస్తున్నారు. పాఠశాలలో చేరిన పిల్లల్లో ఆధార్ సంఖ్య లేని వారి వివరాలు పంపాలని కోరారు. గతేడాది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కలిపి మొత్తం 33 వేల మంది పిల్లలు ఒకటో తరగతిలో ప్రవేశం పొందారు. అంతకు తగ్గకుండా ఈ ఏడాదీ ప్రవేశాలు కల్పించాలని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. కాగా ఇప్పటివరకు 26 వేల మంది చేరారు. ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది 17,541 మంది చేరగా, ఈ ఏడాది ఇప్పటివరకు 12,405 మంది చేరారు. ఆరోతరగతిలో గతేడాది ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 20,276 మంది చేరగా, ఈ ఏడాది ఇప్పటివరకు 15,880 మంది చేరారు. ఈ తేడాను భర్తీచేయడానికి ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు చేశారు.



అంగన్‌వాడీ కేంద్రాల్లో అయిదేళ్ల వయసు నిండిన పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేవిధంగా అవగాహన కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించిన విషయాన్ని వివరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అయిదోతరగతి పూర్తిచేసిన పిల్లలను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

**ఆధార్ లేనివారి వివరాల సేకరణ**

గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల్లో పిల్లలు కొందరు, అనాథలైన వారికి, గిరిజన ప్రాంతాల్లోని పిల్లలకు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు లేనందున ఆధార్ సంఖ్య పొందడానికి వీలు కాలేదని సమాచారం. ఆ విధంగా సుమారు జిల్లాలో రెండు వేల మంది విద్యార్థులున్నారు. వీరి వివరాలు సేకరించి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించి పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

**ఒకటో తరగతిలో ప్రవేశాలిలా....**

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గత నెల 30 నాటికి ప్రవేశాలు : 26,500

గతేడాది ఇదే సమయానికి చేరికలు: 33,000

ఆధార్ సంఖ్య లేక యూడైస్ లెక్కల్లో చేరని విద్యార్థులు : 2,000

# వడ్డెర్లకు తరగని ఉపాధి

నంద్యాల : కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీ అమలుకు అడుగులు వేస్తోంది. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారికి కంకర క్వారీ లీజులు అప్పగించాలని నిర్ణయించింది. వడ్డెర సొసైటీలకు గనుల లీజులు అప్పగించి వారి ఉపాధికి, ఆర్థికాభివృద్ధికి బాటలు వేయనుంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో కంకర, నాపరాయి, పలక క్వారీల వివరాలు అధికారులు సేకరించారు. వాటిని వడ్డెర సొసైటీలకు కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కంకర (రోడ్ మెటల్), పలకలు, క్యూబ్స్, కెర్బ్స్ లీజులు కేటాయించనున్నారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో అనుమతులు ఇవ్వనున్నారు. ఒకే లీజుకు ఒకటి కంటే ఎక్కువ సొసైటీలు దరఖాస్తు చేసుకుంటే ఆ క్వారీకి దగ్గరున్న వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఒక్కో సొసైటీకి 12 హెక్టార్లకు మించకుండా లీజులు కేటాయించనున్నారు.

**ఏటా రూ.15 కోట్ల రాయితీ**

కంకర, పలకలు, క్యూబ్స్, కెర్బ్స్ ఖనిజాలు తవ్వి, తరలించే వారి నుంచి గనుల శాఖ వసూలు చేసే సీనరేజ్‌లో వడ్డెర సొసైటీలకు ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇవ్వనుంది. నంద్యాల జిల్లాలో 37, కర్నూలు జిల్లాలో 8 వడ్డెర సొసైటీలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీటన్నింటికీ లీజుల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వడ్డెర్లకు కేటాయించే గనుల నుంచి వసూలు చేసే సీనరేజ్‌లో 50 శాతం రాయితీ ఇస్తే గనుల శాఖ ఆదాయం రూ.15 కోట్ల వరకు తగ్గనుంది. ఈమేరకు వడ్డెర సొసైటీలకు లబ్ధి చేకూరనుంది.

**ఈ-వేలంతో దెబ్బతీసిన వైకాపా**

వడ్డెర సొసైటీలకు 1990వ సంవత్సరం నుంచి క్వారీ లీజులు



కేటాయిస్తూ వస్తున్నారు. ప్రత్యేకించి నాపరాయి, కంకర లీజులు వీరికే అప్పగించే వారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం గనుల శాఖలో కొత్త విధానాలు అమలు చేసింది. 2022లో లీజుల కేటాయింపుల్లో మార్పులు చేసింది. వడ్డెర సొసైటీలకు కేటాయించే లీజులకు ఈ-వేలం విధానం అమలు చేసింది. దీంతో వడ్డెర్లు వేలంలో పాల్గొంటేనే క్వారీ లీజులు దక్కే పరిస్థితి ఏర్పడింది. క్వారీలు పొందేందుకు బడా బాబులు రంగంలో దిగి ఎక్కువ మొత్తాలకు కంకర తదితర ఖనిజాలను పాడుకుని సొంతం చేసుకున్నారు. దీంతో దశాబ్దాలుగా క్వారీలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వడ్డెర సొసైటీలు, గనుల్లో పనిచేసే వడ్డెర కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

**రెండు వేల హెక్టార్లలో ఖనిజాలు**

వడ్డెర సామాజిక వర్గానికి కేటాయించనున్న వివిధ రకాల గనులు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 2 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి. కంకర గనులు నంద్యాల జిల్లాలో బనగానపల్లి, అవుకు, ప్యాపిలి, కొలిమిగుండ్ల, బేతంచెర్ల, పాణ్యం, మండలాల్లో వంద హెక్టార్లు, కర్నూలు జిల్లాలో ఆదోని, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో 300 హెక్టార్లలో ఉన్నాయి.

నాపరాయి, పలకల గనులు నంద్యాల జిల్లాలో బనగానపల్లి, అవుకు, ప్యాపిలి, కొలిమిగుండ్ల మండలాల్లో 500 హెక్టార్లలో విస్తరించాయి. క్యూబ్స్, కెర్బ్స్ ఖనిజాలు కర్నూలు జిల్లాలోని ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలో సుమారు 300 హెక్టార్లలో ఉన్నాయి.

రోడ్ మెటల్ లీజులు నంద్యాల జిల్లాలో 30, కర్నూలు జిల్లాలో 175 వరకు ఉన్నాయి. నాపరాయికి సంబంధించిన లీజులు నంద్యాల జిల్లాలో 153, కర్నూలు జిల్లాలో 15 ఉన్నాయి.

# ఉద్యానానికి ఊతం!

ఒంగోలు : రైతులకు పంట పండించడం ఎంత కష్టమో చేతికొచ్చాక వాటిని సంరక్షించి విక్రయించుకోవడమూ అంతే కష్టం. ప్రధానంగా మిర్చి, మామిడి, బత్తాయి, టమాట, అరటి, బొప్పాయి, కూరగాయలు తదితర ఉత్తత్తులను సకాలంలో విక్రయించుకోకపోతే నాణ్యత కోల్పోయి నాణ్యత, విలువ తగ్గిపోతుంది. దీంతో రైతులకు దక్కాల్సిన ఆదాయంలో 30 శాతం కోల్పోతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పంట కోత అనంతరం సంరక్షించుకుని మంచి ధరకు విక్రయించుకునేందుకు సీడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజీలు, కోల్డ్ రూంలు, సోలార్ డ్రయ్యర్లు తదితర యూనిట్లను రాయితీపై అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలోని 38 మండలాల్లో మిర్చి సాగుచేసే రైతులు అత్యధికంగా ఉన్నారు. పంట కోత అనంతరం వాటిని ఎండపెట్టడానికి మార్గం లేక పొలాల్లో, కల్లాల్లో ఆర బోస్తున్నారు. వర్షం, మంచుకు నాణ్యత కోల్పోయి మార్కెట్‌లో ధర తగ్గిపోతుంది. వీటిని సంరక్షించుకునే గదులు, యంత్రాలను రాయితీపై ఇస్తే స్థూల ఆదాయం కూడా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు గతం కన్నా రాయితీ పెంచడంతోపాటు కొత్త యూనిట్లు మంజూరు చేసింది.



ఉద్యాన రైతులకు రాయితీపై యూనిట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం జిల్లాకు ఈ ఏడాది రూ.6.35 కోట్లు మంజూరు చేసింది. రైతులు ముందుగా వారి సొంత డబ్బులతో అవసరమైన యూనిట్ ఏర్పాటు చేసుకుంటే ఉద్యానశాఖ అధికారులు పరిశీలించి రాయితీ నిధులు విడుదల చేస్తారు. ఉద్యాన సమీకృత పథకం కింద జిల్లాకు 15 రకాల యూనిట్లు కేటాయించారు. దీనిలో ఎస్సీ, ఎస్టీలకు 24 శాతం మేర చోటు కల్పించారు.

దరఖాస్తు చేసుకోవాలి: యూనిట్లు అవసరమైన రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. యూనిట్ నెలకొల్పిన వెంటనే పరిశీలించి రాయితీ విడుదల చేస్తాం. పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం మొదటి పేజీ, ప్రాజెక్టు నివేదిక వివరాలతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గోపీచంద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

## వెలుగుల మాటున అక్రమాలు

నంద్యాల : విద్యుత్తు వెలుగుల మాటున గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వం మాయ చేసింది. అస్మదీయ కంపెనీకి లబ్ధి చేకూర్చేలా నియంత్రికల సరఫరా బాధ్యత అప్పగించారు. 25 కేవీఏ సామర్థ్యం ఉన్న ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌ను రూ.1,39,999 వరకు కట్టబెట్టారు. అవన్నీ ఇప్పుడు ఎందుకూ పనికిరాకుండా 'కాలి'పోతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2025- 26 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలోనే వెయ్యికిపైగా నియంత్రికలు దగ్ధమయ్యాయి. గత మూడు నెలల్లోనే విద్యుత్తు శాఖకు రూ.16 కోట్ల నష్టం వాటిల్లింది. 63 కేవీ, 100 కేవీ నియంత్రికలూ పదుల సంఖ్యలో పాడయ్యాయి. కొన్ని సెక్షన్ల పరిధిలో కాలిపోయిన నియంత్రికల వివరాల లెక్క తేలడం లేదు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో నియంత్రికల కొనుగోలుకు రూ.15.06 కోట్లు ఖర్చవగా



కాలిపోయిన వాటి విలువే రూ.16 కోట్లు కావడం గమనార్హం.

**వైకాపా హయంలో నాసిరకమైనవి సరఫరా**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ఆరేళ్లలో లెక్కకు మించి నియంత్రికలు కాలిపోయాయి. నియంత్రికల్లో నాసిరకమైన రాగి, అల్యూమినియం తీగలు వాడారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సరఫరా చేసే సమయంలో వాటిని పరిశీలించి ఇవ్వాల్సి ఉంది. దీన్ని పక్కాగా అమలు చేయకపోవడం వల్లే ప్రస్తుతం నష్టపోవాల్సి వస్తోంది. గడివేముల మండలంలో 18, బండిఆత్మకూరు 12, మహానంది 22, నంద్యాల 18, పాణ్యం 16, ఆళ్లగడ్డ 16, రుద్రవరం 17, కొలిమిగుండ్ల 19, కోవెలకుంట్ల 21, డోన్ 13, ప్యాపిలి 13, పగిడ్యాల 17, కొత్తపల్లి 11, కర్నూలు జిల్లాలోని తుగ్గలి 12, కృష్ణగిరి 16, పెద్ద కడబూరు 18, హాలహర్వి 19, సి.బెళగల్ 12, నందవరం 13, గోనెగండ్ల 16, ఆలూరు మండలంలో 14 నియంత్రికలు కాలిపోయాయి. ఇదే మరమ్మతులకు గురవుతున్నవి ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయి.

## మట్టిని మింగుతున్న అన'కొండ'లు

బుక్కపట్నం : అభివృద్ధి పనుల మాటున గుత్తేదారులు మట్టిని దోపిడీ చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే పచ్చని కొండలను యంత్రాలతో తొలిచేస్తున్నారు. నిత్యం టిప్పర్లలో పెద్దఎత్తున మట్టిని తరలించేస్తున్నారు. బుక్కపట్నం మండలం మీదుగా ఎన్‌హెచ్ 342 పనులు జరుగుతున్నాయి. రాశింపల్లి- పాముదుర్తి మధ్య ప్రధాన రహదారికి 50 మీటర్ల దూరంలో ఉన్న కొండను తవ్వేస్తున్నారు.

**పురంలో యథేచ్ఛగా..** హిందూపురంలో రైతుల భూములు, ప్రభుత్వ స్థలాల్లో మట్టిని యథేచ్ఛగా ప్రైవేట్ లేఅవుట్, గ్రీన్ హైవేకు తరలిస్తున్నారు. ఇప్పటికే చిలమత్తూరు మండలం లేపాక్షి నాలెడ్జి హబ్‌లో రైతులకు చెందిన దాదాపు 50 ఎకరాల్లోని మట్టిని తరలించారు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేయగా గుత్తేదారు స్థానిక నాయకుల ద్వారా కొంత మొత్తాన్ని ముట్టజెప్పి మొండిచెయ్యి చూపించాడు. మట్టి తవ్విన భూముల్లో వ్యవసాయం చేయటానికి వీలులేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బేవనహళ్లి వద్ద హంద్రీనీవా కాలువ మట్టిని ఓ ప్రైవేట్ లేఅవుట్కు పొక్లెయిన్‌ల ద్వారా తరలించారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.

**రోజూ వంద ట్రిప్పుల తరలింపు**

సామాన్యులు సొంత అవసరాలకు మట్టి కావాలంటే పంచాయతీశాఖ నుంచి అనుమతి పొందాలి. అంతేకాకుండా సీనరేజ్ ఛార్జీలు, రాయల్టీ చెల్లించాల్సి ఉంది. అలాంటివేవీ లేకుండా, రుసుం కట్టకుండా గుత్తేదారులు రోడ్డు పనులకు మట్టిని తవ్వి తీసుకెళ్తున్నారు. రోజూ వంద ట్రిప్పుల మట్టి తరలిపోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అనుమతులు ఇవ్వలేదు**

నరసింహులు, ఇన్‌ఛార్జి తహసీల్దార్, బుక్కపట్నం

మట్టి తవ్వకాలకు అనుమతి తప్పనిసరి. రాశింపల్లి-పాముదుర్తి మధ్య కొండలో మట్టి తవ్వకానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తాం. ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరిస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

## సున్నిపెంట.. ఆక్రమణల పుట్ట

నంద్యాల: సున్నిపెంటలో ప్రభుత్వ భూములు, భవనాల కబ్జా యథేచ్ఛగా సాగుతోంది.. గతంలో భూములు, భవనాలు ఆక్రమించుకున్నవారు తాజాగా విక్రయిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. సున్నిపెంటలో ఉన్న భూములన్నీ శ్రీశైలం జలాశయం సమయంలో ప్రభుత్వం సేకరించింది. మిగిలిన 716 ఎకరాలను పరిరక్షించడంలో జలవనరుల శాఖ అధికారులు విఫలమవుతున్నారు. రూ.కోట్ల విలువైన భూములను అనధికారికంగా విక్రయించేస్తున్నారు.

**నివేదికను దాచి పెట్టారు** వైకాపా హయాంలో నాటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆయన అనుచరులు భూములను ఆక్రమించారన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ఏఏ భూములను వారు ఆక్రమించుకున్నారన్న విషయాన్ని తేల్చాలంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చాయి. ఆయా ఆదేశాల ప్రకారం ఆత్మకూరు ఆర్డీవో సూచనల మేరకు సున్నిపెంటలో అధికారులు విచారణ చేశారు. ఆక్రమణలు వాస్తవమేనని నిర్ధారించారు. నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**అమ్మకానికి పెట్టేశారు**

ఓ ప్రభుత్వ భవనంలో గతంలో రేషన్ దుకాణాన్ని నిర్వహించేవారు. తాజాగా దాన్ని ఇతరులకు అనధికారికంగా విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. ఓ వ్యక్తి జలవనరులశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

రింగుపార్క్ సమీపంలో శ్రీశైలం-హైదరాబాద్ రహదారికి ఆనుకుని లాడ్జి నిర్మాణం జరుగుతోంది. ముఖ్య కూడలిలోని ప్రభుత్వ స్థలంలో నిర్మాణం జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

జలవనరులశాఖకు గతంలో పారిశుద్ధ్య విభాగానికి సున్నిపెంటలో ప్రత్యేకంగా ఒక కార్యాలయం ఉండేది. సుమారు ఒక విస్తీర్ణంలో దాన్ని నిర్మించారు. కాలక్రమంలో ఆ భవనం శిథిలావస్థకు చేరింది. పారిశుద్ధ్య విభాగానికి సంబంధించిన ఉద్యోగులను డ్యాంకు బదిలీ చేశారు. ఓ కీలక నాయకుడి అండదండలతో సంఘం నాయకులు తమ ఆధీనంలోకి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

# భవిష్యనిధి లోగుట్టు ఎవరికెరుక?



అనకాపల్లి : మనం బ్యాంకులో వెయ్యి రూపాయలు ఎస్‌బీ ఖాతాలో జమ చేయగానే అందులో ఎంత నిల్వ ఉందో తెలుసుకోవాలని ఆరాటపడుతాం. ఎప్పటికప్పుడు ఖాతాలో నిల్వలు చూసుకుంటేనే మనసు కుదుటగా ఉంటుంది. నాలుగేళ్ల నుంచి చూసుకోవడానికి అవకాశం లేకుంటే ఎంత కంగారుపడుతామో మాటల్లో వర్ణించలేం. జిల్లా పరిషత్తు ఉద్యోగులు తమ భవిష్యనిధి (పీఎఫ్) వివరాలను తెలుసుకోవడానికి ఎంతో ఆరాటపడుతున్నా అధికారులు స్పందించక పోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జడ్పీ ఉద్యోగుల భవిష్యనిధి సమాచారం అందిస్తున్నారు. వార్షిక వివరాలను ఎప్పకప్పుడు ఇస్తున్నారు. అనంతపురం జిల్లాపరిషత్తులో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఎప్పటికపుడు నవీకరణ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో ప్రతి రోజూ వందల మంది ఉద్యోగులు వివరాల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

**7వేల మందికి సమస్య**

జడ్పీ పరిధిలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. వీరు ప్రతినెలా పీఎఫ్ ఖాతాకు కొంత సొమ్ము జమ చేస్తుంటారు. ఆ మొత్తానికి ఏటా వడ్డీ లెక్కగట్టి వివరాలను ఉద్యోగికి అందిస్తారు. జడ్పీలో పనిచేసే ఉద్యోగులు ఎప్పటికప్పుడు పీఎఫ్ వివరాలను నవీకరించాలి.

ఉద్యోగులు జీతం నుంచి కనీసం 6 నుంచి 20 శాతానికి పైగా పీఎఫ్ ఖాతాకు మళ్లిస్తారు. సర్వీసు 20 ఏళ్లు దాటిన తర్వాత లేదంటే వయస్సు 50 ఏళ్లు దాటాక భవిష్యనిధి సొమ్ముపై రుణాలు తీసుకుంటారు. కొందరు ఇల్లు కొనుగోలు, బిడ్డల పెళ్లి, వైద్య ఖర్చులకు అప్పు తీసుకుంటారు. నిధికి సంబంధించి పూర్తి వివరాలు నవీకరణ చేయకపోవడంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ప్రస్తుతం ఎలాంటి సాఫ్ట్‌వేర్ లేకపోవడంతో పీఎఫ్ మొత్తాన్ని వడ్డీ కలపకుండా కంప్యూటర్‌లో చూపిస్తున్నారు. వడ్డీ లెక్కించడం లేదని వాపోతున్నారు. జడ్పీలో ప్రత్యేకంగా పీఎఫ్ విభాగం ఉన్నా ప్రయోజనం లేదని కొందరు ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. మరోవైపు కొందరు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నా సరిగ్గా స్పందించడంలేదు. ఏదొక కొర్రీ వేసి వెనక్కి పంపుతున్నటు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పీఎఫ్ విభాగాన్ని సంస్కరించాలని పలువురు కోరుతున్నారు.

**ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో సేవలు మెరుగుపరుస్తాం**

వెంకటసుబ్బయ్య, జడ్పీ ఉప సీఈఓ

ప్రస్తుతం పీఎఫ్ తాజా సమాచారాన్ని ఉద్యోగులకు అందించాలంటే సాఫ్ట్‌వేర్ అవసరం. త్వరలో కొనుగోలు చేయడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తర్వాత ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేస్తాం. ప్రస్తుతానికి ఇతర జిల్లాల్లో మాదిరిగా అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

# మన్యం వద్దు.. మైదానమే ముద్దు



పాడేరు: పూర్తిగా గిరిజన ప్రాంతమైన అల్లూరి సీతారామ రాజు జిల్లాలో పని చేసేందుకు ఎక్కువ మంది ఉపాధ్యాయులు మొగ్గు చూపడం లేదు. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉండగా.. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలతో ఈ సమస్య మరింత ఎక్కువైంది. ప్రస్తుతం మన్యంవ్యాప్తంగా చాలా పాఠశాలలకు పూర్తిస్థాయి ఉపాధ్యాయులు లేకపోవడంతో డీఎస్సీ-1998, ఎంటీఎస్ సిబ్బందితో సర్దుబాటు చేయాల్సి వచ్చింది. రాష్ట్రప్రభుత్వ నిబంధనలు, ఆదేశాల మేరకు ఇటీవల విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి చేసింది. అలా ఉమ్మడి విశాఖపట్నం జిల్లావ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులకు స్థానచలనం కల్పించింది. ఈ బదిలీలతో ఉపాధ్యాయుల కొరత ఉండదని భావించిన అధికారులకు కొత్త చిక్కులు ఏర్పడ్డాయి. విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని భావించి కసరత్తు ప్రారంభించినా.. క్షేత్రస్థాయిలో విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన నం. 117 జీఓ రద్దుచేయడంతో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల (ఎస్‌జీటీ) బదిలీలకు అవకాశం ఏర్పడింది. దీంతో చాలామంది ఉపాధ్యాయులు విశాఖ, అనకాపల్లి జిల్లాలకు వెళ్లేందుకు మొగ్గుచూపారు. ఫలితంగా అల్లూరి జిల్లావ్యాప్తంగా 640 పైగా పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిలో 530 వరకు డీఎస్సీ-1998, ఎంటీఎస్ సిబ్బందితో సర్దుబాట్లు చేశారు. **వారినే ఏజెన్సీకి కేటాయించి..** అల్లూరి సీతారామరాజు జిల్లాలో వెయ్యిమంది వరకు ఉన్న ఖాళీల్లో ఎంటీఎస్, డీఎస్సీ-1998 ఉపాధ్యాయులను భర్తీ చేశారు. నిబంధనల ప్రకారం వారు.. తమ సబ్జెక్టులను మాత్రమే చెప్పాలి. ఎటువంటి అదనపు బాధ్యతలు అప్పగించకూడదు. కానీ.. విశాఖపట్నం, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నంలో పనిచేస్తున్న వారిని ఏజెన్సీ ప్రాంతాలకు బలవంతంగా కేటాయించారు. దీంతోపాటు ఏకోపాధ్యాయ పాఠజశాలల్లో ప్రధానోపాధ్యాయుడి బాధ్యతలు అప్పగించారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్న తమను బలవంతంగా బదిలీ చేయడం దారుణమని ఎంటీఎస్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడకుండా ఉండేందుకు ఖాళీల్లో వీరిని కేటాయించి బాధ్యతలు అప్పగించాల్సి వచ్చిందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

**డీఎస్సీ నియామకాలతోనే మిగిలిన ఖాళీల భర్తీ**

జిల్లాలో 80 శాతానికి పైగా ఖాళీల్లో సర్దుబాట్లు చేసినా.. ఇంకా 20 శాతానికి పైగా ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. గూడెంకొత్తవీధి, అనంతగిరి, అరకులోయ, చింతపల్లి, డుంబ్రిగుడ, రంపచోడవరం, మారేడుమిల్లి, చింతూరు, కూనవరం తదితర ప్రాంతాల్లో 110 ఖాళీలు ఉన్నాయి. వీటిని నింపేందుకు విద్యాశాఖ డీఎస్సీపైనే ఆశలు పెట్టుకుంది. ఇదంతా జరిగేందుకు కనీసం నాలుగు నెలలకు పైగా పట్టడం ఖాయం.

ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావుతో మాట్లాడగా.. డీఎస్సీ భర్తీలోగా బోధనకు ఇబ్బందులు కలగకుండా సమీప పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో సర్దుబాటు చేయనున్నామని తెలిపారు.

# మన పరిశ్రమలు భద్రమేనా!

అనకాపల్లి : తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పాశమైలారం రసాయన పరిశ్రమలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదం పారిశ్రామిక భద్రతపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తు చేస్తోంది. అనకాపల్లి జిల్లాలో చిన్నాపెద్దా కలిపి మొత్తం 150 పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో అధికశాతం మందుల తయారీ కంపెనీలే. ఇందులో తరచూ విష వాయువుల లీకేజీ, అగ్ని ప్రమాదాలు జరగడంతో కార్మికులు, పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా మండేగుణం కలిగిన ప్రమాదకరమైన రసాయనాలున్న పరిశ్రమలున్న చోట్ల భద్రతా ప్రమాణాలు సరిగా అమలు కాకపోవడంతో కార్మికులు దినదినగండంగా విధులు నిర్వహించాల్సి వస్తోంది.

**నిర్వహణ లోపాలే కారణం:** పరిశ్రమల్లో నిర్వహణ లోపాలే పలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రతి సంస్థలోనూ పలు రియాక్టర్లను వినియోగిస్తుంటారు. వాటిలో రసాయన చర్యల కారణంగా కొన్నిసార్లు నిర్ణీతస్థాయికి మించి ఉష్ణోగ్రతలు, పీడనాలు పెరుగుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో విడుదలయ్యే వాయువులు సేఫ్టీ వాల్వ్, రప్చర్ వాల్వ్‌ల ద్వారా డంప్ ట్యాంకుల్లోకి వెళ్లేలా ఏర్పాట్లు ఉంటాయి. అవి సరిగా పని చేస్తున్నాయా? లేదా? అన్న విషయాన్ని సంస్థలోని ఉద్యోగులు తనిఖీలు చేస్తూ ఉండాలి. నిబంధనల ప్రకారం.. ఆరు నెలలకోసారి గుర్తింపు పొందిన సంస్థతో తనిఖీలు చేయించుకుని ధ్రువపత్రాలు తీసుకోవాలి. అత్యంత కీలకమైన ఆయా పరీక్షలనూ కూడా కొన్ని యాజమాన్యాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. గతనెల 11న ఎస్ఎస్ ఫార్మాలో విషవాయువులు పీల్చి ఇద్దరు మృతి చెందారు. దీనిపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించి.. సుమోటోగా కేసు విచారిస్తున్నట్లు వెల్లడించింది.



ప్రమాదాలకు ఇవే కారణాలు .. కాలంచెల్లిన రియాక్టర్లు, యంత్రాలకు దగ్గరగా వెల్డింగ్, షోల్డరింగ్ చేయడం, యంత్రాలు, వాల్వులపై పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బందికి భద్రతా పరికరాలు ఇవ్వకపోవడం, నైపుణ్యం లేని శ్రామికులతో పని చేయించడం, భద్రతా తనిఖీలు సరిగా జరగకపోవడం, పలు రసాయనాలు దగ్గరగా నిల్వ చేయడం ఈ ఏడాది ఆరునెలల కాలంలో జిల్లాలో 11 ప్రమాదాలు జరిగాయి. ఇందులో 8 మందికి గాయాలయ్యాయి. ఐదుగురు మృతిచెందారు. పరవాడ ఫార్మాసిటీలో 2024లో విషవాయువుల లీకేజీ, అగ్ని తదితర 10 ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో 10మంది కార్మికులు మృతిచెందగా... 40 మంది ఆసుపత్రిపాలయ్యారు.

జిల్లాలో పరిశ్రమలు: 130

పనిచేస్తున్న కార్మికులు: 40వేలకు పైగా

## అన్నదాతకు ఊరట..!

నిడదవోలు: గతేడాది జులైలో కురిసిన భారీ వర్షాలకు నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో ఎర్రకాలువ ఉప్పొంగి రైతులకు తీవ్ర నష్టం ఏర్పడింది. నిడదవోలు, ఉండ్రాజవరం, నల్లజర్ల, దేవరపల్లి, తాడేపల్లిగూడెం మండలాల్లో 3,071.41 హెక్టార్లలో 4,631 మంది రైతులకు చెందిన వరి, ఉద్యాన, చెరకు తదితర పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయి. పూర్తిగా వరిపంట నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం నష్టపరిహారం అందించేందుకు రూ.5.22 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేసింది. ః వరద ప్రభావంతో సింగవరంలో 575 హెక్టార్లు, నిడదవోలులో 359, శంకరాపురంలో 145, శెట్టిపేటలో 396 ఎకరాల్లో వరి పంటకు నష్టం ఏర్పడింది. ఉండ్రాజవరం మండలంలో కాల్దారి, సూర్యారావుపాలెం, పసలపూడి, దేవరపల్లి



మండలంలో త్యాజంపూడి, నల్లజర్ల మండలంలో గుండేపల్లి, తెలికిచర్ల, అనంతపల్లి, నబీపేట, చోడవరం, పోతవరం గ్రామాల్లోనూ పంటలు దెబ్బతిన్నాయి.

**త్వరలో ఆధునికీకరణ పనులు..**

నిడదవోలు నియోజకవర్గంలో 4,631 మంది రైతులకు రూ.5.22 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నాం. వరదల సమయంలో దెబ్బతిన్న పంటలను స్వయంగా పరిశీలించి, రైతులు ఆర్థికంగా నష్టపోయిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా. కూటమి ప్రభుత్వం స్పందించి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసింది. వరదల నియంత్రణకు త్వరలో ఎర్రకాలువ ఆధునికీకరణ పనులు చేపడతాం.

కందుల దుర్గేష్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి

## బాటకోసం పంచాయితీ

పి.గన్నవరం: ఓ వైపు అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని ర్యాంపుల నుంచి టిప్పర్లు వచ్చే దారిలేక తవ్వకాలు ఆగిపోయాయి. మరో పక్షం రోజుల్లో వరదనీరు చేరుతుంది. దీంతో బాటలు కొట్టుకుపోతాయి. అయినప్పటికీ కనీసం పది రోజులైనా సహజ వనరులను తరలించాలని హైదరాబాద్‌కు చెందిన కొందరు ఇక్కడ ప్రయత్నాలు చేస్తుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం ఆనగార్లంక వైపు గోదావరి నదీ తీరంలో నాణ్యమైన



ఇసుకతో పాటు బొండుఇసుక ఉంది. ఇక్కడి వనరులు టిప్పర్లలో బయటకు రావాలంటే పి.గన్నవరం మండలం వై.వి.పాలెం వద్ద వంతెన ఏకైక మార్గం. ఇందుకోసం అక్కడ కొత్తగా బాటలు ఏర్పాటు చేస్తున్నారని కొందరు చెబుతున్నారు. ఇప్పటికే ఒకవ్యక్తి వై.వి.పాలెం ఏటిగట్టు దిగువున బాటవేసి పి.గన్నవరం మండల పరిధిలోని వనరులను గత మూడు నెలలుగా బయటకు తరలించారు. ఈయన ఆనగార్లంక వైపు నుంచి టిప్పర్లు రావడానికి కొత్తగా వేసిన బాటకు అడ్డుగా పొక్లెయిన్ పెట్టినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో దీనిపై పంచాయితీ జరిగింది. ప్రముఖ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడి వద్ద పి.ఎ.గా పనిచేస్తున్నానంటూ సదరు వ్యక్తి పరిచయం చేసుకుని కనీసం పది రోజులైనా టిప్పర్లు రాకపోకలు సాగించేలా సహకరించాలని బతిమాలినట్టు తెలిసింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, టిప్పర్లు ఎలా రాకపోకలు సాగిస్తాయని, ఈ సీజన్‌కు ఇక వీలుపడదని కొందరు ఆయనకు హితబోధ చేసినట్టు తెలిసింది.

**నాయకుడి అభ్యంతరం**ఆనగార్లంక వైపు నుంచి వై.వి.పాలెం ఏటిగట్టు మీదుగా టిప్పర్లు బయటకు రావడానికి వీలులేదని ఓ నేత స్పష్టం చేసినట్టు తెలిసింది. ఇప్పటికే మండలంలో కొనసాగిన అక్రమ తవ్వకాలపై పత్రికల్లో కథనాలు రావడంతో తనకు ఇబ్బందిగా ఉందని ఆయన భావిస్తున్నట్టు సమాచారం.

## రోజురోజుకూ పతనం

కలిదిండి : ఆక్వా సాగు ఒడుదొడుకులు రూప్‌చంద్ చేపలకూ తప్పలేదు. 20 రోజుల కిందటి వరకు కిలో రూ.120-130 ఉన్న ధర ఇప్పుడు రూ.100కి పడిపోయింది. ధర పెరిగే వరకు సరకు నిలుపుదామనుకుంటే వాతావరణం చల్లబడిపోవడంతో ఆకస్మికంగా పట్టుబడులు చేయాల్సి వస్తోందని సాగుదారులు గగ్గోలు పెడుతున్నారు. కోరుకొల్లుకు చెందిన ఓ రైతు 15 ఎకరాల్లో రొయ్యల సాగు చేశారు. వాతావరణం, వ్యాధులు, ధరల పతనం తట్టుకోలేక రూప్‌చంద్ చేపల పెంపకంపై దృష్టి సారించారు. వ్యాధుల బారి నుంచి బయటపడినా.. వాతావరణం, ధరల పతనం నుంచి తప్పించుకోలేకపోతున్నారు. కిలో ధర రూ.20 తగ్గిపోయిందని తెలిసినా.. ప్రాణవాయువు లోపంతో ఆకస్మికంగా పట్టుబడి చేయాల్సి వచ్చింది. దీంతో ఈయన ఎకరానికి సుమారు రూ. 60 వేల వరకు




నష్టపోయారు. ఉమ్మడి జిల్లాలో రూప్‌చంద్ చేపల పెంపకం కొంతకాలంగా క్రమంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం 10-15 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. తెల్ల చేపతో పోలిస్తే దీనికి వ్యాధుల బెడద తక్కువగా ఉంటుంది. దీంతో రైతులు దీనిపై ఆసక్తి చూపిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఈ సాగు ఇప్పటికే గణనీయంగా విస్తరించగా, ఏలూరు జిల్లాలోనూ ఇటీవల వేగం పుంజుకుంటుంది. రూ.20 ధమాల్.. తెల్ల చేప, రొయ్యల ధరల పతనం రూప్‌చంద్‌కూ తప్పలేదు. కిలో ధర 150కి పైన ఉంటే రైతులు లాభపడతారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. జూన్ నెల 10 వరకు గరిష్ఠంగా కిలో రూ.120 నుంచి రూ.130 వరకు ధర పలికింది. నష్టపోకుండా ఖర్చులైనా వస్తాయని రైతులు భావించారు. కానీ రెండ్రోజుల నుంచి కిలో రూ.100కే కొనుగోలు చేస్తుండటంతో నష్టాల బారిన పడుతున్నారు.

# ఎంఎస్ఎంఈల వ్యథ.. 'చిన్న' కథకాదు..!

అక్కిరెడ్డిపాలెం : చిన్న పరిశ్రమలే కాని.. ఆర్థిక రంగం వృద్ధికి అవే కీలకం. మారిన పరిణామాలతో గత కొన్నేళ్లుగా డీలా పడ్డాయి. గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటూ చేయూత కోసం ఎదురుచూస్తున్నాయి. విశాఖ ఆటోనగర్ అంటే గుర్తొకొచ్చేవి ఎంఎస్ఎంఈలే. ప్రారంభంలో సుమారు 1140 పరిశ్రమలకు అనుమతి ఇచ్చారు. 3200 వరకు 'ఉద్యమ్'లో రిజిస్ట్రేషన్ అయ్యాయి. వీటిలో 90శాతం సూక్ష్మ, 7శాతం చిన్న, 3శాతం మధ్య తరహా పరిశ్రమలే.

**2004 వరకు ఆటోనగర్ కళకళ:** విశాఖలో పబ్లిక్ సెక్టార్ యూనిట్లు(పీఎస్‌యూ)లు అధికంగా ఉండటంతో వాటికి అవసరమైన విడి పరికరాలను ఇవి తయారు చేసి అందించేవి. ముఖ్యంగా ఫ్యాబ్రికేషన్, ఆటోమొబైల్, స్టీల్, ప్లాస్టిక్ పరిశ్రమలు ఎక్కువగా ఏర్పాటయ్యాయి. 2004 వరకు పరిశ్రమల ఉత్పత్తి, లావాదేవీలతో ఆటోనగర్ కళకళలాడేది. 2004లో వచ్చిన వాల్యూ యాడెడ్ ట్యాక్స్(వ్యాట్) వీటిని బలహీన పర్చింది. పరిశ్రమల్లో వాణిజ్యపన్నుల శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి రూ.6500 కోట్లు కట్టాలని నోటీసులు జారీ చేశారు. దీంతో దాదాపు 2వేల పరిశ్రమల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. బకాయిలు చెల్లించలేక దాదాపు 90శాతం పరిశ్రమలు మూతపడ్డాయి. ప్రస్తుతం 1200 పరిశ్రమలు దినదినగండంగా మనుగడ సాగిస్తున్నాయి.

కొవిడ్ తరువాత నాణ్యమైన కార్మికులు లేక ఉత్పత్తి కుంటు పడింది. మరోవైపు ముడిసరుకుల ధరలు, విద్యుత్తు ఛార్జీలు పెరుగుదల వాటిని మరింత దెబ్బతీసింది. ప్రభుత్వం చొరవ తీసుకుని ఆయా సమస్యలు పరిష్కారం చూపితే ఎంఎస్ఎంఈలకు పూర్వ వైభవం వస్తుందని పారిశ్రామికవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళలు, కొత్తగా పరిశ్రమలు పెట్టేవారికి రాయితీలు, సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

**జరిమానాలు, విద్యుత్తు ఛార్జీల భారం**

రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 4.0 విధానం తెచ్చింది. 2004లో విధించిన జరిమానాల్లో కొంత రాయితీ ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం రావడంతోపాటు మళ్లీ పరిశ్రమలు తెరుచుకునే అవకాశం ఉంది. నైపుణ్యం గల మానవ వనరుల కోసం శిక్షణ కేంద్రాలు నెలకొల్పాలి. మిగతా రాష్ట్రాలతో సమానంగా లేదా తక్కువగా విద్యుత్తు ఛార్జీలు ఉంటే పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చే అవకాశం ఉంది. ప్రాపర్టీ ట్యాక్స్‌లో రాయితీ, 15కేవీ విద్యుత్తు వాడకం దాటిన వారికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి.
పాండురంగ ప్రసాద్, వాసీ అధ్యక్షులు

**ధరలు పెరిగి ఆర్డర్లు కోల్పోతున్నాం..**

విద్యుత్తు, ముడి సరుకుల ధరలు మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ అధికంగా ఉన్నాయి. ప్రభుత్వం తెచ్చిన 'జెమ్' పోర్టల్ ద్వారా అన్ని రాష్ట్రాల నుంచి ఉత్పత్తులు ఎగుమతులు అవుతున్నాయి. మన కంటే ఇతర రాష్ట్రాల పరిశ్రమల నిర్వాహకులు తక్కువ ధరకు కోట్ చేస్తుండడంతో ఆర్డర్లు కోల్పోతున్నాం. ఆటోనగర్‌పై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది వరకు జీవనోపాధి పొందుతున్నారు. ప్రభుత్వం చొరవ చూపి సమస్యల పరిష్కారానికి ముందుకొస్తే సూది నుంచి ఇస్రోకు అవసరమైన విడి పరికరాల వరకు తయారు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. సర్వసిద్ధి సత్య, జాతీయ ఎంఎస్ఎంఈ మాజీ సభ్యులు

# కోనేరు గట్లపై ఆక్రమణల పుట్టలు

చోడవరం : చోడవరం పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు దశాబ్దాల కిందట తవ్వించిన కోనేరులను పేదల ముసుగులో పెద్దలు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణ పరిధిలో నాలుగు కోనేరులు ఉన్నాయి. వీటి గట్లు, గర్భాలను ఆవాస ప్రాంతాలుగా మార్చేయడంతో రూపురేఖలు కోల్పోయాయి. భూగర్భ జలాలు అడుగంటి వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తుతున్నా.. కోనేరులకు రక్షణ కల్పించడంపై పాలకులు దృష్టిసారించడం లేదు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని ఎనిమిది మండలాల్లో ఏ గ్రామానికి వెళ్లినా చెరువులు కనిపిస్తాయి. వాటిలోని నీటినే స్థానికులు వినియోగించేవారు. చెరువుల అభివృద్ధిని పాలకులు విస్మరించడం, చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారంతా వ్యర్థాలను పడేస్తుండటంతో కాలుష్య



కాసారాలుగా మారాయి. చోడవరం పట్టణంలో బానెయ్య కోనేరు, ఎర్ర కోనేరు, కోమటి కోనేరు, తామర కోనేరులున్నాయి. రక్షిత తాగునీటి పథకాలు లేని రోజుల్లో ఈ నీటినే స్థానికులు వాడే వారు. 1980 వరకు తాగునీటి అవసరాలు తీర్చాయి. ప్రస్తుతం గట్లు ఆక్రమణలకు గురై తాత్కాలిక నివాసాలతోపాటు పక్కా భవనాలు నిర్మితమయ్యాయి. నాలుగు కోనేరులు ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉండగా.. 78 శాతం ఆక్రమణకు గురయ్యాయి. ఈ ప్రాంతాలను ఓటు కేంద్రాలుగా భావించిన ప్రజాప్రతినిధులు ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టడం లేదు. అధికారులు అడపాదడపా నోటీసులు ఇస్తున్నా.. రాజకీయ జోక్యంతో వెనకడుగు వేస్తున్నారు.

**తామర చెరువు:** తామర చెరువుగా పేరున్న ఈ ప్రాంతంలో చిన్నపాటి కోనేరు ఉంది. గట్టు పూర్తిగా అక్రమ కట్టడాలతో నిండిపోయింది. మచ్చుకైనా చెరువు కనిపించదు. పాలకేంద్రం, సామాజిక భవనాలను నిర్మించారు. చెరువును అనుకుని ఉన్న పెద్ద మురుగు కాలువను అక్రమణదారులు కబ్జా చేశారు.

**కోమటి చెరువు:** అన్నవరం దరి ఉన్న కోమటి చెరువు చుట్టూ ఆక్రమణలు పెద్దగా లేకున్నా.. ఏళ్ల తరబడి నీటిని వాడకపోవడంతో నాచు పట్టి పచ్చగా కనిపిస్తోంది. గట్టుపై ఆలయంతోపాటు ఏడు ఇళ్లను నిర్మించారు.

**ఎర్ర కోనేరు:** యడ్లవీధి ప్రజల దాహార్తిని తీర్చే ఎర్ర కోనేరుకు గతంలో కాపాలాదారు ఉండేవారు. 1981లో తాగునీటి పథకం నిర్మాణంతో కోనేరు నీటిని వాడటం మానేశారు. అప్పట్నుంచి గట్టు అక్రమణలకు గురవుతూ వచ్చింది. పక్కా భవనాలతోపాటు ఆలయాన్ని నిర్మించారు. ఇళ్లలోని వాడుక నీరంతా కోనేరులోకి చేరుతుండటంతో పరిసరాలన్నీ దుర్వాసనతో నిండాయి. **బానయ్య కోనేరు:** పట్టణ నడిబొడ్డున బీఎన్ రహదారిని ఆనుకుని ఉంది. సర్వే నంబర్ 43లో 5.149 ఎకరాల్లో ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉంది. ప్రస్తుతం కోనేరు విస్తీర్ణం 57 సెంట్లకు పడిపోయింది. మధ్యలో బావి ఉండేది. దీన్ని చుట్టూ ప్రస్తుతం 67 మంది నివాసం ఉంటున్నారు. రహదారి పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి కొందరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. మూడు సామాజిక భవనాలను నిర్మించారు.

# పేరుకే సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల




అనంతపురం : ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ప్రభుత్వ వైద్య కళాశాల అధికారుల మధ్య సరైన సమన్వయం కొరవడింది. ఫలితంగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించలేని దయనీయ పరిస్థితి నెలకొంది. రాష్ట్రస్థాయి క్యాడర్‌లో ఉన్న ఒక డీఎంఈ అనంతపురంలోని సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలను పరిశీలించి పలు ఆదేశాలు జారీ చేసినా వాటిని అమలు చేయటంలో సంబంధిత అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వైద్యసేవల్లో లోటు కనిపిస్తోంది.

ఈఏడాది ఫిబ్రవరి 23న, మే 20న డైరెక్టర్ ఆఫ్‌మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) నరసింహం అనంతపురంలోని సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలను పరిశీలించారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ (అత్యవసర విభాగం)ని ఏర్పాటు చేసి ప్రారంభించాలని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనిడిక్టాలను ఆదేశించారు. రెండో సారి వచ్చినప్పుడు ఎందుకు క్యాజువాలిటీని ప్రారంభించలేదని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వారంలోపు క్యాజువాలిటీ ఏర్పాటు చేయాలని, లేకపోతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీటీవీఎస్(హార్ట్‌బైపాస్‌సర్జరీ) విభాగానికి సంబంధించి హార్ట్‌లంగ్ మిషన్ అందుబాటులో లేకపోవటంతో శస్త్రచికిత్సలు చేయటం లేదని డీఎంఈ గుర్తించారు. విజయవాడ ఆసుపత్రిలో రెండు హార్ట్‌లంగ్ మిషిన్‌లున్నాయని, మీరు తనకు నివేదిస్తే వెంటనే ఒక యంత్రాన్ని బదలాయింపు చేస్తామని చెప్పారు. ఆయన ఆదేశాలను ఇక్కడి అధికారులు అమలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. క్యాజువాలిటీ ఏర్పాటు చేయాలంటే రూ.16 లక్షలు అవసరం ఉంటుందని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీనివాసులునాయుడు అంచనాలు తయారు చేసి అధికారులకు నివేదించారు. ఆ నిధులను ప్రభుత్వ వైద్యకళాశాల నుంచి కేటాయించాలని డీఎంఈ సూచించారు.

**ఒనగూరే ప్రయోజనాలు**

అత్యవసర విభాగం (క్యాజువాల్టీ) ఏర్పాటు చేస్తే ఉమ్మడి జిల్లాలోని ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. ఆసుపత్రిలో కార్డియాలజీ, న్యూరోసర్జరీ, న్యూరాలజీ, యూరాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, నెఫ్రాలజీ, పీడీయాట్రిక్ శస్త్రచికిత్సల విభాగం వంటి కీలకమైనవి అందుబాటులో ఉన్నాయి. క్యాజువాల్టీ లేకపోవటంతో బాధితులను సర్వజన వైద్యశాలకు తరలించి అక్కడ వైద్యులు పరిశీలించి చికిత్సలు అందిస్తున్నారు. వైద్యుల సూచన మేరకు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలకు తరలించి సేవలు అందిస్తున్నారు. ఇక్కడే క్యాజువాల్టీ ఉంటే అన్ని రకాల సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది.

**డీఎంఈకి నివేదించాం: వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల** సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో క్యాజువాల్టీ ఏర్పాటు చేయాలని డీఎంఈ ఆదేశించిన మాట వాస్తవమే. నిధులను వైద్యకళాశాల నుంచి కేటాయించాలని ఆదేశించారు. తాము ఏపీఎంఎస్ఐడీసీ అధికారుల అందజేసిన అంచనా ప్రతులతో పాటు నిధులు విడుదల చేయాలని ప్రిన్సిపల్‌కు లేఖ రాశాం. డీఎంఈ నుంచి వారికి ఉత్తర్వులు రాలేదని, అందుకే నిధులు విడుదల చేయటం లేదని చెప్పారు. ఈవిషయాన్ని డీఎంఈకి నివేదించాం. త్వరలోనే క్యాజువాల్టీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

# అడ్డగోలు నిర్ణయాలు.. పరిశోధనలకు అవరోధాలు



విశాఖపట్నం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పరిశోధన అభివృద్ధి విభాగంలో నిర్ణయాలు ఇష్టారాజ్యంగా తీసుకుంటున్నారు. ఫలితంగా పరిశోధనలకు తూట్లు పొడుస్తున్నారు. నిబంధనలు ఉన్నఫళంగా మార్చేస్తున్నారు. ఆర్‌ఏసీ సమావేశంలో కొందరు సభ్యులు వ్యతిరేకించినా, మిలిగిన వారు ఒక వర్గంగా ఏర్పడి మెజార్టీ సభ్యుల ముసుగులో తమకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వేల రూపాయల ఫీజు చెల్లించిన పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ చేయడానికి అవకాశాలు కల్పించడం లేదు. కొందరు పరిశోధక పర్యవేక్షకులు కాసులకు కక్కుర్తి పడి అడ్డదారులు వెతుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పీహెచ్‌డీ అభ్యర్థుల నుంచి కొందరు రూ.లక్షలు తీసుకొని పరిశోధనకు సహకరిస్తున్నారని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ చేయడానికి డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో జంతుశాస్త్ర విభాగంలోని పీహెచ్‌డీ అభ్యర్థికి ఏదైనా డిగ్రీ కళాశాలల్లోని అదే విభాగానికి చెందిన అధ్యాపకులను పర్యవేక్షకునిగా నియమించవచ్చు. కానీ వర్సిటీలోనే మరో సైన్స్ విభాగంలో పరిశోధనలు నిర్వహించాలని నిర్ణయించడం దారుణం. ఎంఫిల్ నుంచి పీహెచ్‌డీ కన్వర్షన్ కోసం నెల రోజుల్లో అనుమతికి లేఖ ఇవ్వాలి. తమకు అనుకూలమైన వారు ఆలస్యంగా లేఖ ఇచ్చినా అనుమతించినట్లు తెలుస్తోంది. ఇలాంటి అడ్డగోలు వ్యవహారాలు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో ఎన్నో జరుగుతున్నాయని విశ్వసనీయ సమాచారం.

'లైబ్రరీసైన్స్ విభాగానికి చెందిన ఓ పరిశోధక విద్యార్థిని 2019లో ఎంఫిల్ పూర్తి చేసింది. నెల రోజుల్లో పీహెచ్‌డీ కోసం కన్వర్షన్ లేఖ సమర్పించాలి. ఆమె వ్యక్తిగత కారణాలతో లేఖను ఆలస్యంగా సమర్పించింది. కానీ మరో ఎంఫిల్ అభ్యర్థి 2014లో పూర్తి చేశాడు. ఆయనకు పీహెచ్‌డీ చేయడానికి అనుమతించారు. తమకు అనుకూలమైన వారికి పరిశోధనలకు అనుమతి ఇస్తున్నారని సంబంధిత అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.'

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగంలో ఓ ఆచార్యులు పదవి విరమణ చేశారు. ఆయన పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థులున్నారు. పదవి విరమణ, ఇతర వ్యక్తిగత కారణాల వల్ల ఓ విద్యార్థికి పరిశోధన అంశాలపై పర్యవేక్షణ నిర్వహించలేదని సదరు ఆచార్యులు లేఖ ఇచ్చారు. దీంతో ఆ విద్యార్థి తన పరిశోధనకు ఆచార్యున్ని లేదా అధ్యాపకున్ని కేటాయించాలని అధికారులకు విన్నవించాడు. ఆ లేఖపై ఆర్‌ఏసీ బృందం చర్చించింది. జంతుశాస్త్ర విభాగంలోని పరిశోధక విద్యార్థికి సంబంధిత విభాగానికి చెందిన అధ్యాపకున్ని కాకుండా బయోకెమిస్ట్రీ విభాగానికి మార్చారు. ఇలా చేయడం ఎంతవరకూ సమంజసమని వర్సిటీలో విమర్శలు వెలువెత్తాయి.

**నిబంధనల ప్రకారం నిర్ణయాలు: ఆచార్య శోభాలత, పరిశోధన, అభివృద్ధి విభాగం, ఎస్కేయూ** ఎంఫిల్ పూర్తి చేసిన వారు నెలరోజుల్లో పీహెచ్‌డీ కన్వర్షన్ కోసం లేఖ సమర్పించాలి. నిర్ణీత గడువులోపు సమర్పించకపోతే తిరస్కరించి ఉంటాం. జంతుశాస్త్ర విభాగంలోని పీహెచ్‌డీ అభ్యర్థి గైడ్ కేటాయింపు ఆర్‌ఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకొన్నారు. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటున్నాం.

# పర్యాటకశాఖ కుంభకర్ణుడి నిద్ర



పెనుకొండ : అత్యంత వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చారిత్రక నగరం పెనుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో 2002లో రూ.35 లక్షల వ్యయంతో కుంభకర్ణ ప్రాజెక్టు నిర్మించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో విగ్రహం కాలక్రమేణా శిథిలావస్థకు చేరింది. ప్రాజెక్టు నిర్వహణ పర్యాటకశాఖకు భారంగా మారడంతో పదేళ్ల కిందట అద్దెకిచ్చి చేతులు దులుపుకొన్నారు. అద్దెకు తీసుకున్న వారు లాభాపేక్షతో నిర్వహణ గాలికొదిలేయడంతో విగ్రహం నెర్రలు చీలి పోయింది. అనేక విగ్రహాలు శిథిలమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు వస్తున్నా ఈ ప్రాజెక్టు వద్ద రాత్రిళ్లు మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. హొటల్ నిర్వాహకులు సైతం మద్యం తాగించేందుకు అనుమతించడం పట్ల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న పర్యాటక కేంద్రం పట్ల అధికారులు చొరవ చూపాల్సి ఉంది.

**20 ఏళ్లుగా రంగులు వేయించలేదు**

పడుకున్న కుంభకర్ణుడి విగ్రహం, చుట్టూ నిద్ర లేపుతున్న భటుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. 20 ఏళ్లలో కనీసం రంగులు కూడా మార్చకపోవడం శోచనీయం. ప్రాజెక్టులో నిర్మించిన ట్యాంకు చుట్టూ ఆకట్టుకునే విధంగా భారీ కూజా ఆకారంలో నిర్మించారు. అది కూడా శిథిలమైంది.

**పరిశీలించి చర్యలు చేపడతాం: నరసయ్య, పీడీ, డ్వామా, పర్యాటకశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి**

కుంభకర్ణ ప్రాజెక్టు అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరవ్వగానే పనులు ప్రారంభిస్తాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తాం.

# అటవీ ఉత్పత్తులకు అందలం

చింతపల్లి : అటవీ ఉత్పత్తులకు అల్లూరి జిల్లా పెట్టింది పేరు. ప్రకృతి వైపరీత్యాలతో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నా గిరిజనులంతా ప్రత్యామ్నాయంగా అటవీ ఉత్పత్తులపైనే అధిక శాతం ఆధారపడే వారు. కాలానుగుణంగా అడవుల్లో సహజసిద్ధంగా లభించే చింతపండు, శీకాయ, అడవి తేనె, కరక్కాయలు, నల్లజీడి పిక్కలు, నరమామిడిచెక్క, కోవెల జిగురు, ఉసిరికాయలు ఇలా.. సుమారు 30 రకాల వరకు అటవీ ఉత్పత్తులను గిరిజనులు సేకరించి జీసీసీకి, వ్యాపారులకు విక్రయించేవారు. కొన్నేళ్లుగా ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు గిరిజనులెవరూ అటవీ ఉత్పత్తులపై ఆధారపడటం లేదు. వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుతోపాటు ఉపాధి పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఫలితంగా అటవీ ఉత్పత్తుల సేకరణ తగ్గింది. ఈ పరిస్థితిని నివారించి అటవీ ఉత్పత్తుల సేకరణ, లక్ష్యాలను పెంచాలని జీసీసీ ఎండీ కల్పనాకుమారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని రకాల అటవీ ఉత్పత్తులపై జీసీసీకి గుత్యాధిపత్యం ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఇటీవల ప్రకటించారు. ఇది అమలైతే గిరిజన సహకార సంస్థకు అటవీ ఉత్పత్తులపై పూర్తిస్థాయి అధికారాలు, హక్కులు సంక్రమిస్తాయి.

**తేనెలూరడం లేదు...** ఒకప్పుడు గిరిజన సహకార సంస్థ మొత్తం వ్యాపారంలో 30 శాతం వాటా తేనెపైనే ఆధారపడి ఉండేది. చిత్తూరు,



రాజమహేంద్రవరం కేంద్రాలుగా శుద్ధి చేసి వాటిని రిటైల్ మార్కెట్లో గిరిజన హనీ పేరుతో జీసీసీ విక్రయిస్తోంది. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో ఒకప్పుడు 500 నుంచి వెయ్యి టన్నుల వరకు తేనె దిగుబడులు వచ్చేవి. ఇప్పుడు 70 క్వింటాళ్లకు మించి రావడం లేదు.

**అడ్డాకులకు గడ్డుకాలం..**

అడ్డాకులకు మన్యంలో గడ్డుకాలం దాపురించింది. పోడు వ్యవసాయం వల్ల అడ్డాకుల దిగుబడి తగ్గింది. కొండ చీపుర్లకు చిరునామాగా గాలికొండ ఉండేది. ఇప్పటికీ గాలికొండ చీపుర్లకు గిరాకీ ఉంది. మొదట్లో ఈ చీపురు ధర రూ.5 నుంచి రూ.15 వరకు ఉండేది. కాలక్రమంలో కొరత ఏర్పడటంతో స్థానికంగానే ఒక్కో చీపురు ధర రూ.100 వరకు పలుకుతోంది. అంతరించిపోతున్న అటవీ ఉత్పత్తుల జాబితాలో నరమామిడి, కోవెల వనాలున్నాయి. జిగురు, చెక్క సేకరణ విధానాలు తెలియక ఈ వనాలు అంతరించిపోతున్నాయి.

**కాఫీ, మిరియాల సాగే అధికం**

అల్లూరి జిల్లాకు కాఫీ, మిరియాలు అతిథి పంటలుగా వచ్చాయి. మన్యంలో కాఫీ 2.25 లక్షల ఎకరాల్లో ప్రధాన పంటగా సాగవుతోంది. ఇందులో మిరియాలు 70 వేల ఎకరాల్లో అంతరపంటగా సాగవుతున్నాయి. వీటి సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతుండగా, అటవీ ఉత్పత్తులు క్రమేణా కనుమరుగవుతున్నాయి. అడవి తేనె, అడ్డాకులు, కోవెలజిగురు, కొండచీపుర్లు, ఉసిరికాయల జాడ కనిపించకుండా పోతోంది.

**లాభాల ఉ'సిరి'**

అడవుల్లో సహజసిద్ధంగా లభించే ఉసిరికాయలు ఒకప్పుడు నేలపాలయ్యేవి. వీటిని వ్యాపారులు మొదట్లో కేజీ రూ.5కు కొనుగోలు చేసి మైదాన ప్రాంతాల్లో విక్రయించే వారు. తదనంతర కాలంలో జీసీసీ ఎండిన ఉసిరి పప్పునకు అనూహ్యంగా ధర పెంచింది. కేజీ రూ.90 వరకు కొనుగోలు చేస్తోంది. మంచి ధర పలకడంతో ఉసిరికి డిమాండ్ పెరిగింది. ఎక్కువగా సేకరించాలన్న తాపత్రయంతో గిరిజనులు అడవుల్లో ఉసిరి చెట్ల కొమ్మలను నరికేయడంతో వీటి దిగుబడి క్రమేణా తగ్గిపోయింది.

**వృక్ష సంపదకు కాపాడాలి..** అంతరించిపోతున్న వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. కోవెల, నరమామిడి, ఉసిరి వనాలను అటవీ శాఖ ద్వారా నర్సరీలను అభివృద్ధి చేయాలి. జిగురు, తేనె, చెక్క సేకరణల్లో శాస్త్రీయ విధానాలపై గిరిజనులకు శిక్షణ ఇవ్వాలి. తేనె దిగుబడుల పెంపు దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలి. ఇందుకోసం పెట్టె తేనె అభివృద్ధిని ప్రోత్సహించాలి.
వెంకటేష్, జీసీసీ డివిజనల్ మేనేజరు

# నత్తకు నడక నేర్పేలా

అనకాపల్లి : లక్ష్మీదేవిపేటలో రైల్వే లైన్‌పై వంతెన నిర్మాణం అసంపూర్తిగా నిలిచి 15 ఏళ్లవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పనులు చేపట్టాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున వంతెన నిర్మాణానికి భూసేకరణ చేపట్టి పరిహారం అందించాల్సి ఉంది. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న కొణతాల రామకృష్ణ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అప్పట్లో రూ.12 కోట్లతో టెండర్లు పిలిచారు. 2014లో ఎంపీ హోదాలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు రైల్వే, ఆర్అండ్‌బీ అధికారులతో చర్చించి వంతెన నిర్మాణానికి రూట్ మ్యాప్ సిద్ధం చేయించారు. రైల్వే శాఖ తన పరిధిలో ఉన్న 150 మీటర్ల దూరం నిర్మాణ పనులకు సంబంధించి రూ.12 కోట్లు విడుదల చేసింది. రైల్వే పరిధిలో 90 శాతం పనులు



పూర్తయ్యాయి. వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి భీమునిగుమ్మం వరకు 2 కి.మీ. దూరం వంతెన నిర్మాణానికి నాటి ప్రభుత్వం రూ.53.8 కోట్లు మంజూరు చేసింది. 2018 డిసెంబరు 6న పైవంతెన నిర్మాణానికి మరోసారి శిలాఫలకం ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. 2019లో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. నాటి నుంచి ఇప్పటివరకు అతీగతి లేదు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న కొణతాల రామకృష్ణఎంపీ సీఎం రమేశ్ చొరవ చూపి వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

# చెరువును చెరబట్టారు!



అనంతపురం : ఆవు చేనులో మేస్తే దూడ గట్టున మేస్తుందనే సామెత ధర్మవరం వైకాపా నాయకులకు సరిగ్గా సరిపోతుంది. భూ కబ్జాలు, చెరువుల ఆక్రమణలో తమ నాయకుడు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి తామేం తక్కువ కాదని నిరూపిస్తున్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కేతిరెడ్డి ధర్మవరానికి అవతలివైపు ఉన్న ఎర్రగుట్టతో పాటు చెరువును ఆక్రమించి విలాసవంతమైన ఫాంహౌస్ నిర్మించుకున్న విషయం తెలిసిందే. ఆయన్ను ఆదర్శంగా తీసుకున్న స్థానిక వైకాపా నాయకులు కొందరు పట్టణానికి ఆనుకొని ఉన్న చెరువును చెరబట్టారు. భవన నిర్మాణ వ్యర్థాలతో కొద్దికొద్దిగా పూడ్చుకుంటూ ఆక్రమిస్తున్నారు. కొన్నిచోట్ల భూమిని ఇళ్ల స్థలాలుగా మార్చేసి అమ్మేయగా.. మరికొన్ని చోట్ల ఏకంగా వాణిజ్య భవనాలు, బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. కళ్ల ముందే చెరువు కబ్జాకు గురవుతున్నా జలవనరులశాఖ అధికారులు మొద్దునిద్ర నటిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

**అధికారం అండతో..**

గతంలో వైకాపాలో కీలకంగా వ్యవహరించిన ఓ కౌన్సిలర్ భర్త భాజపాలో చేరి మున్సిపాలిటీని తన గుప్పిట్లో పెట్టుకున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని చెరువును మరింత చెరబడుతున్నారు. గతంలో కబ్జా చేసిన భూముల్లో భవనాలు నిర్మించుకునేందుకు సహకరిస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులను అటువైపు వెళ్లకుండా చూసుకుంటున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. చెరువు ఆక్రమణలపై గతంలోనే జలవనరులశాఖకు ఫిర్యాదులు అందాయి. విచారణ జరిపి 16 ఎకరాలు కబ్జాకు గురైనట్లు తేల్చారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమైనా రాజకీయ ఒత్తిళ్లతో వెనక్కి తగ్గారు. చెరువు ఆక్రమణలపై ఇరిగేషన్ డీఈ మహేశ్వరరెడ్డి వివరణ కోరగా.. కబ్జాలపై ఫిర్యాదులు ఉన్నాయి. త్వరలోనే బాధ్యులందరికీ నోటీసులు జారీ చేస్తాం. రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఇళ్ల పట్టాలు చెల్లవని స్పష్టం చేశారు.

**ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయం**

ధర్మవరానికి ఆనుకొని 661 సర్వే నంబరులో 1922 ఎకరాల్లో చిక్కవడియార్ చెరువు విస్తరించి ఉంది. దీని కింద రైతులు 2 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. పట్టణానికి ఆనుకుని ఉండటంతో ముందునుంచీ ఆక్రమణకు గురవుతూ వస్తోంది. గడిచిన ఐదేళ్లలో సుమారు 20 ఎకరాలకుపైగా కబ్జా చేశారు. ముఖ్యంగా వైకాపా కౌన్సిలర్లు అప్పట్లో రెవెన్యూ అధికారులను అడ్డు పెట్టుకొని చెరువు భూమికి నకిలీ ఇళ్ల పట్టాలు సృష్టించారు. సెంటు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అమ్మేశారు. జలవనరులశాఖ అధికారులు నోటీసులు ఇస్తే వాటిని అడ్డుగా చూపి తప్పించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# 55 ఏళ్ల ప్రాజెక్టు ప్రశ్నార్థకం!

తిరుపతి : తిరుపతిలోని అఖిల భారత పందుల పరిశోధన స్థానం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వైకాపా పాలనలో పరిశోధనలపై జరిగిన నిర్లక్ష్యాన్ని గుర్తించిన ఐసీఏఆర్ ఏడాది కిందట నిధులు నిలిపివేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. అసలే ఆర్థికంగా కుదేలైన పశువైద్య వర్సిటీకి ఈ పరిశోధనా స్థానం నిర్వహణ అదనపు భారంగా పరిణమించింది. భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) దేశవ్యాప్తంగా పందుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు అఖిలభారత స్థాయిలో పరిశోధనా ప్రాజెక్టుల్ని 1970లో మంజూరు చేసింది. ఆ మేరకు 1971లో స్థానిక పశువైద్య కళాశాల ఆవరణలో పందుల పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించారు. యూకేకు చెందిన లార్జ్ వైట్ యార్క్‌షైర్ అనే తెల్లజాతి పందితో స్థానిక పందులను సంకరపరిచారు. ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో పోషణ, మేలుజాతి పందుల ఉత్పత్తి, దేశవాళీ జాతుల పరిరక్షణ వంటి అనేక అంశాల్లో ప్రగతి సాధించారు. తిరుపతి-17 జాతిని సైతం ఆవిష్కరించారు. ఏటా ఐసీఏఆర్ నుంచి రూ.30 లక్షల వరకు నిధులు అందడంతో పెద్ద నిర్వహణ, దాణా,



పరిశోధనలు, సిబ్బంది జీతభత్యాలకు ఎటువంటి ఢోకా ఉండేది కాదు. ప్రస్తుతం పరిశోధనా స్థానంలో 150 వరకు పందులు ఉండగా వాటికి అవసరమైన దాణా, సిబ్బంది జీతభత్యాలకు రూ.11 లక్షల వరకు విశ్వవిద్యాలయం భరిస్తోంది.

**ఏటా రూ.15 లక్షల వరకు ఆదాయం:** ఏటా 500 వరకు సంకరజాతి పిల్లల్ని ఔత్సాహిక రైతులకు విక్రయించేవారు. ఇలా కేంద్రానికి ఏటా రూ.15 లక్షల వరకు ఆదాయం వచ్చేది. వెయ్యిమంది వరకు ఔత్సాహికులకు పందుల పెంపకంలో శిక్షణ ఇచ్చేవారు. తిరుపతి, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టులు ఉండగా తిరుపతికి మాత్రమే నిధులు ఆపడం గమనార్హం. వైకాపా హయాంలో వర్సిటీ అధికారులు ప్రాజెక్టు ఫలితాలపై దృష్టి సారించకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైనట్లు ఆరోపణలున్నాయి. ప్రాజెక్టుల జాబితా నుంచి తిరుపతి పేరు ఇంకా తొలగించలేదని, త్వరలో నిధులు సాధిస్తామని పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త కళ్యాణ చక్రవర్తి తెలిపారు.

# 'ఐదేళ్లు'.. గుండెల్లో గుబులు!

విశాఖపట్నం : వైద్యుల బదిలీలకు సంబంధించి... ఐదేళ్లు ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న వారికి స్థానచలనం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేసింది. ఈనెల 17వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తవనుంది.

**ఏఎంసీ పరిధిలో... :** కొత్త నిబంధన ప్రకారం.. ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) పరిధిలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వైద్యులు 59 మంది వరకు ఉన్నట్టు లెక్క కట్టారు. వారిలో 15 మంది ప్రొఫెసర్లు, 9 మంది సహ ప్రొఫెసర్లు, 35 మంది సహాయ ప్రొఫెసర్లు ఉన్నారు. ఏఎంసీ పరిధిలో కేజీహెచ్‌తో సహా ఏడు ఆసుపత్రులు ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యుల సర్వీసును బట్టి, బదిలీలకు అర్హులుగా నిర్ణయించారు.

**ఓ ప్రొఫెసర్..** భిన్నవాదనలు: మెడిసిన్ విభాగంలో ఏళ్ల నుంచి ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఓ వైద్యుడి విషయంలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ వైద్యుడు కొవిడ్ సమయంలో దాదాపు ఏడాదిన్నర పాటు విజయవాడలో సేవలు అందించారు. నాటి ప్రభుత్వం దాన్ని బదిలీగా పరిగణించి, 2023లో జీఓ ఇచ్చింది. అయితే కేజీహెచ్‌లో వేతనం తీసుకుని, విజయవాడలో పని చేసినంత మాత్రాన.. అది బదిలీ కిందకు రాదని, కేవలం డిప్యుటేషనే అవుతుందని మిగిలిన వైద్యులు చెబుతున్నారు. ఇప్పుడు ఆయన బదిలీకి అర్హుడే అని వారు వాదిస్తున్నారు. కానీ, ప్రభుత్వం జీఓ జారీ చేసినందుకు ఆయన పని చేసిన కాలాన్ని డిప్యుటేషన్‌గా పరిగణించలేమని, అది బదిలీ కిందకే వస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ మేరకు ఆయన 2023 నుంచి ఏఎంసీ పరిధిలో కొనసాగుతున్నట్టు తేల్చి, బదిలీల జాబితాలో పేరు చేర్చలేదు.

**ఉరుకులు.. పరుగులు..**

బదిలీకి అవకాశం ఉన్న వైద్యులంతా ఇప్పుడు ప్రజా ప్రతినిధుల వద్దకు పరుగులు తీస్తున్నారు. తమను ఏదో విధంగా ఏఎంసీకి అనుబంధంగా ఉండే కేజీహెచ్, ఇతర ఆసుపత్రుల్లో కొనసాగించేలా చూడాలని విన్నవిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం బదిలీల విషయంలో ఎలాంటి మినహాయింపు ఇవ్వరాదని, జీఓ ప్రకారం బదిలీ చేయాల్సిందేనని తేల్చి చెబుతోంది. భార్యాభర్తలు ఒకే చోట పని చేస్తున్నా, దివ్యాంగులైనా, అనారోగ్య కారణాలతో బాధపడుతున్నా... అలాంటి వారికి కాస్త వెసులుబాటు ఇస్తున్నారు.

# బెత్త విత్తనాల పట్టివేత!

నర్సీపట్నం : తేదీలేని కాంపౌండింగ్ ఫండ్ రసీదుతో వ్యాన్‌లో తరలిస్తున్న బెత్త (రట్టన్) విత్తనాలను అటవీ అధికారులు గొలుగొండ మండలం చీడిగుమ్మల సమీపంలోని చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారు. కొయ్యూరు మండలం అన్నవరం, కన్నవరం, నల్లబిల్లి, పెద అగ్రహారం, చీడిపల్లి గ్రామాల్లో సేకరించిన ఈ విత్తనాలను ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరుకు తీసుకు వెళ్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. బెత్త పిక్కలను మెడలో ధరించే



పూసలుగా తయారు చేసి విక్రయిస్తుంటామని నిందితులు అధికారులకు వివరించారు. ఈ విత్తనాలను మొక్కలుగా పెంచి ఒడిశాకు తరలిస్తుంటారని సమాచారం. ఈ చెట్ల నుంచి వచ్చే కలప ఎంతో నాణ్యమైందిగా చెబుతున్నారు. లాఠీలు, కేన్ ఫర్నీచర్ మాదిరి గృహోపకరణాలు తయారు చేయవచ్చని, కొన్ని రకాల ఔషధాల్లోనూ వినియోగిస్తారని సమాచారం. పట్టుబడిన విత్తనాల విలువ రూ.40 వేల వరకు ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా. తేదీ లేకుండా పట్టుబడిన రసీదు అల్లూరి జిల్లాలోని ఓ రేంజ్ అధికారి పేరున ఉంది. కావాలని తేదీ వేయలేదా... ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. రాత్రి ఈ విత్తనాలు పట్టుబడగా, వ్యాన్‌ను నర్సీపట్నం కలప డిపోకు తరలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి లక్ష్మీనర్స్ వెల్లడించారు.

# పుస్తకాలు వచ్చేశాయ్!






పుట్టపర్తి : పాఠశాలల పునఃప్రారంభ సమయం దగ్గరపడింది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తుగానే విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించేలా విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలో 2,062 ప్రభుత్వ పాఠశాలలుండగా 1,36,933 మంది విద్యార్థులున్నారు. వీరికి పంచేందుకు సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో కిట్లు వచ్చేస్తున్నాయి. పాఠశాలలు తెరిచే నాటికి బ్యాగులు, దుస్తులు, బూట్లు, బెల్టులతో కూడిన కిట్లు విద్యార్థుల చేతిలో ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు, నిఘంటువులు, రాత పుస్తకాలు వచ్చేశాయి. బ్యాగులు, బూట్లు, బెల్టులు, ఏకరూప దుస్తులు సగం వచ్చేశాయి. ఈ నెలాఖరుకు అన్నీ రాగానే పంపిణీ ఆరంభిస్తారు.

**మండల కేంద్రాలకు చేరాయ్..**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాఠ్య పుస్తకాలు చాలా ఆలస్యంగా పాఠశాలలకు వచ్చాయి. కొన్ని పుస్తకాల పంపిణీ ఊసేలేక విద్యార్థులు బయట కొనుక్కోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. కూటమి ప్రభుత్వం వేసవి సెలవుల్లోనే పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాలకు చేరుస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 32 మండలాలోని 2,062 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు 5,53,317 పాఠ్యపుస్తకాలు, 1,19,037 వర్క్ బుక్కులు అవసరం కాగా.. ఇప్పటికే వంద శాతం పుస్తకాలు మండల కేంద్రాలకు చేరాయి.

**తగ్గనున్న సంచి బరువు..**

విద్యార్థుల పుస్తకాల బ్యాగు బరువు తగ్గించేలా విద్యాశాఖ ఈ ఏడాది అడుగులు వేసింది. ఏడాదికి రెండు సెమిస్టర్ల విధానానికి నాంది పలికింది. ఒకటి నుంచి పదో తరగతి వరకూ సెమిస్టర్ విధానంలోనే పాఠ్యపుస్తకాలు రూపొందించారు. అక్టోబరులో రెండో సెమిస్టర్ పుస్తకాలు అందిస్తారు. ఈ విధానం వల్ల పుస్తకాల సంచి బరువు భారీగా తగ్గనుంది. 1, 2 తరగతులు.. సెమిస్టర్‌కు రెండేసి పుస్తకాలుంటాయి. తెలుగు, ఆంగ్లం, గణితం కలిపి ఒకటి. మరొకటి వర్క్‌బుక్ ఉంటుంది. 3, 4, 5 తరగతులు.. తెలుగు, ఆంగ్లం కలిపి ఒకటి. గణితం, పరిసరాల విజ్ఞానం కలిపి మరొకటి ఉంటుంది. నీ 6, 7, 8, 9 తరగతులు.. తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒకటి, జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలను కలిపి ఒకటి, సాంఘికశాస్త్రంలో భౌగోళిక, చరిత్ర, ఆర్థిక, పౌరశాస్త్రాలు కలిపి ఒకటిగా ముద్రించారు. 10వ తరగతికి సెమిస్టర్ విధానం మేరకు పుస్తకాలు రూపకల్పన చేశారు.

**నిఘంటువులు సిద్ధం: క్రిష్టప్ప, డీఈఓ, పుట్టపర్తి**

విద్యామిత్ర కిట్లలో ఆరో తరగతి విద్యార్థులకు నిఘంటువులు ఇవ్వనున్నాం. 13,761వ మందికి ఇవ్వాల్సిన నిఘంటువులు, 82,22 ,660 రాత పుస్తకాలు ఇప్పటికే వచ్చేశాయి. 1,36,933 బ్యాగులు, 1,35,692 బూట్లు, 95,650 బెల్టులు, 1,36,933 ఏకరూప దుస్తుల్లో 50 శాతం వచ్చాయి. మిగిలినవి త్వరలో వస్తాయి.

# డీసీఎంఎస్‌కు శుభగడియలు



అనంతపురం : కమీషన్లకు కక్కుర్తిపడి పాలకవర్గం చేసిన ఓ తప్పు ఆ సొసైటీని దాదాపు 18 ఏళ్లు వెంటాడింది. అప్పటి వరకు లాభాల్లో ఉన్న సొసైటీ ఒక్కసారిగా నష్టాల ఊబిలో కూరుకుపోయింది. ఈ ఊబి నుంచి గట్టెక్కడానికి రెండు దశాబ్దాలు పట్టింది. ఈ ఏడాది ఊహించని విధంగా నష్టాల నుంచి లాభాల పట్టింది. పాలకవర్గాలు చేసిన తప్పిదాలు, అవకతవకల వల్లే సొసైటీలు నష్టాల ఊబిలో కూరుపోతున్నాయని చెప్పడానికి ఇదో ప్రబల ఉదాహరణ. పాలకవర్గ సభ్యుల స్వార్థం, అవినీతి, పనికిమాలిన నిర్ణయాల వల్లే సహకార సంఘాలన్నీ నష్టాల దిశగా పరుగులు పెడుతున్నాయి. దాదాపు రెండు దశాబ్దాల క్రితం తీసుకున్న ఒక నిర్ణయమే జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి శాపమైంది. దాని కథాకమామీషు ఏమిటో ఒకసారి తరచి చూద్దాం.

**అధికారుల పరిపాలనతోనే లాభాల బాట**

గతేడాది నుంచి సహకార బ్యాంకులు, సొసైటీల బాధ్యతలు అధికారులు తీసుకున్నారు. అధికారులు తీసుకున్న మంచి నిర్ణయాల వల్ల సొసైటీ నష్టాల నుంచి లాభాలబాట పట్టింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 24.71 కోట్ల ఎరువుల వ్యాపారం చేయడంతో డీసీఎంఎస్‌కు మంచి లాభాలు వచ్చాయి. దాదాపు రూ. 30 లక్షల నష్టాన్ని పూడ్చి నికరలాభం రూ.4 లక్షలు వచ్చింది. ఇది ఊహించని పరిణామమే. ప్రతి నెలా రూ.7.5 లక్షలు ఉద్యోగులకు జీతాలు సొసైటీ చెల్లిస్తుంది. అయితే అద్దెల ద్వారా సొసైటీకి రూ.9.5 లక్షల ఆదాయం వస్తుంది. వ్యాపారం ద్వారా ఆశించిన లాభాలు రావడంతో నష్టాలు పూడిపోయాయి. ఈసారి దాదాపు రూ. 40 లక్షల వరకు లాభం వచ్చింది. అన్ని ఖర్చులు పోను రూ.4 లక్షల నికర లాభం రావడంతో ఉద్యోగులు ఊపిరిపీల్చుకున్నారు. గతంలో ప్రైవేట్ ఆడిట్ చేయడం వల్ల సొసైటీకి కొంత నష్టం కలిగింది. ఈసారి సహకార శాఖ ద్వారానే ఆడిట్ చేయించారు. కూటమి ప్రభుత్వం మళ్లీ పాలకవర్గాలను నియమించింది. సొసైటీలో ఉన్న అవకతవకలను సరిచేసి ఆదాయం పెంచే నిర్ణయాలు తీసుకుంటే పదికాలాల పాటు మనుగడలో ఉంటుంది.

**కెపాసిటర్ల కుంభకోణమే అసలు కారణం**

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ద్వారా అనేక వ్యాపారాలు నిర్వహిస్తారు. వినియోగదారులకు, రైతులకు సరసమైన ధరలకు నాణ్యమైన వస్తువులు విక్రయించడమే డీసీఎంఎస్ ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్తు ఆదా చేయాలన్న ఆశయంతో ప్రతిరైతు విద్యుత్తు పంపుసెట్టుకు ఒక కెపాసిటరు అమర్చాలని నిర్ణయించారు. అప్పట్లో కలెక్టర్ కూడా ఆదేశాలు జారీ చేయడంతో డీసీఎంఎస్ ముందుకొచ్చింది. కెపాసిటర్లు విద్యుత్తు పరికరాల ఉత్పత్తి సంస్థలతో కొనుగోలు చేసి రైతులకు నేరుగా అందిస్తామని అప్పటి పాలకవర్గ సభ్యులు హామీ ఇచ్చారు. ఒకేసారి దాదాపు రూ. 1.5 కోట్ల విలువైన కెపాసిటర్లు కొనుగోలు చేసి భారీ ఎత్తున కమీషన్లు తీసుకున్నారు. అప్పట్లో 'ఈనాడు'లో వరుస కథనాలు రావడంతో డీసీఎంఎస్ అధ్యక్షుడిగా ఉన్న రామిరెడ్డి రాజీనామా చేశారు. తర్వాత కెపాసిటర్లు డ్వాక్రా సంఘాలకు విక్రయించే బాధ్యతలు అప్పగించారు. కెపాసిటర్లు విక్రయించిన డ్వాక్రా సంఘాలు ఈ సొమ్ములను డీసీఎంఎస్‌కు వెనక్కి చెల్లించలేదు. దీంతో డీసీఎంఎస్‌కు ఒక్కసారిగా రూ.కోటి నష్టం వచ్చింది. ఆ తర్వాత వ్యాపారాలు తగ్గడం వల్ల సొసైటీకి కోలుకోలేని దెబ్బతగిలింది. తర్వాత వచ్చిన పాలకవర్గాలు కూడా పెద్దగా పట్టించుకోకపోవడం వల్ల నష్టాల నుంచి గట్టెక్కలేకపోయింది.

**ఆదాయం పెంచే మార్గాలు అన్వేషిస్తున్నాం**

దాదాపు 18 ఏళ్ల తర్వాత సొసైటీ నష్టాల నుంచి లాభాల్లోకి చేరడం చాలా సంతోషంగా ఉంది. గతంలో కెపాసిటర్లు కొనుగోలు చేయడం వల్ల భారీగా నష్టాలు చవిచూశాం. ఆ నష్టాన్ని పూరించడానికి చాలా సమయం పట్టింది. ఎరువుల వ్యాపారం కూడా పుంజుకోవడంతో సొసైటీకి లాభాలు ఆశించిన మేరకు వస్తున్నాయి. ప్రస్తుతం ఆదాయాన్ని పెంచే మార్గాలను కూడా ఆలోచిస్తున్నాం.
విజయభాస్కర్, డీసీఎంఎస్ మేనేజరు


# ఆనాటి మోత.. ఇప్పటికీ!!

విశాఖపట్నం : వైకాపా ప్రభుత్వ హయాంలో నగర ప్రజలపై పన్ను భారం మోపింది. ఏటా 15 శాతం పెంపుతో తెచ్చిన కొత్త ఆస్తి పన్ను విధానంతో జనంపై రూ.30 కోట్ల భారం వేసింది.

ఈ ఆస్తి పన్ను భారం తగ్గించాలని, పాత పద్ధతిలోనే పన్ను విధానం కొనసాగించాలన్న డిమాండ్లపై కూటమి సానుకూలంగా స్పందిస్తోంది. ఇప్పటికే వైకాపా హయాంలో ఆరంభించిన చెత్త పన్నును రద్దు చేసింది. ఫలితంగా ఏటా రూ.105 కోట్ల భారం నగరవాసులపై తగ్గించింది.

**వైకాపా తెచ్చిన పన్ను విధానం ఇదీ:** ఏటా 15 శాతం ఆస్తి పన్ను పెంచుకుంటూవెళ్లే విధానాన్ని నాడు వైకాపా ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. వార్షిక అద్దె ప్రాతిపదికన (ఏడాది భవనం అద్దెలో మూడ్నెళ్లకు వచ్చే అద్దె) ఆస్తి పన్ను విధించే విధానాన్ని రద్దు చేసి విలువ ఆధారిత ఆస్తి పన్ను విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఒక భవనం ఉండే స్థలం, భవన నిర్మాణానికి అయ్యే వ్యయం లెక్కకట్టి, దానిలో 0.15శాతాన్ని ఆస్తి పన్నుగా విధించాలని, వాణిజ్య సముదాయాలకు 0.30 శాతాన్ని ఆస్తి పన్నుగా విధించేలా నిర్ణయించారు. దీనిపై వ్యతిరేకత రావడంతో నివాస భవనాలకు 0.13శాతాన్ని తీర్మానించారు. దీంతో ఒక్కసారిగా ఒక్కో భవనంపై రూ.10వేలు నుంచి రూ.40వేలు వరకు అదనపు భారం పడింది. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో అప్పటి వరకు ఉన్న పన్నుపై ప్రతి ఏటా 15శాతం పెంపుదల చేసేలా అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది.

**ఏటా రూ.30 కోట్ల భారం:** వైకాపా నిర్వాకంతో నగర ప్రజలపై ఏటా రూ.30 కోట్ల అదనపు భారం తప్పలేదు. జీవీఎంసీ పరిధిలో



6,42,234 అసెస్‌మెంట్లు ప్రస్తుతానికి ఉండగా, వాటన్నింటిపైనా భారం తప్పలేదు. కొత్తగా ఆస్తి పన్ను పరిధిలోకి వచ్చేవారికి మొత్తం విలువపై 0.13శాతాన్ని ఆస్తి పన్నుగా విధించగా, ప్రతి ఏటా పెరిగిన భూమి విలువ ఆధారంగా మళ్లీ పెంపుదల ఉండేది. నగరంలో 50 గజాల్లోపు ఇళ్లకు అర్ధ సంవత్సరానికి రూ.50 ఆస్తి పన్ను విధిస్తామని వైకాపా అంతకుముందు కల్లబొల్లి కబుర్లు చెప్పింది. నగరంలోని మురికివాడల్లో జీప్లస్-1 తరహా ఇళ్లు ఉండటంతో వాటికి రూ.50 ఆస్తి పన్ను వర్తించదు. దీంతో మురికివాడల్లో ఉన్నవారు సైతం వైకాపా పన్నుకు బలైపోయారు.

**ఎన్నికల హామీలో:** అధికారంలోకి వచ్చిన వెంటనే 'చెత్త పన్ను' రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం దానిని అమలు చేసింది. పాత ఆస్తి పన్ను విధానాన్ని అమలు చేస్తామని కూడా హామీ ఇవ్వగా, త్వరలో దానిని కూడా నెరవేర్చే కసరత్తు చేస్తోంది.

మంత్రి నారాయణ విశాఖలో ఇటీవల నిర్వహించిన సమీక్షలో... విలువ ఆధారిత ఆస్తి పన్ను విధానాన్ని రద్దు చేయాలని నగర ఎమ్మెల్యేలు కోరారు. అందుకు అనుగుణంగా కౌన్సిల్ తీర్మానం పంపించాలని కోరినట్లు కార్పొరేటర్లు చెబుతున్నారు. దీంతో ఈ నెల 6న జరిగే కౌన్సిల్‌లో విలువ ఆధారిత ఆస్తి పన్ను రద్దు చేయాలన్న అంశంపై చర్చించి, అనుకూలంగా తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

# అంతా అవినీతి.. కబ్జాపై ప్రీతి!

విశాఖపట్నం : నగర శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములకు రక్షణ కరవైంది. ఖాళీ స్థలం కనిపిస్తే రాజకీయ నాయకుల అనుచరులు కబ్జాలకు తెగబడుతున్నారు. రాత్రికి రాత్రి మందిరాల పేరిట అక్రమ నిర్మాణాలు కట్టేస్తున్నారు. కళ్ల ముందే ఇంత జరుగుతున్నా రెవెన్యూ శాఖ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నా రు. కబ్జాల వెనుక కొందరు ప్రజాప్రతినిధుల హస్తం ఉన్నందునే చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

**500 గజాల స్థలంపై కన్ను:** ఆరిలోవ నైపుణ్యాభివృద్ధి కేంద్రం భవనం నుంచి ఆఖరి బస్‌స్టాప్ మీదుగా ముడసర్లోవ గోల్ఫ్ క్లబ్ వెనుక నుంచి.. తిరిగి బీఆర్‌టీఎస్‌కు చేరుకునేందుకు 80 అడుగుల రహదారిని విస్తరించారు. దీనికిగాను కొండను తొలచగా వచ్చిన గ్రావెల్‌ను బీఆర్‌టీఎస్ రహదారికి, ఇతర అవసరాలకు వినియోగించారు. దీంతో కొండకు రహదారి మధ్యలో సుమారు 100 అడుగుల వెడల్పుతో ఖాళీ స్థలం ఏర్పడింది. సర్వే నెంబరు 27 స్థలంలోని కొంత భాగంలో ఓ మందిరం, సామాజిక భవనం, జీవీఎంసీ కల్యాణమండపం, ఆసుపత్రి నిర్మించారు. మిగిలిన ఖాళీ స్థలంపై రాజకీయ నాయకుల కళ్లు పడ్డాయి. అక్కడ మందిరాలు, సామాజికవర్గాల పేరిట ఆక్రమణ



లకు పాల్పడేందుకు రంగం సిద్ధం చేశారు.

ఇటీవల ఆసుపత్రి, దేవాలయానికి మధ్యలో సుమారు 500 గజాలకుపైగా ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేసి కబ్జా చేసేందుకు నేతలు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు.

ఒకరిని చూసి మరొకరు..: సర్వేనెంబరు 27లో సామాజిక భవనం దాటిన తర్వాత స్థానికంగా ఓ వ్యక్తి మేకల పెంపకం పేరిట కొంత స్థలాన్ని ఆక్రమించగా, దాని వెనుకనే ఉన్న స్థలంలో గతంలో వైకాపాలో ఉండి ప్రస్తుతం తెదేపా నేతగా చెప్పుకునే నాయకుడు రాత్రికి రాత్రి ఓ మందిరం నిర్మించేసి ఆక్రమించారు. దీనిపై ఫిర్యాదులు అందినా అధికారులు స్పందించలేదు. ఈ స్థలాన్ని దాటిన తరువాత కొందరు ఓ మందిరం నిర్మించేందుకు తవ్వి...పునాదుల నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. వీరిని చూసి మరో వర్గం నాయకులు కూడా పక్కనే ఉన్న స్థలాన్ని దక్కించుకోవడానికి పావులు కదుపుతున్నారు.

రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే పరిరక్షించాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పటికైనా స్పందించకపోతే ఆరిలోవ శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలకు రెక్కలు వస్తాయని, భవిష్యత్తులో ప్రభుత్వ అవసరా లకు భూములు దొరకని పరిస్థితి నెలకొంటుందని స్థానికులు చెబుతున్నారు.

## రకుల్ సొగసు చూడ తరమా..!

రకుల్ ప్రీత్ సింగ్ మళ్లీ బిజీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. టాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోలకు సైతం డేట్లు ఇవ్వలేనంత బిజీగా సినిమాలు చేసిన విషయం తెల్సిందే. ఈమె కోసం నెలల తరబడి వెయిట్ చేసిన హీరోలు కూడా తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఉన్నారు అంటే అతిశయోక్తి లేదు. అలాంటి స్టార్‌డం దక్కించుకున్న రకుల్ ప్రీత్ సింగ్ తక్కువ సమయంలోనే టాలీవుడ్‌కి దూరం అయింది. టాలీవుడ్ లో ఆఫర్లు తగ్గడంతో బాలీవుడ్‌లో ప్రయత్నాలు చేసింది. అయితే బాలీవుడ్‌లో వరుసగా ఆఫర్లు దక్కినా లక్ కలిసి రాకపోవడంతో అక్కడ కూడా ప్రస్తుతం పెద్దగా ఆఫర్లు లేవు. అయినా కూడా సోషల్ మీడియాలో ఈమె జోరు తగ్గడం లేదు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఈమె దే దే ప్యార్ దే 2 సినిమాలో నటిస్తోంది. 2019లో వచ్చిన దే దే ప్యార్ దే సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో సీక్వెల్‌పై అంచనాలు ఉన్నాయి. మొదటి పార్ట్‌లో రకుల్ ప్రీత్ సింగ్‌కి నటిగా మంచి పేరును తెచ్చి పెట్టింది. అంతే కాకుండా రకుల్ అందాన్ని చూపించేందుకు కూడా స్కోప్ దక్కింది. ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్‌కి పెద్దగా క్రేజ్ లేదు. అయినా కూడా రకుల్ ప్రీత్ సింగ్ సోషల్ మీడియాలో ఏ ఫోటోలు షేర్ చేసినా వైరల్ అవుతూనే ఉంటాయి. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి



ఫిజిక్ ఈమె సొంతం అంటూ ఉంటారు. అందుకే ఈమెను అత్యధికులు అభిమానిస్తూ ఉంటారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమెకు ఏకంగా 2.5 కోట్ల మంది ఫాలోవర్స్ ఉన్న విషయం తెల్సిందే. తాజాగా ఈమె %ను% సిటీ షోస్టాపర్స్ అనే డిజిటల్ మ్యాగజైన్ కోసం ఫోటో షూట్ ఇచ్చింది. ఆ ఫోటో షూట్‌లో ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. రకుల్ సొగసు చూడ తరమా అన్నట్లుగా ఈ పోటోలు ఉన్నాయి. అందమైన రకుల్ ప్రీత్ సింగ్ అంతకు మించిన అందమైన ఔట్ ఫిట్ ధరించి, ఒక పెయిటింగ్ మాదిరిగా ఫోజ్ ఇస్తే ఎలా ఉంటుందో అలాగే ఈ ఫోటోలో ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇంతటి అందగత్తెకు టాలీవుడ్‌లో రావాల్సిన ఆఫర్లు రావడం లేదు, దక్కాల్సిన గుర్తింపు దక్కడం లేదు అంటూ పలువురు సోషల్ మీడియా ద్వారా అసహనం వ్యక్తం చేస్తున్నారు. రకుల్ ప్రీత్ సింగ్ అందాల ఆరబోత కెరీర్ ఆరంభంతో పోల్చితే ఏమాత్రం తగ్గలేదని కూడా కొందరు అభిమానులు కామెంట్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో 2011లో కేరటం సినిమాతో అడుగు పెట్టిన రకుల్ ప్రీత్ సింగ్‌కి 2013లో వచ్చిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌తో మంచి గుర్తింపు లభించింది. సందీప్ కిషన్ హీరోగా నటించిన ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో రకుల్ ప్రీత్ సింగ్ క్రేజ్ అమాతం పెరిగింది. టాలీవుడ్‌లో మహేష్ బాబు, ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్, సాయి ధరమ్ తేజ్, నాగ చైతన్య, రవితేజ, రామ్, మంచు మనోజ్, గోపీచంద్ వంటి స్టార్స్‌తో సినిమాల్లో నటించింది. కోలీవుడ్‌లోనూ ఈమె పలువురు స్టార్ హీరోలకు జోడీగా నటించి మెప్పించింది. అందం విషయంలో ఏమాత్రం తగ్గని ఈ అమ్మడు ముందు ముందు మళ్లీ ఈ అమ్మడు బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## 'కేజీఎఫ్ -3' లో ఛాన్స్ అడిగిన బ్యూటీ!

'కేజీఎఫ్' ఫ్రాంచైజీ పాన్ ఇండియాలో ఎలాంటి సంచలనాలు నమోదు చేసిందో తెలిసిందే. రెండు భాగాలు భారీ విజయం సాధించి కన్నడ ఇండస్ట్రీ పేరు పాన్ ఇండియాలో మారు మ్రోగించింది. దీంతో యశ్ పాన్ ఇండియా స్టార్ గా మారిపోయాడు. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇండియాలో బిజీ డైరెక్టర్ అయిపోయారు. కానీ ఇదే సినిమాలో హీరోయిన్ గా నటించిన కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి మాత్రం ఆ రేంజ్ లో వెలగలేకపోయింది. 'కేజీఎఫ్' తర్వాత మరో ఛాన్స్ అందుకోవడానికి నాలుగేళ్లు పటింది. విక్రమ్ హీరోగా నటించిన 'కోబ్రా'లో నటించింది. అక్కడ నుంచి టాలీవుడ్ కి ప్రమోట్ అవ్వడానికి మరో మూడేళ్లు సమయం పట్టింది. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'హిట్ ది థర్డ్ కేసు'లో నటిస్తోంది. 'తెలుసు కదా' అనే మరో చిత్రం లోనూ ఛాన్స్ అందుకుంది. ముందుగా 'తెలుసు కదా'లోనే ఛాన్స్ అందుకుంది. ఆ తర్వాతే 'హిట్' లో అవకాశం



వచ్చింది. ఇవన్నీ పక్కనబెడితే 'కేజీఎఫ్ 3' కూడా ప్రకటించిన సంగతి తెలిసిందే. అది ఎప్పుడు ప్రారంభమ వుతుంది? అన్నది తెలియదుకానీ అందులో హీరో యశ్ మాత్రం యధావిధిగా కొనసాగుతాడు. పాత పాత్రలతో పాటు కొన్ని కొత్త పాత్రలు యాడ్ అవుతాయి. ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ మరింత ప్రతిష్టా త్మకంగాను తెరకె క్కిస్తాడు. మరి హీరోయిన్ సంగతేంటి? రెండు భాగాల్లోనూ నటించిందని శ్రీనిధిని తప్పించి కొత్త భామను తీసుకుం టారా? అన్న సందేహం రావడం సహజమే. ఇదే డౌట్ శ్రీనిధికు వచ్చింది. అందుకే ప్రశాంత్ నీల్ ని కలిసిన సమయంలో ఈ విషయం గురించి అడుగుతూనే ఉందిట. ఆ మధ్య ముంబైలో ఓ సినిమా షూట్ సందర్భంగా యశ్ ని కలిసినప్పుడు కూడా ఈ విషయం గురించి సరదాగా అడిగిందిట. కేజీఎఫ్ 2లో నా పాత్రని చంపేసారు. కేజీఎఫ్ 3 ప్లాన్ ఏంటి? అని అడిగా. మరి ఉన్నానా? లేనా? అన్నది అప్పుడే క్లారిటీ రాదు. అందుకు చాలా సమయం పడుతుందని తెలిపింది.




## 'హరిహర వీరమల్లు' ట్రైలర్: పులిని వేటాడే బెబ్బులి




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న భారీ చారిత్రక చిత్రం హరి హర వీర మల్లు పార్ట్ 1: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్ ట్రైలర్ ప్రస్తుతం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. చాలాకాలంగా ఎదురుచూస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మూడున్నర నిమిషాల ట్రైలర్ ఇవాళ విడుదలవగా, అభిమానులు, ప్రేక్షకుల్లో విపరీతమైన హైప్‌ను కలిగించింది. ట్రైలర్ మొత్తం పవన్ కల్యాణ్ యొక్క పవర్ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆసక్తికరంగా సాగుతుంది. అర్జున్ దాస్ వాయిస్ ఓవర్ తో మొదలైన ఈ ట్రైలర్ గూస్ బంప్స్ ఇచ్చేలా ఉంది. ఇక పవన్ కల్యాణ్ వీర మల్లు అనే అప్రతిహత యోధుడిగా కనిపించడం మెయిన్ హైలెట్. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ముఘల్ సామ్రాజ్యానికి ఎదురు నిలిచే కథనంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. బాబీ డియోల్ ఔరంగజేబ్‌గా భయానకమైన పాత్రలో కనిపించగా, కోహినూర్ డైమండ్ కోసం జరుగుతున్న పోరాటం నేపథ్యంగా వీర మల్లు, ఔరంగజేబ్ ల మధ్య జరిగే యుద్ధమే చిత్రానికి హైలైట్. యాక్షన్, విజువల్స్ బిగ్ స్క్రీన్ పై మరింత కిక్కిచ్చేలా ఉన్నాయి. పవన్ కల్యాణ్ లుక్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ.. అన్నీ కలిపి ఒక పవర్‌ఫుల్ యోధుడిగా తెరపై నిండుగా కనిపిస్తారని తెలుస్తోంది. "ఆంధి వచ్చేసింది" అనే డైలాగ్ ఒక్కటే అభిమానుల్లో గూస్‌బంప్స్ కలిగిస్తోంది. "అందరూ నేను రావాలని దేవుణ్ణి ప్రార్థిస్తారు... మీరు మాత్రం నేను రాకూడదని కోరుకుంటున్నారు" అనే మరో డైలాగ్ కూడా ఆయన రాజకీయమైన ప్రస్తుత స్థితిని ప్రతిబింబించడంతో ట్రైలర్‌కు మరింత బలాన్ని తెచ్చిపెట్టింది. అలాగే పులిని వేటాడే బెబ్బులి అనే డైలాగ్ కూడా పవర్ స్టార్ ఇమేజ్ కు తగ్గట్టుగా ఉంది. దర్శకుడు జ్యోతి క్రిష్ణ ఈ చారిత్రక చిత్రాన్ని మెగాస్కేల్‌లో రూపొందిస్తూ.. భారీ కాన్వాస్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో ప్రేక్షకులకు థియేట్రికల్ ఫీస్ట్ అందించనున్నట్లు అర్థమవుతుంది. ట్రైలర్‌లో కనిపించిన యుద్ధ సన్నివేశాలు, సనాతన ధర్మంపై ప్రధాన పాత్ర పోరాటం సినిమాలోని ప్రధాన బలంగా నిలవనున్నాయి. ట్రైలర్‌ను బట్టి చూస్తే, జ్యోతి క్రిష్ణ విజన్ పూర్తిగా గ్రాండ్ స్క్రీన్ అనుభూతిని ఇవ్వాలన్నదే. పంచమిగా నటించిన నిధి అగర్వాల్ పాత్ర కూడా ట్రైలర్‌లో ఆకట్టుకుంటోంది. సునీల్, భరణి లాంటి ప్రముఖ నటులు కూడా సినిమాలో ప్రత్యేకమైన పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. సినిమాటోగ్రాఫర్లు జ్ఞాన శేఖర్ VS, మనోజ్ పరమహంసా లు కలిసిచేసిన విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. తోట తరణి వేసిన సెట్లు ముఘల్ కాలానికి తగినంత వైభవాన్ని చూపించగా, కీరవాణి సంగీతం ఎమోషన్‌కు అర్థం చెప్పే విధంగా సాగుతోంది. ప్రకాశం KL ఎడిటింగ్ కూడా ట్రైలర్‌ను కట్టిపడేస్తోంది.

## ట్రెండ్ పాన్ ఇండియా అయినా టాలీవుడ్ మార్క్!



టాలీవుడ్ మాస్ ని బాలీవుడ్ కి సైతం పరిచయం అవుతోంది ఇప్పుడిప్పుడే. ఇటీవలే జాట్ తో పక్కా కమర్శియల్ సినిమా చేసి తెలుగు సినిమా ఫార్ములా ఇదీ అని అక్కడ నిరూపిం చాడు గోపీచంద్ మలినేని. ఈ సినిమాకు ఉత్తరాది రాష్ట్రాల్లో మంచి రెస్పాన్స్ వచ్చింది. మాస్ ఆడియన్స్ ను కనెక్ట్ చేయడంలో నూరుపాళ్లు సక్సెస్ అయింది. ఇలాంటి కమర్శియాల్టీ బాలీవుడ్ లో కనిపించదు. అక్కడ మేకింగ్ స్టైల్ వేరు. టాలీవుడ్ స్టైల్ వేరని ప్రూవ్ చేసారు. టాలీవుడ్ నుంచి రిలీజ్ అవుతున్న పాన్ ఇండియా చిత్రాల్లో సైతం ఐటం పాటలతో ఉత్తరాదిని ఏ రేంజ్ లో ఊపుతున్నారో చెప్పాల్సిన పనిలేదు. పుష్ప లో ఊ అంటావా మావ పాట అక్కడ ఏ రేంజ్ ఊపు తెచ్చిందే తెలిసిందే. నార్త్ లో సైతం రీల్స్ హల్చల్ చేసాయి అటుపై పుష్ప 2 లో కిసిక్ పాటే అంతే కనెక్ట్ అయింది. అంతకు ముందు కేజీఎఫ్ లోనూ స్పెషల్ సాంగ్ తో అలరించిన సంగతి తెలిసిందే. తమన్నా స్టెప్పు లకు ఓ రేంజ్ లో రెస్పాన్స్ వచ్చింది. మల్లికా షెరావత్, మలైకా అరోరా దిగొచ్చినట్లే అనిపించింది. ప్రస్తుతం యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో చేస్తోన్న డ్రాగన్ లోనూ అలాంటి స్పెషల్ సాంగ్ ఒకటి ప్లాన్ చేస్తున్నారు. ఇది నెక్ట్స్ లెవల్లో ఉంటుందని సమాచారం. ఈ పాట కోసం శ్రుతి హాసన్ ని రంగంలోకి దించుతున్నారు. అలాగే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న పెద్ది చిత్రంలో సైతం బుచ్చిబాబు ఇలాంటి ఛాన్స్ తీసుకునే అవకాశం ఉంది. గ్లోబల్ స్టార్ తో పక్కా మాస్ సినిమా తెరకెక్కిస్తున్నాడు. అలాంటప్పుడు హీటెక్కించే ఐటం పాట లేకుండా పెద్ది ఉంటుందా? లేకపోతే అభిమానులు ఊరుకుంటారా? ఇలా పాన్ ఇండియా చిత్రాల్లో సైతం మేకర్స్ టాలీవుడ్ కి కలిసొచ్చిన ఐటం సాంగ్ ను జత చేస్తూ ఇండియాని అల్లాడిస్తున్నారు.

## చీరకే అందాన్ని తెచ్చేలా అనసూయ హొయలు

మొదట టీవీ యాంకర్‌గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు అందుకున్న అనసూయ భరద్వాజ్, తన మల్టీటాలెంట్‌తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చినప్పటి నుంచి వరుసగా అభిమానులను అలరిస్తూనే ఉంది. 'క్షణం' సినిమాలో విలక్షణమైన పాత్రతో ఆకట్టుకున్న అనసూయ, 'రంగస్థలం'లో రంగమ్మత్త పాత్రతో మరింత క్రేజ్ సంపాదించింది. యాంకర్‌గా ఉన్నంత వరకు కేవలం గ్లామర్ షోకే పరిమితమవుతుందనుకున్నవారికి అనసూయ నటనతో సమాధానం చెప్పింది. తాజాగా అనసూయ చీరలో చేసిన ఒక ఫోటోషూట్ సోషల్ మీడియాలో దుమ్ము రేపుతోంది. గోధుమ రంగు మరియు ఆకుపచ్చ కలర్ మిక్స్ లో ఉన్న చీర, ఆమె అందాన్ని రెట్టింపు చేసింది. నెమలి ఆకారంలో మెరిసే ఈ డిజైన్ చీరలో అనసూయ చూపించిన ఎక్స్‌ప్రెషన్లు ఫ్యాషన్ వర్గాల్లో ప్రత్యేకంగా ట్రెండ్ అవుతున్నాయి. ఈ



లుక్‌లో ఆమె మెరిసే మేకప్, నాజూకైన ఆభరణాలు, మెరుపులా మెరిసే హెయిర్ స్టైల్ అన్నీ కలిసి పర్ఫెక్ట్ ట్రెడిషనల్ లుక్‌ను ఇచ్చాయి. ఆమె చూపిన గ్లామర్ డోస్‌తో పాటు గౌరవంగా నిలిచే హావభావాలు ఆమెలో ఉన్న వేరైటీని హైలైట్ చేస్తున్నాయి. సాధారణంగా చీరలలో లావణ్యంగా కనిపించటం కొంతమంది యాంకర్లకు కష్టంగా మారినా, అనసూయ మాత్రం తన క్యూట్ లుక్స్ తో మరింత అందాన్ని తెచ్చింది.

ప్రస్తుతం అనసూయ ఫ్లాష్ బ్యాక్ అనే తమిళ సినిమాతో బిజీగా ఉంది. ఇదిలా ఉంటే, ఆమె తాజా ఫొటోలు చూస్తుంటే చీరకే ఓ కొత్త జీవం ఇచ్చినట్టుగా అనిపిస్తోంది. ఫ్యాషన్ స్టేట్మెంట్ ఇవ్వడంలో అనసూయకు ప్రత్యేకత ఉందని ఈ లుక్ మరోసారి రుజువు చేసింది. ఈ ఫొటోలు చూసిన అభిమానులు రంగమ్మత్త స్టైల్ రిటర్న్.. అంటూ పాజిటివ్ గా కామెంట్స్ చేస్తున్నారు.

## కథ విన్నప్పుడే ఆ విషయం ఫిక్సయ్యా

కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ శ్రీనిధి శెట్టి. కెజిఎఫ్1, కెజిఎఫ్2 సినిమాలతో మంచి ఫాలోయింగ్ సంపాదించిన శ్రీనిధి ఇప్పుడు టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన హిట్: ది థర్డ్ కేస్ సినిమాలో శ్రీనిధి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో శ్రీనిధి మీడియాతో మాట్లాడి పలు విషయాలను షేర్ చేసుకుంది. కెజిఎఫ్, కెజిఎఫ్2, ఇప్పుడు హిట్3 మూడూ సినిమాలూ హింసతో కూడుకున్నవేనని, కానీ తాను మాత్రం చాలా సాఫ్ట్ అని, వయొలెన్స్ ను తాను వద్దనుకున్నా, వయొలెన్స్ తనను వద్దనుకోవడం లేదని, అయితే హిట్3 సినిమా మొదటి సీన్ నుంచి వయొలెన్స్ గా ఉండదని, అవసరమైన చోట మాత్రమే ఇందులో యాక్షన్ ఉంటుందని, కెజిఎఫ్ సినిమాలకు హిట్3 సినిమాకు చాలా తేడా ఉందని చెప్పింది. ఈ సినిమా కథ విన్నప్పుడే యాక్షన్ సినిమా అని అర్థమైందని, అప్పుడే ఈ సినిమాకు ఏ సర్టిఫికేట్ వస్తుందని అర్థమైందని, ఈ విషయంలో నానితో ఏ సర్టిఫికేట్ మూవీ చేయడానికి నీకు 16 ఏళ్లు పట్టింది కానీ నేను నాలుగో సినిమాతోనే ఈ ఫీట్ ను సాధించానని చెప్తుంటానని శ్రీనిధి తెలిపింది. అయితే అందరూ



అనుకున్నట్టు ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాదని శ్రీనిధి ఈ సందర్భంగా క్లారిటీ ఇచ్చింది. హిట్3 లో క్రైమ్, ఇన్వెస్టిగేషన్, డ్రామా, యాక్షన్, లవ్, అన్నీ ఉంటాయని, కాకపోతే యాక్షన్ కొంచెం ఎక్కువగా ఉంటుందని, వయొలెంట్ గా ఉండే అర్జున్ సర్కార్ ను కూల్ చేసే భార్య, ప్రేయసి మృదుల క్యారెక్టర్ లో తాను కనిపిస్తానని, సినిమాలో అర్జున్, మృదుల మాట తప్పించి ఇంకెవరి మాటా వినడని, అందుకే కథలో అవసరమైన ప్రతీ చోటా తన పాత్ర కనిపిస్తుందని, దాంతో పాటూ తన క్యారెక్టర్ కు మరో ఇంట్రెస్టింగ్ యాంగిల్ కూడా ఉందని, అదేంటనేది స్క్రీన్ పైనే చూడాలని శ్రీనిధి తెలిపింది. తెలుగులో పరిచయం అవుతున్న మొదటి సినిమాకు సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవాలనే ఆశతో ఈ సినిమాకు తానే డబ్బింగ్ చెప్పానని, కన్నడ అమ్మాయిలా కాకుండా తెలుగమ్మాయిలా ఈ సినిమాకు డబ్బింగ్ చెప్పానని, ఈ విషయంలో డైరెక్టర్ శైలేష్ తనకెంతో సాయం చేశాడని చెప్పింది. ఇదే ఇంటర్వ్యూలో బాలీవుడ్ లో తెరకెక్కుతున్న రామాయణం సినిమాలో సీత పాత్ర గురించి కూడా శ్రీనిధి క్లారిటీ ఇచ్చింది. రామాయ ణం సినిమాకు తాను కేవలం ఆడిషన్ మాత్రమే ఇచ్చానని, కానీ మ ళ్లీ చిత్ర యూనిట్ నుంచి తనకెలాంటి ఫోన్ రాలేదని, సీత పాత్ర తన కు వస్తే తాను వదులుకున్నానని వస్తున్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని, అసలు అలాంటి పాత్రలు వస్తే ఎవరైనా ఎందుకు వదులుకుం టారని ప్రశ్నించింది. ప్రస్తుతం తెలుగులో సిద్దూ జొన్నలగడ్డ సరసన తెలుసు కదా సినిమా చేస్తున్న శ్రీనిధి, కెజిఎఫ్3లో తాను ఉంటుందో ఉండదోననే ప్రశ్నను డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ను అడగాలని చెప్పింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536